


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★


వెనిజులాపై రేపోమాపో అమెరికా దాడులు! **02**

సంచార్ సాథీ యాప్.. సెల్‌ఫోన్ వినియోగదారుల గోప్యతకు విఘాతం

మోదీ సర్కారు ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చే చర్యలు.. 'దాదాపు డెత్ వారెంటే' **05**


సంపుటి 09, సంచిక: 08 | గురువారం | 04-12-2025 | కరీంనగర్ — Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar — పేజీలు: 12+8 | వెల రూ. 5.00





# కార్మిక కోడ్‌లు వద్దు

## పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్షాల నిరసన

**న్యూఢిల్లీ :** నూతన కార్మిక్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష ఎంపిలు బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో కోడ్‌లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంటు మకర ద్వారం ఎదుట జరిగిన నిరసనలో కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, వామపక్ష పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. నిరసనలో ప్రియాంక గాంధీ వాద్రా, టిఎంసికి చెందిన డోలా సేన్ (టిఎంసి), కనిమోళి, ఎ రాజా (డిఎంకె), వామపక్ష ఎంపిలు జాన్ బ్రిట్టాస్ సుదామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం 'కార్మిక వ్యతిరేక, శ్రామిక వ్యతిరేక, ఆశ్రితుల అనుకూలమైనద'ని ఖర్గే ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు ప్రాంగణంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపాయని, కొత్తగా అమలు చేస్తున్న కార్మిక కోడ్‌లపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయని విపక్షాల నిరసన తర్వాత మల్లికార్జున ఖర్గే తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.'కొత్త కోడ్‌లలో ఉద్యోగ భద్రతకు ముప్పు, లేఆఫ్ పరిమితిని 100 నుండి 300 మందికి పెంపు వంటి కొన్ని తీవ్రమైన ఆందోళనకరమైన అంశాలు తరువాయి 2లో

పార్లమెంటు సజావుగా నడిపించాల్సిన

## బాధ్యత ప్రభుత్వానిదే

విపక్ష పార్టీల ఉమ్మడి సమావేశంలో స్పష్టం

**న్యూఢిల్లీ :** పార్లమెంటు శీతాకాల సమావేశాలలో అవలంభించాల్సిన వ్యూహంపై ప్రతిపక్ష పార్టీలు బుధవారం చర్చించాయి. కాంగ్రెస్, డిఎంకె, ఆర్‌జెడి, ఎస్‌పి, జెఎంఎం, సిపిఐ, సిపిఐ(ఎం), ఐయుఎంఎల్, ఎన్‌సిపి(ఎస్‌పి), శివసేన(యుబిటి) సహా వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) దీనికి దూరంగా ఉంది. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ఛాంబర్‌లో జరిగిన సమావేశంలో రాహుల్‌గాంధీ సహా ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్లు పాల్గొన్నారు. తమ ఐక్యత, ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి కారణంగా సర్ తో సహా ఎన్నికల సంస్కరణలపై చర్చించాలనే తమ డిమాండ్‌ను అధికార పక్షం అంగీకరించాల్సి వచ్చిందని ప్రతిపక్ష నాయకులు నొక్కి చెప్పారు. పార్లమెంట్ సజావుగా పనిచేయాలని, దానిని నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అని అన్నారు.

# రూపాయి చారిత్రక పతనం

డాలరుకు 90.30 రూపాయలు మారకం

విదేశీవాటాల ఉపసంహరణ,

చమురు ధరల పెరుగుదలే కారణం




**ముంబై:** డాలరుతో రూపాయి మారకం విలువ చారిత్రకస్థాయిలో పతనమైంది. డాలరు మారకంలో రూపాయి విలువ ఇరవైఐదు పైసలు బలహీనపడి మారకం విలువ రూ.90.21 లకు చేరుకుంది. మార్కెట్‌లో వరుసగా నాలుగోరోజు కూడా రూపాయి డీలా పడిపోయింది. మంగళవారం నాడు 43 పైసలు బలహీన పడి జీవితకాల కనిష్ఠ స్థాయిలో 89.96 రూపాయలవద్ద స్థిరపడింది. బుధవారం నాలుగోరోజు కూడా విదేశీ వాటాల ఉపసంహరణ, చమురు ధరలు భారీగా పెరుగుదల కారనంగా మారకం విలువ చారిత్రస్థాయిలో 90.30 స్థాయికి పతనమైంది. భారత్–అమెరికా సంబంధాల్లో అనిశ్చితి, రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) తరువాయి 2లో

తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు చైర్మన్‌గా

## చాడ వెంకట్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు నూతన చైర్మన్‌గా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఎన్నికైయ్యారు. బుధవారం హైదరాబాద్ లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియం లైబ్రరీ హాల్‌లో ట్రస్టు సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి అధ్యక్షతన జరిగిన స్మారక ట్రస్టు సమావేశం చాడ వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా తరువాయి 12లో

# విద్యా సంస్థలు నిర్వీర్యం

కేంద్ర ప్రభుత్వంపై సిపిఐ నేత సందోష్ కుమార్ విమర్శ

ఈనెల 9న దేశవ్యాప్త పోరాటం తప్పదని స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** దేశంలో విద్యా సంస్థలు నిర్వీర్యమైపోతున్నాయని రాజ్యసభలో సిపిఐ నేత పి. సంతోష్ కుమార్ అన్నారు. రాజ్యసభలో బుధవారం ఆయన మాట్లాడుతూ, దేశంలోని విశ్వవిద్యాలయాలు, కాలేజీల ఉపాధ్యాయుల సేవా పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, ఇందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతర దోపిడీ, సంస్థాగత నిర్లక్ష్యం కారణంగా ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (ఎఐఎఫ్‌యుసిటిఒ) తరువాయి 2లో

డిస్కౌంట్ల పేరుతో

## టూరిజం నిధులు గోల్‌మాల్!

అధికారికి షోకాజ్ నోటీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ పర్యటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి)లో రోజుకొక కుంభకోణం వెలుగు చూస్తోంది.తాజాగా టూరిజం ట్రాన్స్‌ఫోర్ట్ విభాగంలో డిస్కౌంట్ల పేరుతో భారీ ఎత్తున నిధులను కాజేసి సంస్థకు శఠగోపం పెట్టిన ఉదంతం వెలుగు చూసింది. ఈ మేరకు సంస్థ ఎండి వల్లూరి క్రాంతి సదరు ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ రాజలింగంకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెళ్లిలు, పేరంటాలకు, విందులు, వినోద తదితర విహార యాత్రలకు ప్రజలు, తరువాయి 2లో

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా

## భవిష్యత్ సంకల్పంతో ముందుకు

'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ – 2047' కు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సిఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక ఆహ్వానం

అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8,9 తేదీలలో నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ –2047' కు రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఢిల్లీలో బుధవారం పార్లమెంట్‌లో ప్రధాని మోదీని సిఎం, డిప్యూటీ సిఎం కలిసి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను అందించారు. కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్న వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని ప్రధానికి వివరించారు. అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు చెప్పారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో తరువాయి 2లో

# పదేళ్ళలో 20 లక్షల ఇండ్లు కట్టిస్తాం



మంత్రులతో కలిసి పని చేసే నాయకులను ఎన్నుకోవాలి

హుస్నాబాద్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు

ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి

గత పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క డబుల్ బెడ్రూం ఇవ్వలేదని పదేళ్ళు ప్రజా ప్రభుత్వం అధికారంలో ఉంటుందని పదేళ్ళలో రాష్ట్రంలో 20 లక్షల ఇండ్లు కట్టిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. గత పాలకుల్లా మేం హుస్నాబాద్‌ను నిర్లక్ష్యం చేయమని ఎన్ని నిధులైన ఖర్చు చేసి హుస్నాబాద్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉందని సర్దార్ సర్వాయి పాపన్న నేతృత్వంలో బహుజన రాజ్యానికి పునాదులు వేసిన గడ్డ ఇది అని అన్నారు. తెంగాణ రాష్ట్ర సాధనలో కరీంనగర్ ప్రజలు కీలక పాత్ర పోషించారని అందుకే కరీంనగర్ వేదికగా మాట ఇచ్చి నిలబెట్టుకున్నారని అన్నారు. అరవై ఏళ్ళ కలను నేరవేర్చిన సోనియమ్మను కలిసి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు మల్లిఖార్జున ఖార్గే, రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ,ప్రధాని మోడీని కలిసి ఆహ్వానించి వచ్చానని తెలిపారు. డిసెంబర్ 3కు ప్రత్యేకత ఉందని మీ ఓటును ఆయుధంగా మార్చి దుర్మార్గ పాలనను అంతమొందించి ప్రజా పాలనను తసుకొచ్చిన రోజు ఇది అని అన్నారు. అంతే కాకుండా తెలంగాణ కోసం శ్రీకాంత చారీ అమరుడైన రోజు ఇదని ఆయన ఆశయ సాధనలో భాగంగా మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని రెండున్నరేళ్ళు పూర్తి చేసుకునే లోగా తరువాయి 2లో




# జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ టియుడబ్ల్యుజె ఆధ్వర్యంలో 'జర్నలిస్టుల మహాధర్నా'

రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకునికి విజ్ఞాపనపత్రం అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారించాలని పలువురు సీనియర్ జర్నలిస్టులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాడాల్సి రావడం దుదృష్టకరమని వారు పేర్కొన్నారు. పన్నెండేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్న జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో 'జర్నలిస్టుల మహాధర్నా'ను బుధవారం హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించారు. మహా ధర్నాకు యూనియన్ అనుబంధ సంస్థలైన తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం, మహిళా జర్నలిస్టుల విభాగం, తెలంగాణ ఉర్దూ జర్నలిస్టుల సమాఖ్యలతో పాటు హైదరాబాద్ ప్రెస్ క్లబ్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ, జవహర్ లాల్ హౌసింగ్ సొసైటీ, టిజిఎలు సంపూర్ణ మద్దతును ప్రకటించి మహా ధర్నాలో తరువాయి 12లో

కులగణన విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం

## బహుజనులకు బహిరంగ ద్రోహం

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపణ

**న్యూఢిల్లీ:** కులగణన విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని బహుజనులకు బహిరంగ ద్రోహం చేసిందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వానికి నిర్దిష్ట చట్రం, నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక, పార్లమెంట్‌లో చర్చ, ప్రజలతో సంభాషణ లేదని మండిపడ్డారు. జనగణన, కులగణనపై తాను అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటులో తాను కుల గణన గురించి ప్రభుత్వాన్ని ఒక ప్రశ్న అడిగానని, దాని ప్రతిస్పందన దిగ్భ్రాంతికరంగా ఉందని రాహుల్ గాంధీ బుధవారం తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ తరువాయి 2లో

శాంతి ఒప్పందానికి


## చేరువలో ఉక్రేన్– రష్యా

పుతిన్‌తో ఐదు గంటలు విట్‌కాఫ్ భేటీ

ట్రంప్‌కు రాజకీయ సందేశాలు పంపిన రష్యానేత

చర్చలను బహిర్గతం చేయకూడదని నిర్ణయం

**మాస్కో:** ఉక్రేన్‌లో ప్రతిపాదిత శాంతి ఒప్పందం సమస్య పరిష్కారానికి చేరువ అవుతోంది. ఈ సంప్రదింపులు ఒప్పందానికి గతంకంటే చేరువయ్యాయి. యుద్ధం ముగించేందుకు ట్రంప్ ప్రకటించిన ప్రణాళికపై ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ మాస్కోలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మంగళవారం రాత్రి సంప్రదింపులు జరిపారు. ఈ చర్చల సారాంశాన్ని ఎవ్వరికీ బహిర్గత చెయ్యకూడదని కూడా చర్చల్లో అంగీకరించారు. గతంలో పుతిన్‌తో జరిపన చర్చల సారాంశం బహిర్గతమైన అనుభవాల నేపథ్యంలో ఈ అంగీకరానికి వచ్చారు. ట్రంప్ ప్రణాళికలో కొన్ని అంశాలు తమకు అనుకూలంగా లేవన్న రష్యా



తొలి వైఖరిని చర్చల్లో పాల్గొన్న ఆ దేశ ప్రతినిధులు ఉద్ఘాటించారు. టాస్ వార్తాసంస్థ బుధవారం ఈ సమాచారం వెల్లడించింది. ఐతే ఉక్రేన్ అధీనంలో ఉన్న తరువాయి 2లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

నలుగురు మావోయిస్టులు మృతి

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్‌లో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ పరిధిలోని దంతెవాడ–బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. చనిపోయిన నాలుగురు మావోయిస్టుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు ఐజి సుందర్ రాజన్ తెలిపారు. మృతదేహాలతో పాటు పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి, విప్లవసాహిత్యం చేసుకున్నారు. అభివృద్ధి పనులు ధ్వంసం చేసేందుకు సుమారు 50 మంది సభ్యులు గల మావోయిస్టులు అభివృద్ధి పనులను ధ్వంసం చేసేందుకు వస్తుండగా బలగాలకు తారసపడటంతో లొంగిపోవాలని హెచ్చరించినప్పటికీ కాల్పులుకు దిగినట్లు పోలీసు వర్గాలు తరువాయి 2లో

## భూభారతి సామాన్యులకు చుట్టం

సింగిల్ పేజీలోకి ల్యాండ్ రిజిస్ట్రేషన్ సర్వే

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకువచ్చిన భూభరతి చట్టం సామాన్యులకు చుట్టమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి భూ కబ్జాదారులకు చుట్టంగా మార్చి , రెవెన్యూ వ్యవస్థను కుప్పకూల్చగా తాము అధికారం చేపట్టిన తర్వాత ఈరెండేళ్లలో పునర్నిర్మించామని తెలిపారు. భూ హక్కుల నుంచి రిజిస్ట్రేషన్ల వరకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలో ప్రజల సౌలభ్యం కోసం విప్లవాత్మక మార్పులను తీసుకు వచ్చామని మంత్రి వెల్లడించారు. బుధవారం డాక్టర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల సమాచారంతో కూడిన సింగిల్ పేజీ డిజిటలైజేషన్ అందుబాటులోకి తీసుకువచ్చి ధరణి పోర్టల్ ద్వారా వచ్చిన యాప్‌నుపూర్తిగా తొలగించనున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎన్‌ఎసి కసరత్తు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో నక్షాలు లేని 413 గ్రామాల్లో సరిహద్దుల, భూధార్ నెంబర్ల కేటాయింపుకు గాను ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాలను ఎంపిక చేసి పని పూర్తి చేశామన్నారు. మిగిలిన 408 గ్రామాల్లో పట్టణ ప్రాంతాలు మినహా 373 గ్రామాల్లో రెండవ విడత కింద సర్వే చేపడుతామని, మూడవ విడతగా అన్నిజిల్లాల్లోనూ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## 19 దేశాల వలస ప్రజల విజ్ఞప్తులు బుట్టదాఖలు చేసిన ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికాలో వలస ప్రజల అణచివేత చర్యలు, వారిని గుర్తించేదుకు సంబంధిత యూఎస్‌సిఐఎస్ అధికారుల దాడులు ఒకవైపు కొనసాగుతుండగా మరోవైపు 19 యూరప్ యేతర వలస దేశాల ప్రజలు దాఖలు చేసిన దరఖాస్తులను అమెరికా ప్రభుత్వం స్తంభింపజేసింది. వీటిల్లో ప్రధానంగా ఆఫ్ఘనిస్థాన్, సోమాలియా దేశాలున్నాయి. ఈ రెండు దేశాలూ అంత్యంత పేద దేశాలు. వెనుకబడిన బడుగు దేశాలు. గ్రీన్‌కార్డులకోసం, పౌరసత్వంకోసం, ఆశ్రయం కోరుతూ వలస ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ అమెరికా తాత్కాలికంగా పక్కనపడేసింది. ముఖ్యంగా ఆఫ్ఘనిస్థాన్ వలస ప్రజలకు సంబంధించిన విజ్ఞప్తులను కూడా పక్కకు నెట్టింది. దీంతో ఆగ్రహించిన ట్రంప్ వలస ప్రజలు దేశంలోకి వచ్చేందుకు దాఖలు చేసుకున్న విజ్ఞప్తులను తిరస్కరించారు. మయన్మార్, కాంగో, హైతీ, ఇరాన్, గునియా, లిబియా, సూడాన్, యెమెన్, బురుండీ, క్యూబా, లావోస్, వెనిజులా, తుర్క్‌మెనిస్థాన్, ఛాడ్ తదితరదేశాలు ట్రంప్ జాబితాలో ఉన్నాయి.

# వెనిజులాపై రేపోమాపో అమెరికా దాడులు!

**వాషింగ్టన్:** వెనిజులాపై రేపోమాపో దాడులు చేసేందుకు అమెరికా సన్నాహాలు చేస్తోంది. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం వాషింగ్టన్‌లో ఉన్నతస్థాయి అధికారులతో వెనిజులా సమస్యపైన, లక్ష్యిత కేంద్రాలపై దాడులు చేసే విషయంపైన ముమ్మరంగా చర్చలు జరిపారు. వెనిజులాలో "కార్టెల్ ఆఫ్ సన్స్" అనే మాదకద్రవ్యాల అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఉందని, ఈ సంస్థకు వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ఆశ్రయం ఇచ్చి వాటి కార్యకలాపాలకు వీలు కల్పించారని ట్రంప్ మొదటినుండీ ఆరోపిస్తున్నారు. కరీబియన్ జలాలలో గడచిన 22 వారాలుగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండగా, 10 వేలమంది సైనికులను, శక్తిమంతమైన విమానవాహక నౌకలను కూడా అంతర్జాతీయ జలాలలో ట్రంప్ ఇప్పటికే



మోహరించి కూర్చున్నారు. అక్రమ వలస ప్రజలు, మాదక ద్రవ్యాలు అమెరికా దేశాన్ని పీల్చి పిప్పిచేస్తున్నాయని, దేశాన్ని కాపాడుకుంటామని చెబుతున్న ట్రంప్ మాదక ద్రవ్యాల ముఠాల పేరుతో కరీబియన్ జల్లాల్లో అమాయకుల ప్రాణాలు తీస్తున్నారు. నికొలస్ మదురోకు ట్రంప్ స్వయంగా ఫోన్ చేసి దేశం వదలి పారిపోవాలని హెచ్చరిక చేశారు. అందుకు మదురో తిరస్కరించడంతో యుద్ధ దాడులకు ట్రంప్ సిద్ధపడుతున్నారు. ట్రంప్ సామ్రాజ్యవాద, వలస ధోరణులను తిరిగి తెరమీదకు తెచ్చారని, తమను అధికారం నుండి తొలగించేందుకే కుట్ర చేస్తున్నారని మదురో విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వెనిజులా తమ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల జరిపిన దాడులు యుద్ధనేరంతో సమానంగా మారి వివాదాస్పదం కావడంతో అమెరికా ప్రతిపక్షం డెమోక్రాట్లు ఆయనను నిలదీశారు. రిపబ్లికన్లలో కూడా కొంతమంది ట్రంప్‌తో విభేదించారు.

# శాంతి ప్రతిపాదనలను పుతిన్ తిరస్కరించలేదు



దీమ్రితీ పెస్కోవ్

**మాస్కో:** డోనాల్డ్ ట్రంప్ దూతలతో మంగళవారం చర్చల సందర్భంగా ఉక్రేన్‌లో శాంతికి చేసిన ప్రతిపాదనలను రష్యా అధ్యక్షుడు పుతిన్ తిరస్కరించలేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దీమ్రితీ పెస్కోవ్ చెప్పారు. రోజువారీ మీడియా సమావేశంలో భాగంగా పెస్కోవ్ బుధవారం మాస్కోలో మాట్లాడుతూ, ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను పుతిన్ పూర్తిగా తిరస్కరించారని అంతర్జాతీయ మీడియా చెప్పడాన్ని ఆయన ఖండించారు. ట్రంప్ ప్రతిపాదనలను పుతిన్ తిరస్కరించలేదన్నారు. ట్రంప్ ప్రణాళికలోని అంశాలు ఇంచుమించుగా సమ్మతింపదగినవిగానే ఉన్నాయని, కొన్ని ప్రతిపాదనలు తమకు ఎంతమాత్రం అనుకూలంగా లేవని, వీటిపై క్షుణ్ణంగా చర్చించాల్సిన అవసరం ఉందని, ఈ కసరత్తు కొనసాగుతుందని చెప్పారు. రష్యాకు అనుకూలంగా లేని అంశాలేమిటో ప్రస్తుతానికి అంతర్గత, రహస్య విషయాలని స్పష్టం చేశారు. అంతకుముందు యూరీ ఉషకోవ్ మాట్లాడుతూ, శాంతి సాధనకు, యుద్ధ సమస్య పరిష్కారానికి ఒక రాజీ పరిష్కారాన్ని ఇంకా సాధించలేదని చాలా స్పష్టంగా చెప్పారు. ఇదిలా ఉండగా మాస్కోలో విట్‌కాఫ్ బృందంతో పుతిన్ చర్చలకు ముందుగా ఆయన స్పందిస్తూ, అమెరికా చేస్తున్న ప్రయత్నాలను యూరప్ నాయకుడు అడ్డుకుంటున్నారని విమర్శించారు. యూరప్‌తో అమెరికా యుద్ధాన్ని కోరుకోవడంలేదని, ఒకవేళ వారు యుద్ధం కోరుకుంటే తాము అందుకు సిద్ధంగా ఉన్నామని కూడా స్పష్టం చేశారు.

**పుతిన్‌కు యుద్ధ విరమణ ఇష్టం లేదు: జెలెన్‌స్కీ, ఇయు నేతల విమర్శ**


మాస్కోలో విట్‌కాఫ్ బృందం పుతిన్‌తో జరిపిన చర్చల సానుకూల వాతావరణాన్ని పాడుజేసే ప్రయత్నం మరోవైపు కొనసాగుతున్నది. బ్రస్సెల్స్‌లో



యూరోపియన్ యూనియన్ విదేశీశాఖల మంత్రులు ఉక్రేన్ యుద్ధ సమస్య, శాంతి చర్చల గురించి సమావేశమయ్యారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు శాంతి సాధన, యుద్ధం విరమించడం ఇష్టంలేదని అందుకే యూరప్‌పై కాలు దువ్వుతున్నారన్నారు. బ్రస్సెల్స్‌లో జర్మనీ విదేశాంగమంత్రి జోహన్ వడెపుల్ సమావేశాన్ని ప్రారంభిస్తూ, శాంతిపట్ల రష్యా సుముఖంగాలేదని, సంప్రదింపులకు వచ్చేందు పుతిన్ సిద్ధంగా కనిపించడంలేదన్నారు. ఎస్తోనియా విదేశాంగమంత్రి మార్గ్తాస్కాన్నా మాట్లాడుతూ, యూరప్ ఖండంలో ఏం జరుగుతోందో యూరప్ నాయకులే నిర్ణయించాలన్నారు. అటు పుతిన్‌గానీ, ఇటు ట్రంప్ గానీ యూరప్‌లో పరిణామాలను నిర్దేశించలేరని, యూరప్ దేశాల తరఫున వారు నిర్ణయాలు తీసుకోలేరని విమర్శించారు. లాత్వియా విదేశాంగమంత్రి బైబా బ్రేజ్ మాట్లాడుతూ, శాంతి చర్చల పేరుతో నాటోను విభజించేందుకు రష్యా ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఫిన్లాండ్ విదేశీమంత్రి ఎలీనా వాల్టోనెస్ మాట్లాడుతూ, పుతిన్ తన వాక్‌చాతుర్యంతో యూరప్ దేశాలను భయపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. యుద్ధం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కానీ యుద్ధాన్ని తాము కోరుకోవడం లేదని పుతిన్ వాక్‌చాతుర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

# చైనాతో సంబంధాలకు యూరప్ తహతహ

### బీజింగ్‌కు చేరిన మేక్రాన్, అదేబాటలో స్టార్‌మర్



**బీజింగ్:** ఇటీవలికాలంలో యూరప్ దేశాలు చైనాతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నాయి. ఇందులో భాగంగానే తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చైనా పర్యటనకు బీజింగ్ చేరుకున్నారు. చైనాతో వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ఆయన బుధవారం నుండి శుక్రవారం వరకూ చైనాలో పర్యటిస్తారు. మేక్రాన్ చైనాలో పర్యటించడం ఇది నాలుగోసారి. రెండు దేశాల అధ్యక్షులూ ప్రపంచ పరిణామాలపై చర్చిస్తారు. పరస్పర ప్రయోజనాలను అన్వేషిస్తారు. చైనాతో దౌత్యసంబంధాలు నెలకొల్పుకుంటున్న మొట్టమొదటి అతిపెద్ద యూరప్ దేశం ఫ్రాన్స్. మారుతున్న ఆధునిక రాజకీయ పరిస్థితుల్లో ఇవన్నీ ఆసక్తికర పరిణామాలుగా మారాయని ఈ సందర్భంగా "గ్లోబల్ టైమ్స్" పత్రిక తన సంపాదకీయంలో పేర్కొంది. ఈ పర్యటనలో ఆయన సాంస్కృతిక, ప్రజాసంబంధాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రాదేశిక ఉద్రిక్తతలు, రాజకీయ మార్పులు సంభవిస్తున్న తరుణంలో వచ్చేడాది చైనా ఎపెక్ 33వ ఆర్థిక నాయకుల సమావేశానికి ఆతిథ్యం ఇస్తుండగా, ఫ్రాన్స్ కూడా జి–7 శిఖరాగ్ర సదస్సుకు ఆతిథ్యం ఇస్తున్నది.

అదేవిధంగా బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్‌మర్ కూడా తన పాత విధానాలకు స్వస్తిచెప్పి మేక్రాన్ బాటలోనే పయనించేందుకు సిద్ధపడుతున్నారు. త్వరలో ఆయన కూడా చైనా పర్యటనకు వెళ్ళేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. చైనాతో ప్రచ్ఛన్నయుద్ధంగానీ,బహిరంగ శత్రుత్వాన్నిగానీ పాటించకుండా లోతైన వాణిజ్య సంబంధాలను మెరుగుపరచుకోవాలని స్టార్‌మర్ కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొన్నమొన్నటివరకూ అమెరికా–చైనా మధ్య తీవ్రస్థాయిలో ఎన్నడూలేనివిధంగా వాణిజ్య యుద్ధం, సుంకాల యుద్ధం జరిగింది. ఈ పరిస్థితుల్లోనే చైనా మొదట స్పందించింది. యూరప్‌తో సన్నిహిత సంబంధాలకు, వాణిజ్యసంబంధాల అభివృద్ధికి చైనా సర్వసన్నద్ధంగా ఉందని చైనా అధ్యక్షుడు, విదేశాంగ, ఆర్థికబమంత్రులు ప్రకటనలు చేశారు. యూరప్ దేశాలతో చారిత్రకంగా చైనాకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి వివాదాలు, ఘర్షణలు, విబేదాలు లేవని, అందువల్ల యూరప్ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలకు, లోతైన సంబంధాలకు చైనా సన్నద్ధంగా ఉందని జిన్‌పింగ్ ప్రకటించారు. మరోవైపు యూరప్ దేశాలు కూడా గతంలో ఎన్నడూ లేనిరీతిలో ఆర్థిక సంక్షోభంలో, సాంఘిక సంక్షోభంలో కూరుకుంటున్న దశలో వాణిజ్య విస్తరణకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నాయి. యూరప్ దేశాలపట్ల ట్రంప్ అనుసరించిన వాణిజ్య విధానాలు కూడా చైనావైపు యూరప్ దేశాలు మొగ్గుచూపడానికి కారణంగా భావించవచ్చు.

## కార్మిక కోడ్‌లు వద్దు
**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నాయి. పూర్తి కాలం ఉద్యోగాలు అంతం కావొచ్చు. అనేక శాశ్వత ఉద్యోగాలను ముగించవచ్చు.భారతదేశంలోని 80% కంటే ఎక్కువ కర్మాగారాలు ఇప్పుడు ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులను లే ఆఫ్ చేయవచ్చు లేదా తొలగించవచ్చు, ఇది ఉద్యోగ భద్రతను తగ్గిస్తుంది. కంపెనీలు ఇప్పుడు స్వల్పకాలిక ఒప్పందాలపై కార్మికులను నియమించుకోవచ్చు, దీర్ఘకాలిక ప్రయోజనాలను తప్పించుకుంటాయి' అని ఆయన అన్నారు. ఈ కోడ్‌లు 8 గంటల పని దినాన్ని కాగితంపైనే ఉంచి, రాష్ట్రాలు సౌకర్యవంతమైన షెడ్యూలింగ్ ద్వారా 12 గంటల షిఫ్ట్‌ను అనుమతించవచ్చని ఆయన అన్నారు.

కార్మిక చట్టాలను సరళీకృతం పేరుతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా నాలుగు కార్మిక కోడ్లను తీసుకువచ్చిందని, ఈ సాకుతో ప్రభుత్వం కార్మికుల చేతుల్లో ఉన్న అన్ని హక్కులను లాక్కుందని నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు. 'గతంలో కార్మికులకు ఇచ్చిన రక్షణ తీసివేయబడింది. వారి దోపిడీకి కొత్త మార్గాలు తెరవబడ్డాయి. ఈ చట్టాల ద్వారా నరేంద్ర మోదీ జీ పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వ్యతిరేక మనస్తత్వం మరోసారి తెరపైకి వచ్చింది. దేశం ఈ చట్టాలను అంగీకరించదు' అని ఆమె తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఆ చట్టాలను ఆమె 'దోపిడీ చట్టాలు'గా విమర్శించారు.

## బహిరంగ ద్రోహం
**(మొదటి పేజీ తరువాయి)**

చేశారు.' నిర్దిష్ట చట్టం లేదు, నిర్దిష్ట కాలపరిమితి ప్రణాళిక లేదు, పార్లమెంటులో నిర్దిష్ట చర్చ లేదు. ప్రజలతో సంభాషణ లేదు. ఇతర రాష్ట్రాలలో విజయవంతమైన కుల సర్వేల వ్యూహాల నుండి నేర్చుకోవాలనే కోరిక కూడా లేదు' అని విరుచుకుపడ్డారు.కుల గణనపై మోదీ ప్రభుత్వ వైఖరి దేశ బహుజనుల పట్ల బహిరంగ ద్రోహం' అని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో మంగళవారం నాడు రాహుల్‌గాంధీ మూడు ప్రశ్నలు వేశారు. జనాభా లెక్కలకు సంబంధించి ప్రశ్నల తయారీ షెడ్యూలు నిర్ణయించటం వంటి కీలకమైన విధానపరమైన దశల వివరాలు, తాత్కాలిక కాలపరమితిలను గురించి వివరాలను అడిగారు.

జనగణన ముసాయిదా ప్రశ్నలను ప్రచురించి, ఈ ప్రశ్నలపై సాధారణ ప్రజల నుండి లేదా ప్రజాప్రతినిధుల నుండి అభిప్రాయాలను కోరే ప్రతిపాదన ప్రభుత్వానికి ఉందా అని కూడా ఆయన ప్రశ్నించారు. వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన కుల సర్వేలతో సహా గతంలో జరిగిన కసరత్తుల నుండి ఉత్తమ పద్ధతులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందా? అలా అయితే, వాటి వివరాలను కూడా వెల్లడించాలని కోరారు. రాహుల్‌గాంధీ వేసిన ప్రశ్నలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. దానిపై సంతృప్తి చెందని రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా ప్రభుత్వ సమాధానాలపై విమర్శలు సంధించారు.

## విద్యా సంస్థలు నిర్వీర్యం
**(మొదటి పేజీ తరువాయి)**

డిసెంబర్ 9 నుండి ఢిల్లీలో దేశవ్యాప్త పోరాటాన్ని ప్రారంభించక తప్పని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ సంక్షోభం పూర్తిగా ప్రభుత్వమే సృష్టించిందేనని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా దాదాపు మూడులక్షల బోధనా పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, అర్హతగల యువత నిరుద్యోగులుగానే మిగిలాల్సి వస్తున్నదని వ్యాఖ్యానించారు. అలాగే సుమారు ఆరు లక్షల యాభై వేల ఉపాధ్యాయులు అడ్‌హాక్, ఒప్పంద ప్రాతిపదిక పద్ధతుల్లో పని చేస్తున్నారని సందోష్ కుమార్ గుర్తుచేశారు. వారు కనీస గౌరవం, భద్రత, హక్కులు, సరైన సేవా ప్రయోజనాలు లేకుండా పని చేస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు తిరిగి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) రాయాలని సూచించే యుజిసి మార్గదర్శకాలు వృత్తి నైతికతకు నిదర్శనమని, ఇది ఉపాధ్యాయులను అవమానపరచడమేనని ఆయన మండిపడ్డారు. లోపభూయిష్టమైన, ప్రదాకరమైన జాతీయ విద్యా విధానం 2020ను వెంటనే రద్దు చేయాలన్న సిపిఐ డిమాండ్‌ను ఆయన పునరుద్ఘాటించారు. ఏడవ వేతన సంఘం ప్రయోజనాల అసమాన అమలు, పెన్షనర్లపై వివక్ష, విద్యారంగానికి జీవితం అంకితం చేసిన ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిర్లక్ష్యం వంటి సమస్యలను కూడా ఆయన ప్రస్తావించారు. మితిమీరన అధికార కేంద్రీకరణతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా విద్యా సంస్థలను బలహీన పరుస్తున్నదని, రాష్ట్రాల హక్కులను దెబ్బతీస్తున్నదని సందోష్ కుమార్ విమర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను దుర్భరులుగా మారుస్తున్నదని కేంద్రంపై ఆరోపణలు చేశారు. ఉపాధ్యాయులు దేశపు పునాది స్తంభాలని, వారి సమస్యలు న్యాయబద్ధమైనవని ఆయన అన్నారు. అత్యవసరమైన వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతిమంగా, ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి, న్యాయం, గౌరవం, భద్రతను ఉపాధ్యాయ సమాజానికి పునరుద్ధరించే సరైన చర్యలు తీసుకోవాలని సందోష్ కుమార్ కోరారు.

## టూరిజం నిధులు గోల్‌మాల్
**(మొదటి పేజీ తరువాయి)**

ఆయా సంస్థలు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థకు చెందిన బస్సులు, కార్లను అద్దెకు తీసుకుంటారు. ఇలా వెళ్లిన వాహనాలకు బిల్లులు వేసి బిల్లు మొత్తాన్ని వినియోగదారుల నుంచి అధికారులు వసూలు చేసి సంస్థ అకౌంట్‌లో జమ చేస్తారు. అయితే ఇలా ప్రజలకు అద్దె క్రమంలో పంపిన టూరిజం వాహనాలపై డిస్కౌంట్ పేరుతో సంబంధిత అధికారులు నిధులు నొక్కేశారని తెలిసింది. వినియోగదారులు నుంచి ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించకుండా తమ వ్యక్తిగత ఫోన్‌పే, గూగుల్ పేకు డబ్బులు వేయించుకున్నట్లు తెలిసింది. వినియోగదారులు నేరుగా ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించే సదుపాయం ఉన్నా వారితో నగదు వసూలు చేసి ఈ అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం.ఈ క్రమంలోనే ఇటీవలే సంస్థ ఎండి రాణిగంజ్‌లోని టూరిజం బస్సు డిపోతో పాటు బషీర్‌బాగ్‌లోని సిఆర్ఓ (బుకింగ్ కార్యాయలం)ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో అద్దెకు వెళ్లిన బస్సులపై వినియోగదారుల నుంచి మొత్తం డబ్బులు వసూలు చేసి..డిస్కౌంట్ పేరుతో వచ్చిన డబ్బును సంస్థకు చెందిన అధికారులే మింగేశారని తెలిసింది. ఈ క్రమంలోనే సంస్థ ఎండి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లుగా తెలిసింది. గత ఏడాది నుంచి ఇప్పటి వరకు టూరిజం శాఖకు చెందిన బస్సులు ఎవరెవరు బుక్ చేసుకున్నారు, డిస్కౌంట్లు ఎవరెవరిపేర్లతో తీసుకున్నారు. రికార్డులన్ని వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఇందులో రాజలింగం బుక్ చేసిన 28 బుకింగ్‌లపై ఆరా తీశారు. ఇందులో పలు బుకింగ్‌లపై డిస్కౌంట్లు తీసుకున్నట్లు తెలిసింది. తిరుపతి, శబరిమళ, కుంభమేళ, శంకర్‌పల్లి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, నార్త్ ఇండియా టూర్ ఇలా తదితర ప్రదేశాలకు వెళ్లిన టూరిజం బస్సులపై డిసౌంట్లు పొందినట్లు తెలిసింది. ఉన్నతాధికారులు ఇచ్చిన డిస్కౌంట్లు వినియోగదారులకు చేరకుండా కింది అధికారులే నొక్కేసారి విచారణలో తేలినట్లు సమాచారం. వినియోగదారులు డిస్కౌంట్లు అడుగుతున్నారనే నెపంతో ఉన్నతాధికారుల నుంచి డిస్కౌంట్లు తీసుకుని మింగేశారని తెలిసింది. ఈ తతంగం ఎన్ని రోజుల నుంచి నడుస్తుందనే విషయంపై ఎండి ఆరా తీస్తున్నారు. ఇదిలావుండగా తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసుపై ఎండికి వివరన ఇచ్చానని ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ రాజలింగం తెలిపారు. తాను వ్యక్తిగతంగా రెండు సార్లు స్నేహితులు, కుటుంబ సభ్యులతో టూర్‌కు వెళ్లామని దానికి సంబంధించి ఉన్నతాధికారులకు డిస్కౌంట్ కోసం లెటర్ పెట్టగా వారు మంజూరు చేశారని తెలిపారు. డిస్కౌంట్ ఇచ్చే అధికారం తనకు లేదని తనపై అధికారులకు మాత్రమే ఉందని తెలిపారు.

## చారిత్రక పతనం **(మొదటి పేజీ తరువాయి)**

తీసుకుంటున్న చర్యలు, కృషిలోపం వంటి అనేక కారణాలవల్ల రూపాయి తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. ఒకవైపు భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతాయని, ఒప్పందం కుదురుతుందని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినప్పటికీ మనదేశంలో మార్కెట్‌ను దక్కించుకునేందుకు ఆమెరికా మంకుపట్టు కారణంగా చర్చల్లో జాప్యం జరగడం అనిశ్చితికి దారితీసింది. రాజకీయ అస్థిరత కూడా దీనికి తోడైంది. తాజాగా రష్యా అధ్యక్షుడి భారత్ పర్యటనతో ట్రంప్ ఆలోచనా ధోరణి కూడా భారత్ వైఖరిమీద ఆధారపడి ఉం టుంది. గడచిన మూడురోజులుగా దేశీయ స్టాక్ మార్కెట్ నష్టాలతోనే ముగుస్తోంది.

గడచిన కొద్దిరోజులుగా ట్రంప్ సుంకాల భారాలు, దేశం నుండి అమెరికాకు వెళ్ళే ఎగుమతులు గణనీయంగా క్షీణించిపోవడంవల్ల ఆ దేశంతో వ్యాపారంలో భారత్ వాణిజ్యలోటు గణనీయగా పెరుగుతోంది. అదే సమయంలో అమెరికా వాణిజ్యలోటు తగ్గి సమతుల్యం సాధిస్తోంది. ఈ పరిస్థితులు చక్కబడేదెప్పుడో తెలియక అనిశ్చితి కొనసాగుతోంది. ఐతే మార్కెట్ ఆర్థిక పరిశోధనా విశ్లేషకుడు అనుజ్ చౌధురి దీనిపై మాట్లాడుతూ, అంతర్జాతీయంగా రోజురోజుకూ డాలరు బలహీన పడుతున్నదని, ఈ బలహీనతే భారత రూపా యి మారకం విలువలను అడ్డుకుంటుందని అన్నారు.

విదేశీ మదుపరులు పెట్టుబడులను ఉపసంహరణలు చేయడంవల్ల, ముడి చమురు ధరలు పెరడంవల్ల స్వల్పంగా రూపాయి వాణిజ్యంలో ప్రతికూలత వచ్చిందన్నారు. ఈ డిసెంబరునెలలో రిజర్వుబ్యాంకు కమిటీ సమావేశంలో రేట్ కటింగ్ నిర్ణయం తీసుకుంటే రూపాయికి కొంత మద్దతు లభించే అవకాశం ఉంది. ఈ మారకం 89.80 నుండి 90.50 స్థాయిలో జరగే అవకాశాలు ఉండవచ్చునని ఆయన అంచనావేశారు. విదేశీ మారకం కన్సల్టెంట్ సంస్థ ఫైన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్ ఎల్ఎల్‌పి అనిల్ కుమార్ బన్సాలీ మాట్లాడుతూ, రూపాయి మారకం 90లకు చేరడానికి రిజర్వు బ్యాంకు సులభంగా అనుమతించిందని, రిజర్వుబ్యాంకు రంగ ప్రవేశం చేయకపోతే ఇంకా పతనం అవుతుందన్నారు. అదేవిధంగా నీతీ ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ రాజీవ్ కూమార్ స్పందిస్తూ రూపాయి విలువ పడిపోతే మంచిదేనన్నారు! విదేశీ మారకంలో ఆదాయాలు పెరగడానికి వీలు కలుగుతుందని, ఎన్ఆర్ఐలకు మేలు జరుగుతుందని అన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
**(మొదటి పేజీ తరువాయి)**

తెలుపుతున్నాయి. ఆత్మరక్షణలో భాగంగా జరిపిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టులు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టులను గుర్తించాల్సి ఉందని చెప్పారు.

## ఇండ్లు కట్టిస్తాం
**(మొదటి పేజీ తరువాయి)**

మరో 40 వేల ఉద్యోగాలు భర్తీచేస్తామని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కూళేశ్వరం అయ్యిందని కాంగ్రెస్ హయంలో కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికి చెక్కు చెదరలేదని అన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రైతులకు 2 లక్షల రైతు రుణ మాఫీ చేసి రైతులకు విముక్తి చేశామని అన్నారు.కాంగ్రెస్ అధకారం చేపట్టిన నుండి ఇప్పటి వరకు 1 లక్ష 4 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేశామని 8 వేల కోట్లు ఆర్టీసిలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం ఖర్చు చేశామని అన్నారు.లబ్దిదారులకు నూతన రేషన్ కార్డలను అందించామని పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు.

దాదాపు 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని అన్నారు.పదేళ్ళు అధికారంలో ఉన్న వాళ్ళు హుస్నాబాద్‌కు సాగునీరు అందించే గండిపల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని గత పాలకులు ప్రచారం మొదలు పెట్టేందుకు సెంటిమెంట్‌గా హుస్నాబాద్‌ను ఉపయోగించుకున్నారని అన్నారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లను అభివృద్ధి చేసుకున్నారు కానీ హుస్నాబాద్‌ను అభివృద్ధి చేయలేదని అన్నారు.

రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని ఇవి మన గ్రామాల్లో వెలుగులు నింపే ఎన్నికలు అని సర్పంచ్ ఎన్నికల్లో మంచివాళ్ళను ఎన్నుకోవాలని మంత్రులతో,ఎంఎల్‌ఏలతో కలిసి పని చేసి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుంచే వాళ్ళను ఎన్నుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పోన్నం ప్రభాకర్,దుద్దిళ్ల శ్రీధర్ బాబు,వివేక్ వెంకటస్వామి,తుమ్మల నాగేశ్వర్ రావు, వడ్లూరి ల్మణ్,హన్మంత రావు,ఆది శ్రీనివాస్,ఎంఎల్ ఏలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ సంకల్పంతో ముందుకు **(మొదటి పేజీ తరువాయి)**

పాటు అన్ని రంగాల నిపుణుల మేథో మథనంతో తయారు చేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు ప్రధానికి సిఎం వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం తగిన సహాయ సహకారాలు అందించాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు తగిన అనుమతులు ఇవ్వాలని సిఎం కోరారు. మొత్తం 162.5 కిలోమీటర్ల పొడవునా విస్తరించే ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. రూ.43,848 వేల కోట్ల అంచనా వ్యయమయ్యే ఈ ప్రాజెక్టును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు ఆమోదించాలని సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి మంత్రివర్గం ఆమోదంతో పాటు ఫైనాన్సియల్ అప్రూవల్ ఇవ్వాలని, దక్షిణ భాగం నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. రీజనల్ రింగ్ రోడ్డు వెంట ప్రతిపాదనలలో ఉన్న రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టును వీలైనంత తొందరగా చేపట్టాలని సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్ట్ వరకు 12 లేన్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, హైదరాబాద్ నుంచి బెంగుళూరు హై స్పీడ్ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం చేపట్టేలా కేంద్రం ప్రత్యేక చొరవ చూపాలని సిఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరాయంగా రవాణా సదుపాయం ఉండేలా టైగర్ రిజర్వ్ మీదుగా మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఫోర్ లేన్ ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణ ప్రతిపాదనలను ఆమోదించాలని ప్రధానమంత్రివకి సిఎం, డిప్యూటీ సిఎం వినతిపత్రం అందించారు.

**మంత్రులకు ఆహ్వానం**

ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని పలువురు కేంద్ర మంత్రులను కలిసి సిఎం, డిప్యూటీ సిఎం ఆహ్వానించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర ఐటీ, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను సిఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. సమ్మిట్‌లో ఆవిష్కరించనున్న విజన్ డాక్యుమెంట్ గురించి కేంద్ర మంత్రికి సిఎం వివరించారు. సిఎం వెంట ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు.

**సోనియా, రాహుల్, ప్రియాంకకు ఆహ్వానం**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8,9 తేదీలలో నిర్వహించే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు కాంగ్రెస్ అధినేత, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్‌గాంధీని, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గేను కూడా సిఎం ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వానపత్రాలను అందజేశారు.

## చేరువలో ఉక్రేన్ – రష్యా **(మొదటి పేజీ తరువాయి)**

డోనెట్స్క్ పీపుల్స్ రిపబ్లిక్‌లోని 20 శాతం భూభాగాన్ని రష్యాకు స్వాధీనం చేసే విషయం ఇప్పటికీ వివాదాస్పదాంశంగానే ఉందన్నది ట్రంప్ దూతల సమాచారం. మరోవైపు ట్రంప్ ప్రణాళికపై ఇంకా పూర్తిగా ఒక రాజీ పరిష్కారానికి రాలేదని రష్యా అధికార వర్గాలు స్పష్టం చేశాయి. మాస్కోలో సమావేశం తర్వాత ట్రంప్ దూతలు కీవ్ నగరాకి వెళ్ళకుండా నేరుగా వాషింగ్టన్ వెళ్ళిపోయారు. తదుపరి పరిణామాలకు అనుగుణంగా ఉక్రేన్–రష్యా నాయకుల మధ్య నేరుగా శాంతి ఒప్పంద చర్చలు జరిగే అవకాశాలుంటాయి.

అనేక అంశాలపై ఐదు గంటలసేపు ఏకధాటిగా వారిమధ్య చర్చ జరిగింది. విట్‌కాఫ్ ద్వారా పుతిన్ అనేక ముఖ్యమైన రాజకీయ సందేశాలను అమెరికా అధ్యక్షుడికి చేరవేశారు. సమావేశం తర్వాత పుతిన్ తరఫున అధికార ప్రతినిధి యూరీ ఉషకోవ్ మీడియాకు ఇదే విషయం చెప్పారు. ట్రంప్ ప్రణాళికలోని అంశాలు ఇంచుమించుగా సమ్మతింపదగినవిగానే ఉన్నాయని, కొన్ని ప్రతిపాదనలు తమకు ఎంతమాత్రం అనుకూలంగా లేవని, వీటిపై క్షుణ్ణంగా చర్చించాల్సిన అవసరం ఉందని, ఈ కసరత్తు కొనసాగుతుందని చెప్పారు. రష్యాకు అనుకూలంగా లేని అంశాలేమిటో చెప్పాలని పాత్రికేయులు ప్రశ్నించగా, ఉషకోవ్ అందుకు నిరాకరించారు. ఇవన్నీ పూర్తిగా ప్రస్తుతానికి అంతర్గత, రహస్య విషయాలని స్పష్టం చేశారు. చర్చలు నిర్మాణాత్మకంగా, విజయపరిజ్ఞానంతో ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రాతిదేశిక సమస్యలను పరిష్కారంపై దృష్టి సారించడానికి ఈ చర్చలు ఎంతో అనువుగా ఉన్నాయన్నారు. ట్రంప్ ప్రణాళికలో ఉన్న సారాంశంపైనే చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించాం తప్ప, ఈ ప్రణాళికలో ఉపయోగించిన నిర్దిష్ట పదజాలంపై తాము ఇంకా దృష్టి సారించలేదని చెప్పారు. మొదటిసారి ఇచ్చిన 28 అంశాల ప్రణాళికతోపాటు ఆ తర్వాత జెనీవా చర్చల్లో సవరించిన ప్రణాళిక నాలుగు ప్రతులు కూడా తమకు అందుబాటులోకి వచ్చాయని ఉషకోవ్ చెప్పారు. ఇరుపక్షాలు శాంతి ఒప్పందంపై ఇంకా ఒక స్పష్టమైన రాజీపరిష్కారానికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్చల్లో ఎన్నో ప్రయోజనకరమైన అంశాలు ఉన్నాయని, చర్చలవల్ల మంచి ఫలితాలు వచ్చాయని ఆర్‌డిఐఎఫ్ డైరెక్టర్ జనరల్ కిరిల్ దిమిత్రియేవ్ అన్నారు. కాగా మాస్కో చర్చల తర్వాత పుతిన్‌తో సమావేశమై ఈ పరిణామాల సారాంశాన్ని తెలుసుకునేందుకు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రతినిధిబృందం అమెరికా వెళ్ళేందుకు సిద్ధమవుతున్నది.

**ఇంకా వివాదాస్పదాంశంగానే డోనెట్స్క్**

ఇరు పక్షాలను ఒక్కచోటకు చేర్చి ఒప్పందాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ప్రస్తుతం జరుగుతున్న కృషి సరిపోదని మార్కో రుబియో (అమెరికా విదేశాంగ మంత్రి) పుతిన్‌తో జరిగిన చర్చలపై వ్యాఖ్యానించారు. ఈ చర్చల్లో ట్రంప్ అల్లుడు కుష్నెర్ కూడా పాల్గొన్నారు. పుతిన్‌తో సంభాషణలు ఫలవంతంగా జరిగాయని చెప్పారు. మార్కో రుబియో అమెరికా చేరుకున్న తర్వాత మాట్లాడుతూ, మాస్కోలో ఉండగా ఉక్రేన్ సమస్య పరిష్కారానికి తాము కృషి చేశామన్నారు. ఉక్రేన్ అధీనంలో ఉన్న 20 శాతం డోనెట్స్క్ భూభాగం ఇప్పటికీ ఇంకా వివాదాస్పదాంశంగానే ఉందని చెప్పారు. ఉక్రేన్‌కు నిరంతర మద్దతు ఇవ్వడాన్ని మాత్రమే అమెరికా యంత్రాంగం ఒక వాస్తవిక వ్యూహంగా చూడటంలేదన్నారు. గడచిన మూడు సంవత్సరాలలో ఎన్నడూలేనివిధంగా ఉక్రేన్–రష్యా దేశాలు శాంతి ఒప్పందానికి చేరువుగా ఉన్నాయని, ఐతే ఇప్పటివరకూ చేసిన ఈ కృషి సరిపోదని అన్నారు. విట్‌కాఫ్ ద్వారా తమ దేశాధ్యక్షుడు ట్రంప్‌కు పుతిన్ అనేక ముఖ్యమైన రాజకీయ సందేశాలు పంపించారని కూడా చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సర్పంచ్ ఎన్నికలు.. తొలిదశ అభ్యర్థుల గుర్తులు వచ్చేశాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికల జోరు పెరిగింది. రాష్ట్రంలో మూడు విడతలుగా జరగనున్న పంచాయితీ ఎన్నికల్లో ఇప్పటికే రెండు దశల నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యి, ఎన్నికలకు సిద్ధం అవుతుండగా.. 11న జరిగే తొలి దశ ఎన్నికల అభ్యర్థులకు బుధవారం ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించింది. తొలి విడత ఎన్నికల పోలింగ్ కు మరో వారమే మిగిలి ఉండగా.. ఇప్పటికే అభ్యర్థుల ప్రచారం ప్రుంజుకుంది. ఇక రాష్ట్ర ఎన్నికల సంఘం గుర్తులు కూడా కేటాయించడంతో.. అభ్యర్థులు వారి గుర్తులను గుర్తుండుకొని ఓటు వేయాలని ఓటర్లను కోరేందుకు సిద్ధం అవుతున్నారు. పార్టీలకు అతీతంగా అభ్యర్థుల స్వభావాన్ని బట్టి లెక్క తేలనున్న పంచాయితీ ఎన్నికలలో.. ఒక్క ఛాన్స్ ఇస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ఓటర దేవుళ్లను కోరుతున్నారు. ఇక మూడవ దశ ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. మొదటి దశ, ఈనెల 11న, రెండవ దశ 14న, మూడవ దశ పోలింగ్ ఈనెల 17న జరగనుంది.

# నువ్వు సిఎం కొడుకువి అయ్యావంటే అదీ రాహుల్‌గాంధీ భిక్షే

### కెటిఆర్‌పై జగ్గారెడ్డి ఫైర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''నువ్వు సిఎం కొడుకువు అయ్యావు అంటే.. రాహుల్ గాంధీ భిక్షనే'' అని కెటిఆర్‌పై కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి దేశ భవిష్యత్‌పై విజన్ లేదు అని కెటిఆర్ అంటున్నాడని, ఆయన వయసుకు మించి మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రాహుల్ని విమర్శించే పర్సనాలిటీ కెటిఆర్‌ది కాదన్నారు. నువ్వు మాజీ సీఎం కేసీఆర్ కొడుకువి.. రాజకీయ పోరాటంలో మీరు బెనిఫిట్ పొందారు కానీ.. త్యాగాలు చేసిన కుటుంబం కాదన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం.. ఆస్తులు.. ప్రాణ త్యాగాలు చేసిందని వివరించారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే నైతిక హక్కు కెటిఆర్ లేదన్నారు. 'రాహుల్ ఎంత గొప్పోడో చెప్తా.. తెలంగాణ విభజన చేయొద్దు అని రాహుల్‌కి చెప్పిన, మా ప్రజలు అమాయకులు, ఎపి లీడర్స్ రాజకీయంగా చనిపోతారు, పార్టీ ఔట్ అవుతుంది, మీరు తెలంగాణ ఇస్తే అధికారం ఇవ్వరు ప్రజలు, పూలు వేస్తారు కానీ పవర్ రాదని చెప్పిన' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. నువ్వు సిఎం కొడుకువు అయ్యావు అంటే.. ఆయన బిక్షనే అని, కెసిఆర్ తెలంగాణకి సిఎం అయ్యాడు అంటే.. రాహుల్ గాంధీ భిక్ష అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారం రాదు.. ఎపిలో పార్టీ చనిపోతుంది అంటే కూడా రాహుల్ గాంధీ, తెలంగాణ నిర్ణయం జరిగిపోయింది అని స్పష్టం చేశారు. 'మేము రాజకీయంగా ఆలోచన చేయడం లేదు, యువత ఆత్మహత్యలు జరుగుతున్నాయి, ప్రజల కోసం నిర్ణయం తీసుకున్నాం, రాజకీయంగా ఏమవుతుంది అని మేం చూడటం లేదు అని రాహుల్ గాంధీ చెప్పాడు' అని వివరించారు. కెటిఆర్.. నువ్వు లీడర్ ఐతే.. విలువలతో కూడిన రాజకీయ నాయకుడు అయితే.. మల్లొక్కసారి రాహుల్ గాంధీ గురించి మాట్లాడకు అని జగ్గారెడ్డి సూచించారు. రాజకీయాలు, పవర్ అవసరమే కానీ, మాట విలువ ఉండాలన్నారు. విలువతో కూడిన రాజకీయం ఉండాలని సూచించారు. కేటీఆర్.. కేటీఆర్ నువ్వు పద్ధతిగా ఉండు.. రాహుల్ గురించి మాట్లాడేటప్పుడు ఆచి తూచి మాట్లాడాలని జగ్గారెడ్డి వార్నింగ్ ఇచ్చారు. బిజెపిలో రాజకీయంగా ఎదగకుండా చేస్తున్న సమయంలో కెసిఆర్ పిలిచి నన్ను చట్టసభలకు పంపాడన్నారు. కెసిఆర్ ఇచ్చిన బిఫార్మ్‌తో సంగారెడ్డికి ఎంఎల్‌ఎ అయిన, రాజకీయంగా సక్సెస్ కోసం టిఆర్ఎస్‌లో చేరిన, నాకు విలువలు ఉన్నాయి కాబట్టి కేసీఆర్‌తోనే సభలోకి వచ్చిన అని చెప్తున్నానని అన్నారు. ఇక, దేవుళ్ళ పై రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు బిజెపి వక్రీకరిస్తుందని జగ్గారెడ్డి అన్నారు. బిజెపి వక్రీకరణపై తర్వాత మాట్లాడతానని చెప్పారు.




# ప్రభుత్వాసుపత్రుల కాంట్రాక్ట్ కార్మికుల జీతాల పెంపునకు అధికారుల అంగీకారం

### ఆందోళనలను విరమిస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రకటన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల కనీస వేతనాలు పెంచడంతో పాటు కార్మిక చట్టాలను అమలు చేయాలన్న డిమాండ్‌పై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం నరసింహులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి కొనసాగిస్తున్న ఆందోళన నేపథ్యంలో బుధవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మి బాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగంలతో కూడిన ప్రతినిధి బృందాన్ని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌లు చర్చలకు ఆహ్వానించారని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు పెరుగుతున్న ధరల కనుగుణంగా కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 4 పండుగ, 4 ఆర్జిత, 20 రోజులకు ఒక రోజు వేతనంతో కూడిన ఆర్జిత సెలవు కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం ఇవ్వాలని, పిఎఫ్ ఈఎస్ఐ సక్రమంగా చెల్లించాలని తదితర డిమాండ్లను యూనియన్ నాయకులు అధికారులకు ముందు పెట్టారు.

అదేవిధంగా ప్రతినెల 7వ తేదీ లోపు జీతాలు ఇచ్చే విధంగా టెండర్‌లో పొందుపరచాలని, కార్మిక చట్టాలు పాటించని కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలని, లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా ప్రతి ఆరు నెలలకు ఒకసారి పెరుగుతున్నటువంటి డిఎ పాయింట్‌ను కార్మికులకు అందే విధంగా చూడాలని కోరగా అధికారులు స్పందిస్తూ నూతన టెండర్లను పిలిచేందుకు టెండర్ రూపకల్పనకు ప్రభుత్వం ఒక హై లెవెల్ కమిటీని నియమించడం జరిగిందని అతి తొందరలో ఈ కమిటీ సమావేశమై మీరు ఇచ్చినటువంటి చార్టెడ ఆఫ్ డిమాండ్స్ అమలు అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు యూనియన్ నేతలు తెలిపారు. గతంలో టెండర్లలో వచ్చినటువంటి తప్పిదాలను భవిష్యత్తు టెండర్లు కాకుండా కార్మికులకు అన్యాయం జరగకుండా ఆసుపత్రులు సజావుగా కొనసాగే విధంగా ఉండేందుకు టెండర్ రూపకల్పన చేస్తామని హామి ఇచ్చారన్నారు. కనీస వేతనం, కార్మిక చట్టాలు అమలయ్యే విధంగా సంబంధిత లేబర్ అధికారులతో కూడా చర్చించి కచ్చితంగా అమలు చేస్తామని, అందుకు ప్రభుత్వానికి కొంత సమయం కావాలని అప్పటి వరకు ఆందోళన కార్యక్రమాలని విరమించాల్సిందిగా అధికారులు విజ్ఞప్తి చేయడంతో తాత్కాలికంగా ఆందోళనలను విరమిస్తున్నట్లు యూనియన్ నేతలు ప్రకటించారు.

# మూగ బాలుడిపై కుక్కలదాడి ఘటన.. సిఎం ఆరా

### మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హయత్‌నగర్‌లో మూగబాలుడు ప్రేమ్ చంద్‌పై మంగళవారం వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. వెంటనే సిఎంవో, జిహెచ్ఎంసి అధికారులతో బుధవారం మాట్లాడి, బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. ఖర్చుకు వెనుకాడకుండా బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని జిహెచ్ఎంసి అధికారులకు సూచించడంతో పాటు బాలుడి వైద్య ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. బాలుడి కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి వారి బాగోగులు పరిశీలించి, ప్రభుత్వపరంగా ఆదుకోవాలని జిహెచ్ఎంసి అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. బాలుడు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

**వైద్య ఆరోగ్య పరిస్థితిపై జిహెచ్ఎంసి కమిషనర్ సమీక్ష**

బాలుడు ప్రేమ్ చంద్ వైద్య ఆరోగ్య పరిస్థితిపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్, అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి వకీల్‌లతో సమీక్షించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి గురించి సిఎం స్వయంగా ఆరా తీశారని, అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారని తెలిపారు. బాలుడికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కమిషనర్ సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని పబ్లిక్ ప్లేస్‌లలో వీధి కుక్కలు లేకుండా ఇప్పటికే చేపట్టిన డ్రైవ్‌ను మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డిలు ఈ ఘటనపై ఆరా తీసి, బాలుడికి మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

### హిందూ మతం వంటిదే కాంగ్రెస్ అని చెప్పే క్రమంలో చెప్పినట్లు సిఎం వెల్లడి

ఉత్తర భారతదేశంలో బిజెపి తనను పాపులర్ చేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను ఆయన కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం తన నేతృత్వంలో కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిన్న డిసిసి అధ్యక్షుల సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ సమాజం వంటిదే కాంగ్రెస్ పార్టీ అని అంతర్గతంగా జరిగిన కార్యక్రమంలో తాను పేర్కొన్నానని ఆయన అన్నారు. పార్టీ నేతగా ఎలా పని చేయాలనే అంశాన్ని వివరిస్తున్న క్రమంలో తాను చేసిన వ్యాఖ్యలపై విమర్శలు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపి డిపాజిట్ కోల్పోయిందని, ఆ ఆవేదనతోనే తన వ్యాఖ్యలను వివాదాస్పదం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ మతంలో కోట్లాది మంది దేవతలు ఉన్నారని, వివాహం కానివారికి హనుమంతుడు, రెండు పెళ్లిళ్లు చేసుకునేవారికి మరొక దేవుడు, మద్యపానం చేసేవారికి ఇంకొక దేవుడు ఉన్నారని, అదేవిధంగా మల్లమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ వంటి దేవతలు కూడా ఉన్నారని డిసిసి అధ్యక్షుల సమావేశంలో ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. కల్లు పోసి, కోడిని బలిచ్చే వారికి ఒక దేవుడు, పప్పన్నం తినేవారికి సైతం ఒక దేవుడు ఉన్నారని, మనకు అన్ని రకాల దేవుళ్లు ఉన్నారని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆటోలో యువకుల మృతదేహాలు



### ఘటనాస్థలంలో మూడు సిరంజీల లభ్యం
### డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగానే మరణించారని అనుమానాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పాతబస్తీలో కలకలం చోటుచేసుకుంది. బుధవారం ఉదయం చాంద్రాయణగుట్టలోని ఫ్లైఓవర్ కింద నిలిపి ఉంచిన ఆటోలో ఇద్దరు యువకులు విగతజీవులుగా కనిపించడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)లుగా గుర్తించారు. డ్రగ్ ఓవర్ డోస్ కారణంగానే యువకులు చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఘటనాస్థలంలో మూడు సిరంజీలను క్లూస్ టీమ్ గుర్తించింది. వివరాలు ఇలా ఉన్నాయి. కళ్యాణ్, సైఫ్‌బిన్, జహంగీర్, ఇర్ఫాన్‌లు స్నేహితులు. వీరంతా ఆటోలో మంగళవారం రాత్రి 11 గంటలకు ఫరూఖ్ ఎఅజామ్ మసీదుకు వెళ్లి మసీదు ఎదురుగా ఆటోను పార్క్ చేశారు. అక్కడ ఇర్ఫాన్, సైఫ్ బిన్ అక్రమ్‌తో పాటు అందరూ ఇంజెక్షన్ తీసుకున్నారు. ఇంజక్షన్ తీసుకున్న వెంటనే సైఫ్ బిన్ రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అతన్ని గమనించిన కళ్యాణ్ నీరు తెచ్చి జహంగీర్‌కు ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొంత సమయం తర్వాత సైఫ్‌బిన్ స్పృహలోకి వచ్చాడు. ఇక జహంగీర్, ఇర్ఫాన్ ఇద్దరూ ఆటోలో వెనకసీట్లో కూర్చుండి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వారిని నిద్రలేపడానికి సైఫ్‌బిన్ ప్రయత్నించాడు. అయితే వారు మేల్కొనే స్థితిలో లేరు, అప్పుడు సైఫ్‌బిన్.. ఇర్ఫాన్ వద్ద ఉన్న ఫోన్ తీసుకుని ఆటోలో వెనక సీట్లో కూర్చుని అపస్మారక స్థితిలో ఉన్న జహంగీర్, ఇర్ఫాన్‌ల ఫోటోలు తీసి, ఆ తర్వాత ఫోన్ ను ఇర్ఫాన్ జేబులో ఉంచి అక్కడి నుండి సైఫ్‌బిన్ వెళ్లిపోయాడు. ఆ తరువాత ఉదయం స్థానికులు ఈ విషయం తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల వచ్చే చూసే సరికి ఆటోలో ఉన్న జహంగీర్, ఇర్ఫాన్‌లు మృతి చెందా రు. సిసిటివి ఫుటేజి ఆధారంగా సైఫ్‌బిన్, కళ్యాణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా రాత్రి చోటుచేసుకున్న వివరాలను పోలీసులకు వివరించారు. అట్రానియం 25 ఎంజి అనే ఇంజెక్షన్ అధిక మోతాదు కారణంతో ఆపై గడువు ముగిసిన ఇంజెక్షన్ తీసుకోవడం వల్లనే మృతి చెంది ఉంటారని పోలీసుల అనుమానిస్తున్నారు.

# చిత్రపురి కాలనీ అక్రమాలపై విచారణ పూర్తి.. ప్రభుత్వానికి అందిన నివేదిక

### నివేదికలో సినీ పెద్దల పేర్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిత్రపురి కాలనీ అక్రమాల కేసులో విచారణ పూర్తయింది. ఈ మేరకు 2005 నుంచి 2020 మధ్య కాలంలో జరిగిన అవకతవకలపై గోల్కొండ కోఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ నవంబర్ 27న అందుకు సంబంధించిన రిపోర్టును ప్రభుత్వానికి అందజేశారు. కమిటీలో ఉంటూ నిధులు కాజేసిన 15 మందిని బాధ్యులుగా చేస్తూ.. తుది నివేదిక వెలువడింది. వారిలో చిత్రపురి కాలనీ మాజీ ప్రెసిడెంట్లు కొమర వెంకటేశ్, నటుడు బినోద్ బాల, మాజీ సెక్రటరీ కృష్ణ మోహన్, మాజీ ట్రెజరర్, నటుడు పరుచూరి వెంకటేశ్వర రావు, ఎంసి మెంబర్లు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, కె.రాజేశ్వర రావు, దేవినేని బ్రహ్మానంద రావు, చంద్రమధు, కె.ఉదయ భాస్కర్, జె.రామయ్య, నటుడు కాదంబరి కిరణ్, అనిల్ కుమార్ వల్లభనేని, ఎ.మహానంద రెడ్డి, రఘు బత్తుల, ప్రవీణ్ కుమార్ యాదవ్ ఉన్నారు. ఈ మేరకు బాధ్యుల నుంచి రూ.43.78 కోట్లు రికవరీ చేయాలని.. అటు ప్రభుత్వానికి, ఇటు రిపోర్టులో పేర్లు ఉన్న 15 మందికి గోల్కొండ కోఆపరేటివ్ సొసైటీస్ డిప్యూటీ రిజిస్ట్రార్ నివేదిక కాపీని పంపారు. చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీలో జరిగిన అక్రమాలకు సంబంధించి సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ గతంలో అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. అయితే, కమిటీలోని మరికొందరు నిందితులు ఇంకా పరారీలో ఉన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి కాలనీలో అనుమతి లేని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన విల్లాలను ఇటీవల 2024, ఆగస్టులో అధికారులు కూల్చివేశారు. జి ప్లస్ 1 అనుమతికి బదులుగా జి ప్లస్ 2, జి ప్లస్ 3 నిర్మాణాలు చేపట్టారని, అనుమతి పొందిన విల్లాల కంటే అదనపు విల్లాలు నిర్మించారని అధికారులు గుర్తించారు. ఇందులో రూ.300 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని, అల్పాదాయ వర్గాల సినీ కార్మికులకు కేటాయించాల్సిన ప్లాట్లను అక్రమంగా ఇతరులకు కట్టబెట్టారని ఆరోపణలు ఉన్నాయి.

# 'ఐబొమ్మ' రవికి సైబర్ క్రైమ్ విభాగంలో జాబ్ ఆఫర్

### పోలీసుల ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించిన రవి
### సంపాదనలో రూ.17 కోట్లు ఎంజాయ్ చేయడానికే ఖర్చు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్త సినిమాలను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమను గడగడలాడించిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు రవి విచారణలో ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. అతనికున్న సాంకేతిక నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యపోయిన పోలీసులు, ఏకంగా తమ శాఖలోనే ఉద్యోగం ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పోలీసులు రవిని కస్టడీలోకి తీసుకుని విచారించిన సందర్భంగా ఈ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. 'సైబర్ క్రైమ్ విభాగంలో పని చేస్తావా? మంచి జీతం ఇస్తాం' అని ఉన్నతాధికారులు అడిగినప్పటికీ, రవి దాన్ని సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. పోలీసులు 'నీ ఐబొమ్మ కథ ముగిసింది, తర్వాత ఏంటి నీ ప్లాన్?' అని ప్రశ్నించగా, రవి తన భవిష్యత్ ప్రణాళికలను వివరించాడు. కరేబియన్ దీవుల్లో 'ఐబొమ్మ' పేరుతోనే ఒక రెస్టారెంట్ ప్రారంభించి, భారతీయ వంటకాలను అక్కడి ప్రజలకు పరిచయం చేస్తానని చెప్పినట్లు సమాచారం. త్వరలోనే కరేబియన్‌లోని అన్ని దేశాల్లో రెస్టారెంట్ బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తానని ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది. సంపాదించిన డబ్బుతో ఉల్లాసంగా గడపడమే తన లక్ష్యమని రవి చెప్పినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటివరకు పైరసీ ద్వారా సంపాదించిన రూ. 20 కోట్లలో ఏకంగా రూ. 17 కోట్లను కేవలం ఎంజాయ్ చేయడానికే ఖర్చు చేసినట్లు తేలింది. ఇకపై కూడా వారానికో దేశం తిరుగుతూ జీవితాన్ని ఆస్వాదిస్తానని అతను చెప్పినట్లు సమాచారం. రవి బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 3 కోట్లతో పాటు హైదరాబాద్‌లోని ఫ్లాట్, విశాఖపట్నంలోని ఆస్తులను పోలీసులు సీజ్ చేశారు. అయితే, అతనికి త్వరలోనే బెయిల్ లభించే అవకాశం ఉందని పోలీసు వర్గాల నుంచి వినిపిస్తోంది.

# బిసి రిజర్వేషన్లపై సిఎంకు చిత్తశుద్ధి లేదు

### బిసి జెఎసి రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్లపై సిఎం రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదితో పాటు ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారని, కానీ ఈ భేటీలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని ఆమోదించాలని వారితో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వమే అసెంబ్లీలో బిల్లు పెట్టి చట్టం ఆమోదించిన తర్వాత రాష్ట్రపతి, గవర్నర్లకు పంపించినట్టుగానే ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు నడుస్తున్న తరుణంలో బిసి రిజర్వేషన్లపై ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందన్నారు. కానీ, ఆ బాధ్యతను నిర్వర్తించడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి బుధవారం ఢిల్లీ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదితో సిఎం రేవంత్ రెడ్డి భేటీ జరిపినప్పటికీ, ప్రధానికి ఇచ్చిన వినతి పత్రంలో కనీసం బిసి రిజర్వేషన్ల అంశం లేకపోవడం అత్యంత దుర్మార్గమని అన్నారు. రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో కూడా బిసిలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు కోసం పార్లమెంటులో పోరాటం చేయాలని సిఎం మాట్లాడకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క బుద్ధి కుక్క తోక వంకర అన్న చందంగా ఉందని, బిజెపితో కాంగ్రెస్ చీకటి ఒప్పందం మూలంగా, అలాగే ఆ పార్టీతో లోపాయికర ఒప్పందంలో భాగంగానే బిసి రిజర్వేషన్లపై బిజెపిని నిలదీయడం లేదని ఆయన ఆరోపించారు. బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్ బిజెపిల కపటనాటకాన్ని బిసి సమాజం గమనిస్తుందని, బిసిలపై వారు సాగిస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.


# తెలంగాణను అవమానించిన పవన్‌కళ్యాణ్‌ను రక్షించడమే బిజెపి లక్ష్యం!

### సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బిజెపి కొత్త రాజకీయం
### భవిష్యత్తులో పవన్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఆయనను కాపాడే ఎత్తుగడ!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రజను ఘోరంగా అవమానించిన ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ను కాపాడడానికి తెలంగాణ బిజెపి విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. దీని కోసం ప్రజల వ్యక్తిగత దైవారాధనపై సిఎం రేవంత్ రెడ్డి చేసిన విశ్లేషణను వివాదాస్పదం చేయడం ద్వారా బిజెపి స్వార్థ రాజకీయాలకు తెరలేపిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రజలది నరదిష్టి అని అహంకారపూరిత వ్యాఖ్యలు చేసిన పవన్‌ను అవసరమైన ప్రతి చోట బిజెపి రాజకీయంగా వాడుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయడం మొదలుకొని అనేక సందర్భాల్లో పవన్ కళ్యాణ్‌ను బిజెపి వాడుకుంది. తెలంగాణ ప్రజలపై పవన్ చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రం ఉపేక్షించేవి కాదని తెలంగాణ సమాజం మండిపడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తులో పవన్ను తెలంగాణలో రాజకీయంగా వాడుకోవాలంటే ఇప్పుడు ఆతన్ని కాపాడుకోవాలని బిజెపి భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో పవన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు వరుసగా విమర్శల దాడికి దిగిన రోజున ఈ అంశాన్ని డైవర్ట్ బిజెపి ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. తద్వారా పవన్ కళ్యాణ్‌ను రక్షించడానికి సిఎం చేసిన వ్యాఖ్యలపై రాజకీయం చేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల్ని ఖండించని బిజెపి**

అసలు దేవుళ్లను పూజించే విషయంలో ప్రజల విశ్వాసాన్ని విశ్లేషించిన సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల్లో ఎలాంటి వివాదం లేకపోయినా బిజెపి దాన్ని వివాదాస్పదం చేయడానికే మొగ్గు చూపినట్టు కనిపిస్తోంది. ఇదంతా కూడా పవన్ కళ్యాణ్‌ను రాజకీయంగా రక్షించడానికే బిజెపి ప్రయత్నిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. ఇక్కడ గమనించాల్సిన మరో అంశం ఏంటంటే, పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల్ని అవనమానించినా కూడా బిజెపి కనీసం స్పదించలేదు. ఆయన వ్యాఖ్యలను ఖండించలేదు.



**బిజెపికి భయం పట్టుకుంది..**

అంతేకాకుండా, బిజెపిని ప్రతి అంశంలో నిలదిస్తూ, ఆ పార్టీ మతత్వ రాజకీయాలు తెలంగాణలో సాగనివ్వకుండా అడ్డుకుంటున్న సిఎం రేవంత్‌రెడ్డి అంటే బీజేపీకి భయం పట్టుకుందని పలువురు విశ్లేషిస్తున్నారు. అందుకే ప్రతి అంశంలో ఆ పార్టీ రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తోందని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రిగా తన రెండేళ్ల పాలనలో విస్తృత సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడం, తెలంగాణ అభివృద్ధితో సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన విజన్‌తో ముందుకెళ్తుండడం బిజెపికి రుచించడం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకి రేవంత్ రెడ్డి చేరువ అవుతున్న తీరును బిజెపి జీర్ణంచుకోలేకపోందని తెలుస్తోంది. ముఖ్యంగా మేడారం అభివృద్ధి, వేములవాడ రాజన్న ఆలయాల అభివృద్ధి, గోశాలల నిర్మాణం వంటి చర్యలను ఒక కాంగ్రెస్ ముఖ్యమంత్రి చేస్తుండడాన్ని బిజెపి సహించలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కాంగ్రెస్ గెలుపును జీర్ణించుకోలేకపోతున్న బిజెపి!**

అంతేకాకుండా జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నించినా కూడా కులమతాలకు అతీతంగా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి జైకొట్టడం బిజెపికి నిద్రపట్టనివ్వడం లేదని తెలుస్తోంది. దేశంలో ఏ బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రి చేయలేని విధంగా సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు విదేశీ సంస్థలను తీసుకొస్తుండడం, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తున్న తీరును చూసి బిజెపి ఓర్వలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రజల భావోద్వేగాలు పట్టని బిజెపి స్వార్థ్య రాజకీయాల కోసమే సీఎం వ్యాఖ్యలపై రాజకీయం చేస్తోందనే చర్చ నడుస్తోంది.

# పవన్‌కళ్యాణ్‌ను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆ పదవికి అనర్హుడని, ఆయనను తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలు సాంకేతికంగా విడిపోయినా అందరూ కలిసే ఉన్నారని కాని ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టేవిధంగా, ఐక్యతకు భంగం కలిగించేలా ఉన్నాయని నారాయణ మండిపడ్డారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి ఆంధ్ర ప్రాంతంలోని భీమవరంకు చెందిన వారికి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తొలి రోజుల్లో చేగువేరా తనకు ఆదర్శమన్న పవన్ కళ్యాణ్ ఇప్పుడు సావార్కర్‌ను భుజాన వేసుకుని తిరుగుతూ సనాతన ధర్మం అంటున్నారన్నారు. ఆయన సనాతన ధర్మం కోసం తిరగాలి అనుకుంటే తమకేమి అభ్యంతరం లేదని, రాజకీయాల్లో ఉండకుండా ఆ పని చేసుకోవచ్చని చురకలు అంటించారు. సనాతన ధర్మం చెప్పి దిష్టి తగిలింది లాంటి మాటలు మాట్లాడే సనాతన వాదికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదన్నారు. రాజకీయాలకు తగదని ఆయనను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు.

**దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్, సెంట్రల్ సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్

మెహదీపట్నంలోని T.S.నెం. 2, 3 (S.T), 4, 5, 6 & 7/25-26, కన్‌స్ట్రక్షన్‌లోని 12&13/25-26, ఆజామాబాద్‌లోని 2(ST) & 3/25-26 మరియు సైఫాబాద్ డివిజన్‌లలోని 4(ST), 5, 6, 7, 8 (SC), 9 /25-26

మెహదీపట్నం డివిజన్లలోని ఇంటర్ లింకింగ్ మరియు అదనపు DTR పనులను కలిగిఉన్న T.S Nos. 2(ST), 4, 5, 6 & 7 ఇంటర్ లింకింగ్ పనులను కలిగి ఉన్న కన్‌స్ట్రక్షన్ డివిజన్‌లోని T.S Nos.12 & 13, ఇంటర్‌లింకింగ్ మరియు అదనపు పనులను కలిగి ఉన్న ఆజామాబాద్ డివిజన్‌లోని T.S Nos. 2(ST)&3 మరియు T & D ముఖ్యమైన పనుల కింద వివిధ ఇంటర్‌లింకింగ్ మరియు అదనపు DTR పనులను కలిగిఉన్న సైఫాబాద్ డివిజన్‌లోని T.S Nos. 4(ST), 5, 6, 7, 8 (SC), 9 కోసం అర్హత కలిగిన ఏజెన్సీల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ల స్పెసిఫికేషన్ల అమ్మకం : 04-12-25 (గురువారం) నుండి 11-12-25 (గురువారం) 5 PM వరకు. సీల్డ్ టెండర్ల స్వీకరణకు చివరి తేదీ: 12-12-25 (శుక్రవారం) మధ్యాహ్నం 3 గంటల వరకు. టెండర్ తెరిచే తేదీ: 12-12-25 (శుక్రవారం) మధ్యాహ్నం 3 : 30 గంటలకు. T.S. Nos. కోసం టెండర్ల షెడ్యూల్ సంబంధిత డివిజన్ కార్యాలయాల నుండి సేకరించబడుతుంది. మొత్తం సమాచారాన్ని www.tgsouthernpower.com లేదా కింద సంతకం చేయబడిన వారి నుండి పొందవచ్చు. ఫోన్ నెంబర్లు: 8712469969, 872469928 & 871269884 ద్వారా కూడా పొందవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్, సెంట్రల్ సర్కిల్, హైదరాబాద్.
DIPR R.O. No. : 11684-PP/CL/ADVT/1/2025-26, Date: 03-12-2025

దేవాదాయ ధర్మాదాయ శాఖ, తెలంగాణ ప్రభుత్వము
**శ్రీ జోగులాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము**
అలంపూరు పట్టణము, జోగులాంబ గద్వాల జిల్లా, తెలంగాణ. ఫోన్ నం. 08502-241327

సీల్డ్ టెండరు కం బహిరంగ వేలము కం ఆన్‌లైన్ టెండర్ల ప్రకటన
లేఖ నం.: 6/EO/SJBBSGD/2025 తేది: 03.12.2025

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియచేయునది ఏమనగా ఇట్టి దేవస్థానమునకు సంబందించి ఈ క్రింద తెలిపిన వివిధ టెండర్లు నిర్వహించబడును.

విభాగము-ఎ

| క్ర.సం. | టెండరు వివరము | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | శ్రీ అమ్మవారి చీరల సేకరణ చేసుకొను హక్కు | ఒక సంవత్సరము 15.12.2025 నుండి 30.11.2026 వరకు | 1,000-00 | 8,00,000-00 |
| 2 | టెంకాయలు, పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు | | 1,000-00 | 15,00,000-00 |
| 3 | పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు | | 1,000-00 | 15,00,000-00 |
| 4 | వసతి గదులు నిర్వహించుకొను హక్కు | | 1,000-00 | 4,00,000-00 |

విభాగము-బి

| క్ర.సం. | టెండరు వివరము | కాల పరిమితి | షెడ్యూలు ధర రూ. | డిపాజిట్ రూ. |
|---|---|---|---|---|
| 1 | అరటి మట్టలు, మామిడాకులు సరఫరా చేయుట | రెండు సంవత్సరములు 15.12.2025 నుండి 30.11.2027 వరకు | 1,000-00 | 10,000-00 |
| 2 | హోమమునకు అవసరమైన కట్టెలు (సమిధలు) సరఫరా చేయుటకు | | 1,000-00 | 10,000-00 |

ఆసక్తి గల వారు సీల్డ్ కం బహిరంగ వేలము కం ఆన్ లైన్ టెండరు పూర్తి వివరముల కొరకు www.tender.telangana.gov.in endowments. Marketing నందు తిలకించగలరు.
ఈ సీల్డ్ టెండర్లలో పాల్గొనదలచిన వారు తేది: 04.12.2025 నుండి 09.12.2025 నాడు సా. గం.5-00 లోపు షెడ్యూలు ధర రూ.1,000/- చెల్లించి షెడ్యూల్లు పొందగలరు.
వేదిక :- శ్రీ జోగులాంబా బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానము, అలంపూరు గ్రా. & మం., జోగులాంబ గద్వాల జిల్లా.
టెండర్లు నిర్వహించు తేది: 10.12.2025 బుధవారము, సమయము మ. 11-30 లకు
ఈ టెండర్లలో పాల్గొను వారు హిందూ మతమును ఆచరించువారై వుండవలెను.
అన్య మతస్తులు ఈ టెండర్లలో పాల్గొనుటకు అనర్హులు.
షరతులు మరియు ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయము నందు కానీ (లేదా) సెల్ నం. 9490518885 కానీ, 9441311022 ను కానీ సంప్రదించగలరు.
కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 11674-PP/CL/ADVT/1/2025-26, Date: 03-12-2025

## పారదర్శకంగా నామినేషన్ల పరిశీలన

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** నామినేషన్ల పత్రాల పరిశీలన పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నామినేషన్ సెంటర్ కేంద్రాలను సందర్శించి దాఖలైన నామినేషన్ల సంఖ్య, తిరస్కరించిన నామినేషన్ల వివరాలు,అభ్యర్థులు అందజేసిన బ్యాంకు అకౌంట్స్, కుల ధ్రువీకరణ పత్రాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల పరిశీలనలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. ఆమె వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ, జడ్పి సీఈవో శ్రీనివాసరావు, డిపిఓ వెంకయ్య, తహశీల్దార్ అనిల్ కుమార్, ఇంచార్జ్ ఎంపిడిఒ బిక్షమయ్య, ఎంఈఓ శ్రీనివాస్ ఉన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నాయకులు

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** ఆత్మకూర్(ఎస్) మండలంలోని కందగట్ల గ్రామానికి చెందిన 50 మంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామ కాంగ్రెస్ అభ్యర్థి శిగ శ్రీను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.





## ఎన్నికలలో ఏ చిన్న నిర్లక్ష్యానికీ తావులేదు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికలలో ఏ చిన్న నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆయన బుధవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడవ విడత నామినేషన్ల స్వీకరణలో బాగంగా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి క్లస్టర్, మోటాకొండూర్ మండల కేంద్రం పరిధిలో గల క్లస్టర్ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్, వార్డ్ మెంబర్‌లకు ఎన్ని నామినేషన్లు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థి నియమ, నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు తీసుకొచ్చారా అని ఒకటికి రెండుసార్లు పరిశీలించాలన్నారు. అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసేందుకు ఏమైనా సందేహాలు, ఇబ్బందులు ఉంటే హెల్ప్ డెస్క్ ద్వారా అధికారులు సహాయం చేయాలన్నారు. ఏ ఫారం తప్పు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఐదు గంటల తర్వాత ఎలాంటి నామినేషన్లనుమతించవద్దని, నామినేషన్ల సందర్బంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం చింతపల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు మహమ్మద్ సర్వర్, యూత్ కార్యదర్శి ఆంజనేయులుతో పాటు 30 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎంఎల్ఏ బాలునాయక్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారని, ప్రజలతో మమేకమై అభివృద్ధి పథంలో ముందుకు సాగిస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పట్ల విశ్వాసంతో బిఆర్ఎస్, బిజెపి పార్టీలను వీడి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా చేరిన కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ పాత, కొత్త తేడా లేకుండా కలిసి కట్టుగా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## ప్రభుత్వ ఆసుపత్రిలో సూదుల కొరత, రోగులకు ఇబ్బందులు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు చికిత్స అందించేందుకు పరికరాల లేక ఇబ్బందులు ఎదురవుతున్న ఘటన స్థానిక ఆసుపత్రిలో ఆందోళన కలిగించింది. మండల కేంద్రానికి చెందిన చిన్నారి విద్యార్థి పాఠశాలలో కింద పడి గాయాలవగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. గాయం పెద్దదిగా కావడంతో కుట్లు వేసేందుకు సూదులు లేవని డాక్టర్ ఇచ్చిన సమాధానంలో ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రేకెత్తించింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం అవసరమైన ప్రథమ చికిత్సకు సంబంధించిన కిడ్స్ అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ కళాశాల నుంచి ట్రైనింగ్ నిమిత్తం వస్తున్న విద్యార్థులచే వైద్యం చేయిస్తూ అక్కడున్న డాక్టర్లు, స్టాఫ్ నర్స్, చోద్యం చూస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకొని, అన్ని రకాల పరికరాలను అందించాలని జిల్లా డీఎంహెచ్ఓను స్థానికులు కోరారు. నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానా కు అనే పాటకు కళ్లకు కట్టినట్లు కనిపించిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య సేవలు బలహీనపడుతున్నాయనే అభిప్రాయం ప్రజలలో ఆ నానుడు ఇంకా పోలేదని ప్రజలు తెలిపారు.

## అంగన్‌వాడీ ఉద్యోగానికి రాజీనామా

### సర్పంచ్ బరిలో అమరావతి



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలంలోని అమ్మనబోలు అంగన్వాడి కేంద్రం 3 టీచర్ నాయిని అమరావతికి(వసంత) అంగన్వాడీ ఉద్యోగానికి రాజీనామా చేసి ఇటీవల ఏర్పడిన నూతన గ్రామపంచాయతీ ఆబిద్ నగర్ సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. ఈమె 2007 సంవత్సరంలో అంగన్వాడి టీచర్‌గా ఉద్యోగం పొంది 18 సంవత్సరాలుగా సర్వీసు కొనసాగిన తర్వాత ఇటీవల అంగన్వాడి టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీ తరపున సర్పంచ్ బరిలో నిలుచున్నారు. ఆమె అంగన్వాడి టీచర్‌గా గర్భిణీలకు, బాలింతలకు ఎన్నో సేవలు అందించి 2012 సంవత్సరంలో ఉత్తమ అంగన్వాడీ టీచర్‌గా ఎంపిక కాబడినారు. అనంతరం 2024లో అదనపు విధులలో భాగంగా బూతు లెవెల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ అప్పటి కలెక్టర్ పమేల సత్పతి చేతుల మీదుగా ఉత్తమ బిఎల్ఓగా అవార్డు పొందారు. ఈ సందర్భంగా అమరావతి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే తపనతో అంగన్వాడి ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్‌గా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌గా గెలిచిన తర్వాత ఉత్తమ అంగన్వాడీ అవార్డులు అందుకున్న రీతిలోనే సర్పంచ్‌గా కూడ అవార్డులు అందుకునేందుకు అభివృద్ధిలో పాలుపంచుకుంటానని తెలిపారు.

# ప్రతీ ఆటలో పోటీతత్వం సహజం






### నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి

### కన్నుల పండువగా రాష్ట్రస్థాయి బాలిక కబడ్డీ పోటీలు ప్రారంభం

**ప్రజాపక్షం/హాలియా:** 21వ రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రి హాలియాలో కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కబడ్డీ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరుగుతున్న బాలికల కబడ్డీ పోటీలలో బాలికలు తమ ప్రతిభను కనబరిచి జాతీయ జట్టుకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ప్రతి క్రీడాకారుడు ఆటను క్రీడా స్ఫూర్తిగా తీసుకొని గెలుపోటములు పక్కనపెట్టి తమ ప్రతిభను కనబరచాలని సూచించారు. ప్రతి ఆటలో పోటీ తత్వం ఉంటుందని దానిని సమర్థవంతంగా ఎదుర్కొని విజయం సాధించేలా కష్టపడాలని క్రీడాకారులకు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మన నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాలో జరగడం అభినందనీయమని క్రీడాకారులు ఆనందోత్సాహాల నడుమ ఈ ఆటల పోటీలను నిర్వహించాలని చెప్పారు. అంతకుముందు వివిధ జిల్లాలకు చెందిన బాలిక క్రీడాకారులు ర్యాలీగా బయలుదేరి క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. బుధవారం సాయంత్రం నల్గొండ జిల్లా బాలికల జట్టు హైదరాబాద్ జట్లు పోటీ పడ్డాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్, సెక్రటరీ మహేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ హాఫీజ్ ఖాన్, డివైఎస్ఓ అక్బర్ అలీ,బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్ కుమార్,జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భూలోకరావు,సెక్రటరీ కర్తయ్య,అన్వర్ ఖాన్,రాంబాబు, సహదేవ్, సైదులు పాల్గొన్నారు.

# నామినేషన్ ఉపసంహరణలో ప్రలోభాలకు గురిచేయొద్దు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అభ్యర్థులను నామినేషన్ ఉపసంహరణలో ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు గురి చేయరాదని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని విసి హాల్‌లో పంచాయితీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కింద నిర్వహించనున్న 8 మండలాల్లోని గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నేటితో ఉపసంహరణ పూర్తి అవుతుందని పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని సూచించారు. సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సపోర్టింగ్ స్టాఫ్‌కు, ఎన్నికల్లో ఉపయోగించే వాహన డ్రైవర్లకు ఫారం 14 ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని, వారి ఓటు ఉన్న సంబంధిత ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ నందు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పంపిణీ ప్రక్రియ సాఫీగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతిరోజు ఉదయం స్ట్రాంగ్ రూమ్ నుండి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పోలీస్ స్ట్రాంగ్ రూమ్ నుండి ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు పోలీస్ బందోబస్త్‌తో తీసుకెళ్లాలని తెలిపారు. అక్కడ గ్రామ పంచాయితీల వారీగా బ్యాలెట్ బాక్స్‌లను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని మౌళిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని మరలా సాయంత్రం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కి పోలీస్ ఎస్కార్ట్‌తో తరలించి భద్రపర్చాలని సూచించారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో రికార్డు చేయాలని అన్నారు. పోటీచేసే అభ్యర్థుల జాబితా ఖరారు అయిన తర్వాత అభ్యర్థులతో ఆర్ఓలు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి మార్గదర్శకాలు, ఎన్నికల ఖర్చుల నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. మొదటి విడత, రెండో విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగిందని ఇలాగే అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్‌పి కె నరసింహ, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఈఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డిఎల్‌పిఓ నారాయణరెడ్డి హాజరైనారు.

# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన దివ్యంగ క్రీడల పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలో దివ్యాంగులకు నిర్వహించిన క్రీడా పోటీలలో దివ్యాంగులు క్రీడా స్ఫూర్తితో ఆడారని కలెక్టర్ అన్నారు.క్రీడల ద్వారా మానసిక, శారీరక సామర్థ్యాలు పెంపొందించుకోవడం తో పాటు,ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు. సమాజంలోని అందరితోపాటు, దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని , ఇందుకుగాను విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య అభివృద్ధి వంటి రంగాలలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడానికి రెవిన్యూ డివిజన్లు,మండలాలలోసమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ ప్రత్యేక ప్రజావాణిలో దివ్యాంగుల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.దివ్యాంగుల సంక్షేమం కోసం బ్యాటరీ మో టార్ వెహికల్స్, పింఛన్లను ప్రభుత్వం ఇస్తున్నదని, దివ్యాంగుల ఇతర సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. దివ్యాంగులు బాగా చదువుకోవాలని, అన్ని రంగాలలో అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ పి. రమేష్,జిల్లా సంక్షేమ సంక్షేమ అధికారి కృష్ణవేణి,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డిఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్,డిఇఓ బిక్షపతి,జిల్లా క్రీడలు,యువజన సేవల అధికారి అక్బర్ అలీ,సిడిపిఓ హరిత తదితరులు ఉన్నారు.

## బైకును ఢీకొట్టిన కారు...

### ప్రమాదంలో కుమారుడు మృతి.. తండ్రికి గాయాలు..



**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్)) :** అతివేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వస్తున్న తండ్రి కొడుకులలో కొడుకు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రనాగుల సైదులు(30) తన తండ్రి పంతులుతో కలిసి స్వగ్రామమైన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మంగ్యాతండ నుండి మోటర్ సైకిల్‌పై బయలుదేరి గొర్రె పిల్లలను కొనడానికి ఆత్మకూర్(ఎస్) గ్రామానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో ఆత్మకూర్(ఎస్) క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి అదే సమయంలో ఏపూర్ వైపు నుండి సూర్యాపేటకు వెళ్తున్న కారు అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ఎర్రనాగుల సైదులు నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులుకు తల, కాళ్ళు, చేతులకు బలమైన గాయాలై అక్కడికి అక్కడే మృతి చెందగా బైక్ వెనుక కూర్చున్న తండ్రి పంతులుకు తీవ్ర గాయాలయ్యాయి. అదే వేగంతో కారు ముందుకు దూసుకుపోయి రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన రెండు బైక్‌లను ఢీకొట్టగా బైక్‌లు కూడా ధ్వంసం అయ్యాయి. వేగంగా వెళ్ళిన కారు ఫల్టీ కొట్టింది. కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుని భార్య విజయ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ మహబూబ్‌బాద్ జిల్లా మరిపెడ మండలం చౌక్లాతండకు చెందిన బానోతు కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## దివ్యాంగుల అన్ని విధాల సమస్యలను పరిష్కరిస్తాం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లాలో ఉన్న దివ్యాంగుల అందరికి ప్రభుత్వం నుండి అన్ని విధాల తమ సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం 2025 జిల్లా సంక్షేమ అధికారి కె నరసింహారావు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్‌పి మాట్లాడుతూ పోలీసులు దివ్యాంగుల సమస్యలను తప్పకుండా ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరిస్తామన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం కోసం వచ్చిన దివ్యాంగులకు ప్రత్యేకంగా వాహనాలు (స్కూటీ) అనుమతి ఇస్తామన్నారు. పిడి మెప్మా, మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల ఎస్‌హెచ్‌జి సంఘాలు ఏర్పాటు చేస్తామని వారికి రుణాలు మంజూరి బ్యాంకర్స్ ద్వారా కలిపిస్తామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దివ్యాంగులకు ఏర్పాటు చేసిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు అపూర్వ బదిరుల స్కూల్, చెవిటి, మూగ విద్యార్థులకు గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎల్‌డిఎం నాగప్రసాద్, డిఆర్‌డిఏ డిపిఎం బెనర్జీ, టౌన్ సిఐ వెంకటయ్య, జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు, సంక్షేమ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ప్రీ మెట్రిక్ ఉపకారవేతన రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న 5వ తరగతి నుండి 10వ తరగతి వరకు, ప్రైవేట్ పాఠశాలల్లో 9, 10వ తరగతులు చదువుతున్న షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులు 2025/26 విద్యా సంవత్సరానికి గాను ప్రీ మెట్రిక్ ఉపకారవేతనాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ త్వరగా పూర్తి చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కె దయానంద రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకారవేతనాల దరఖాస్తుకు కావల్సిన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, విద్యార్థి పాస్‌ఫోటో, విద్యార్థి యొక్క బ్యాంక్ అకౌంట్ (ఆధార్ లింక్ తప్పనిసరి), విద్యార్థులు దరఖాస్తు చేసుకొనుటకు ఈపాస్ పోర్టల్ వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి కార్యాలయం, ఫస్ట్ ఫ్లోర్, రూమ్ నంబర్ ఎఫ్ 3, కలెక్టరేట్ కాంప్లెక్స్ నందు సంప్రదించాలని సూచించారు.

## బిసిలలో రాజకీయ చైతన్యం పెరగాలి

### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బిసిలలో రాజకీయ చైతన్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని గాంధీనగర్ పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రెడ్డిలకు ఒక పార్టీ, వెలమలకు ఒక పార్టీ, బ్రాహ్మణులకు మరొక పార్టీ రాష్ట్రంలో ఉందని కానీ బడుగు, బలహీన వర్గాల కోసం ఏ ఒక్క పార్టీ కూడా లేదన్నారు. రాష్ట్రంలో 2.5 కోట్ల మంది బిసిలు సంఘటితంగా ఉంటే అగ్రవర్ణాల ఆదిపత్యం ఉండదన్నారు. రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బిసిల ప్రభుత్వం రాబోతుందని జోస్యం చెప్పారు. టిఆర్‌పి రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇంచార్జి వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల తలరాత మార్చడం కోసం వచ్చిన నాయకుడు, ప్రజాగొంతుకై పిఆర్‌పిని తీన్మార్ మల్లన్న పెట్టారన్నారు. అనంతరం పట్టణ, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సూర్యాపేట నియోజక వర్గ మైనార్టీ అధ్యక్షులుగా చాంద్‌పాషా, సూర్యాపేట పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కుంభం నాగరాజు, ఏశబోయిన మల్లేష్ యాదవ్, సూర్యాపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా లింగస్వామి గౌడ్, శంకర్ నాయక్, ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బొల్లెం సైదులు, మల్లయ్య యాదవ్, పెన్‌పహాడ్ మండల అధ్యక్షులుగా ఆవుల అంజయ్య యాదవ్‌లు ఎన్నికయ్యారు. టిఆర్‌పి జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ ప్రొఫెసర్ నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, రజిత, ఇందిర, నాయకులు పాల్గొన్నారు.




# దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తాం

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వం దివ్యాంగులకు హక్కులను కల్పించడంతో పాటు సమాజంలో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగుల దినోత్సవ వేడుకలను జిల్లా కలెక్టర్ హనుమంతరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం రోజు పలు ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చి దివ్యాంగుల దినోత్సవం జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. దివ్యాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దివ్యాంగులు శరీర లోపమే గాని మానసికంగా, స్థిరమైన ఆరోగ్యం కలిగి ఉంటారని అన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలన్నారు. యుడిఐడి కార్డుల జారీ విషయంలో మన జిల్లా 6వ స్థానంలో ఉందన్నారు. దివ్యాంగుల కోసం ప్రత్యేక మెగా క్యాంపు నిర్వహించడం జరుగుతుందని, వారియొక్క సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అర్హులైన దివ్యాంగుల కోసం ట్రై సైకిల్, బ్యాటరీ సైకిల్‌ను కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంగవైకల్యం ఉన్న వారు తక్కువ కాదని, ఉన్నత శిఖరాలను అధిరోహించడం కూడా జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల పిల్లల కోసం ప్రతి మండలంలో ఉపాధ్యాయులు వారి ఇంటికి వెళ్తున్నారు. వారి ప్రత్యేక అవసరాలను వారు తీరుస్తున్నారు. కావున ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్ల కోసం ఆన్లైన్లో అప్లై చేసిన వారందరికీ సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు ఉపాధి హామీ పథకం కింద వారి సామర్థ్యాన్ని బట్టి జాబ్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో 12,626 మందికి 5 కోట్ల ఏడు లక్షలు పెన్షన్లు దివ్యాంగుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 24251 పనిదినాలకు 72 లక్షలు ఉపాధి హామీ కింద వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగులందరూ తమ తమ ప్రతిభతో వివిధ రంగాల్లో ముందుకు వెళ్తున్నారన్నారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించగా, గెలుపొందిన వారికి బహుమతులు కలెక్టర్ ప్రధానం చేశారు. దివ్యాంగుల కమిటీ మెంబర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి జంగారెడ్డి, సదరం ఎగ్జిక్యూటివ్ మెంబర్ మైత్రేయు, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ పాండు నాయక్, మెప్మా అధికారి రమేష్, సిడిపిఓలు, ఏపీఎంలు, దివ్యాంగుల అసోసియేషన్స్ వారు, జిల్లా సమైక్య అధ్యక్షులు రేణుక, జిల్లా సంక్షేమ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రముఖ సోషలిస్ట్ నాయకుడు పన్నాలాల్ సురానా కన్నుమూత



**సోలాపూర్:** ప్రముఖ సోషలిస్ట్ నాయకుడు పన్నాలాల్ సురానా(93) అనారోగ్యంతో సోలాపూర్‌లో కన్నుమూశారు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని వెల్లడించారు. స్వల్ప అనారోగ్యానికి గురైనా పన్నాలాల్ సురానా మంగళవారం రాత్రి చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. ఆయన భౌతిక కాయాన్ని శాస్త్రీయ పరిశోధన, వైద్య విద్య కోసం దానం చేసేనట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. సమాజంలోని బాధితులు, అణిచివేతకు గురైన వర్గాలకు న్యాయం జరిగేందుకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. సానే గురూజీ స్థాపించిన రాష్ట్ర సేవా దళ్ మాజీ ప్రెసిడెంట్ సురానా బీహార్‌లో ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమంలో చేరారు. ఎమర్జెన్సీ సమయంలో 18మాసాల పాటు జైలులో ఉన్నారు. మరాఠీ డైలీ మరాఠ్వాడ ఎడిటర్‌గా పనిచేశారు. రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ రంగానికి సంబంధించిన పలు పుస్తకాలకు పన్నాలాల్ సురానా రచయితగా ఉన్నారు.

## ఢిల్లీ కాలుష్య సమస్యపై
## విద్యార్థులు, పౌరుల నిరసన

**న్యూఢిల్లీ:** రాజధానిలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అత్యంత దిగజారిన వాయు నాణ్యతను వ్యతిరేకిస్తూ, బుధవారం జంతర్ మంతర్ వద్ద వందలాది మంది నిరసన వ్యక్తం చేశారు. మంచి, నాణ్యమైన గాలి కావాలంటూ నినాదాలు చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ, జెఎన్‌యు, జామియా మిలియా ఇస్లామియా విద్యార్థులు, కాంగ్రెస్ అనుబంధ సంస్థ ఎన్ఎస్‌యుఐ సభ్యులతో కలిసి ఈ నిరసనలో పాల్గొన్నారు. నిరసనకారులు ఢిల్లీ వాసులకు వాయి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 50 కన్నా తక్కువ ఉండాలని అన్నారు. 'శుభ్రమైన గాలి మా మౌలిక హక్కు..నిరసనకారుల్లో ఒకరైన 26 ఏళ్ల నేహా మాట్లాడుతూ, కేంద్రంతో పాటు ఎంసిడిలో కూడా బిజెపి అధికారంలో ఉన్నప్పటికీ కాలుష్యాన్ని తగ్గించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. 'గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర నేరారోపణలు చేసుకునేవి. ఇప్పుడు అలా అనే అవకాశం లేదు.యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టే వరకూ నిరసనలు కొనసాగిస్తాం' అని మరో నిరసనకారుడు వ్యాఖ్యానించారు. దీపావళి తర్వాత ఢిల్లీ గాలి నాణ్యత ఎక్కువగా చాలా చెడు నుండి తీవ్ర స్థాయిలోనే కొనసాగుతోంది. సిపిసిబి ప్రకారం ఎక్యూఐ 301–400 అత్యంత ప్రమాదకరం. అంతకు మించితే, ప్రాణాంతకం. ఢిల్లీలో పరిస్థితి రోజురోజుకూ దిగజారుతున్నది. కాగా, ఈ సమస్య ఇటు పార్లమెంటులో, అటు సుప్రీం కోర్టులోనూ ప్రస్తావనకు వచ్చింది. ఢిల్లీ–ఎన్సీఆర్‌లో వాయు కాలుష్యాన్ని సీజనల్ సమస్యగా చూడలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. తక్షణ, దీర్ఘకాలిక పరిష్కారాల కోసం నెలకు రెండు సార్లు కేసును జాబితాలో పెట్టాలని ఆదేశించింది. కాగా, పార్లమెంటులో వైఎస్ఆర్‌సిపి సభ్యుడు అయోధ్య రామిరెడ్డి ఢిల్లీ ప్రస్తావించారు. సమస్యను 'ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా అభివర్ణించారు. కాలుష్యం కారణంగా రాజధానిలో ప్రతి ఏడుగురిలో ఒకరు అకాల మృత్యువాత పడుతున్నారని డేటాను ఉదహరించారు.గత ఏడాది 17,000 పైగా మరణాలు విష గాలికి నేరుగా సంబంధించినవేనని తెలిపారు.పర్యవేక్షణ లేని గాలి కాలుష్యం భారతదేశానికి సంవత్సరానికి జిడిపిలో మూడు శాతానికి పైగా నష్టం కలిగిస్తోందని చెప్పారు. సత్వర చర్యలు అవసరమని పేర్కొన్నారు.

## సంచార్ సాథీ యాప్...సెల్‌ఫోన్ వినియోగదారుల
# గోప్యతకు విఘాతం



కాంగ్రెస్ ఎంపి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ధ్వజం

రాజ్యసభలో విపక్షాల ఆందోళనా స్వరం

**న్యూఢిల్లీ :** సంచార్ సాథీ మొబైల్ యాప్‌కు సంబంధించిన విపక్షాల ఆందోళన స్వరం రాజ్యసభను కుదిపేసింది. బుధవారం కాంగ్రెస్ ఎంపీ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలా ఈ యాప్ గోప్యతపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది ప్ర తీ వ్యక్తి గోప్యతా హక్కుకు పూర్తిగా విఘాతం కలిగిస్తుందని ధ్వజమెత్తారు. ఈ అంశాన్ని లేవనెత్తుతూ అప్లికేషన్ లక్షణాలు ప్రతీ వినియోగదారుడి రియల్ టైమ్ జియో లొకేషన్, సెర్చ్ హిస్టరీ పర్యవేక్షణ, ఆర్థిక లావాదేవీ, ఎస్ఎంఎస్, వాట్సాప్ ద్వారా సంభాషణలను పర్యవేక్షించే అవకాశం ఉందని ఆయన స్పష్టమైన ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం కమ్యునికేషన్ల మంత్రిత్వ శాఖ ఒక ఉత్తర్వు జారీ చేసిందన్నారు. దీని ద్వారా అన్ని సెల్‌ఫోన్ తయారీదారులు, సెల్‌ఫోన్ దిగుమతిదారులు తప్పనిసరిగా సంచార్ సాథీ యాప్‌ను అప్‌లోడ్ చేయాలని ఆదేశించిందని, ఈ యాప్‌ను ప్రతీ సెల్‌ఫోన్, స్మార్ట్ ఫోన్‌లో కూడా ఉంచాలని కూడా ఆదేశించించబడిందని సుర్జేవాలా చెప్పారు. నవంబరు 28నాటి మంత్రిత్వ శాఖ ఉత్తర్వు ప్రకారం, అన్ని మొబైల్ ఫోన్ తయారీదారులు భారతదేశంలో విక్రయించే అన్ని హ్యాండ్‌సెట్‌లలో, ఇప్పటికే ఉన్న పరికరాలలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా సంచార్ సాథీ యాప్‌ను ప్రీ ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఆదేశించింది. ఇది మొబైల్ ఫోన్ కంపెనీలను ముందుగా ఇన్‌స్టాల్ చేసిన సంచార్ సాథీ అప్లికేషన్‌ను మొదటిసారి ఉపయోగించినప్పుడు లేదా డివైజ్‌ను నెలకొల్పేటప్పుడు చిట్టచివరి వినియోగదారులకు సులభంగా కనిపించేలా, అందుబాటులో ఉండేలా చూసుకోవాలని కూడా ఆదేశించింది. సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ చేయడం భారతదేశంలోని ప్రతీ స్మార్ట్ ఫోన్, సెల్‌ఫోన్ వినియోగదారుల గోప్యతను ఉల్లంఘించడమేనని సుర్జేవాలా అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు సుర్జేవాలా మాట్లాడుతూ ఇది ప్రతి వ్యక్తి గోప్యతా హక్కును తిరస్కరించడం కాదా ? అని ప్రశ్నించారు. సర్, సాధ్యమయ్యే ఒక కిల్ స్విచ్‌తో ప్రతీ సెల్‌ఫోన్‌ను ఒక ఇటుకలా మారుస్తుందన్నారు. అప్పుడు ప్రభుత్వం కోరుకుంటే ప్రతీ జర్నలిస్ట్ సెల్‌ఫోన్, ప్రతీ ప్రతిపక్ష నాయకుడి సెల్‌ఫోన్, ప్రతీ అసమ్మతివాది సెల్‌ఫోన్, ఒక కిల్ స్విచ్‌ను ఉపయోగించినట్లయితే ఒక సాధారణ ఇటుకగా మారుతుందని విస్మయం వ్యక్తం చేశారు. ప్రతీ యూజర్‌కు సంబంధించిన అన్ని పాస్‌వర్డ్‌లు, సమాచారం, బ్యాంక్ ఖాతా నంబర్లు, వ్యక్తిగత సమాచారం సెల్‌ఫోన్‌లో నిల్వచేయబడిందని సుర్జేవాలా చెప్పారు. ప్రతీ సంస్థతో, హ్యాకర్‌తో లేదా ఈ సందర్భంలో రెండింటితోనూ అనుమానాస్పదంగా మారుతుందన్నారు. ప్రభుత్వం అప్‌గ్రేడ్ కోసం ప్రయత్నిస్తుందనీ, కానీ శ్యామ్‌సంగ్ మూడు నెలలు అలా చేయదని, మూడు నెలలపాటు మేము తయారుచేసే అన్ని సెల్‌ఫోన్‌లను ఏవిధంగానైనా హ్యాకర్ హ్యాక్‌చేసే అవకాశం ఉందని, ప్రతీ వ్యక్తి డేటాను పూర్తిగా రాజీ చేస్తుంది అని సుర్జేవాలా తెలిపారు. పునరుత్పాదకత లేని అప్లికేషన్‌ను తప్పనిసరిచేయడానికి చట్టపరమైన అధికారాన్ని స్పష్టంచేయాలని, తప్పనిసరి సాఫ్ట్‌వేర్‌ను నవీకరించడం అమలుచేయాలన్నారు. దానికోసం ఎలాంటి స్వతంత్ర భద్రతా ఆడిట్, రక్షణ చర్యలు, దుర్వినియోగ విధానాలు అమలులో ఉన్నాయో వెల్లడించాలని సుర్జేవాలా డిమాండ్ చేశారు.

ఈ యాప్‌తో స్నూపింగ్ సాధ్యం కాదు : లోక్‌సభలో మంత్రి జ్యోతిరాదిత్య సింధియా

సంచార్ సాథీ యాప్‌పై గోప్యతా ఆందోళనల మధ్య బుధవారం లోక్‌సభలో కేంద్ర కమ్యునికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ దీనిని సమర్థించారు. సంచార్ సాథీ యాప్‌తో స్నూపింగ్ సాధ్యం కాదని, అది ఎట్టి పరిస్థితులలో జరుగదని స్పష్టంచేశారు. ఫీడ్ బ్యాక్ ఆధారంగా పరికరాలలో యాప్ఇన్‌స్టాలేషన్‌కుసంబంధించిన ఆర్డర్‌లో మార్పులు చేయడానికి మంత్రిత్వశాఖ సిద్ధంగా ఉందని లోక్‌సభకు మంత్రి జ్యోతిరాదిత్య వివరించారు. యాప్‌కు సంబంధించి స్నూపింగ్ ఆందోళనలపై కాంగ్రెస్ నాయకుడు దీపేందర్ సింగ్ హుడా అడిగిన అనుబంధ ప్రశ్నకు మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సమాధానం ఇచ్చారు.దేశంలో విక్రయించే అన్ని హ్యాండ్‌సెట్‌లలో, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా ఇప్పటికే ఉన్న పరికరాలలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీఇన్‌స్టాల్ నవంబరు 28న ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ వివాదం చెలరేగింది. దాదాపు 1.5 కోట్ల యాప్ డౌన్‌లోడ్‌లు జరిగాయి. పోర్టల్ , యాప్‌తో 26లక్షల దొంగిలించబడిన హ్యాండ్‌సెట్లను గుర్తించగలిగామని, దొంగిలించబడిన 7లక్షల హ్యాండ్ సెట్లను వినియోగదారులకు తిరిగి ఇచ్చేసామని, 41లక్షల మొబైల్ కనెక్షన్లను డిస్‌కనెక్ట్‌చేశామని,6లక్షలమోసాలనుబ్లాక్‌చేశామని చెప్పారు.

## అస్సాం టీ కార్మికుల 'పిఎఫ్' నమోదులో లోపాలు,
### క్లెయిమ్ పరిష్కారాల్లో ఇబ్బందులు.. కాగ్ నివేదికలో వెల్లడి




**గౌహతి:** అస్సాంలో కనీసం 40,000 టీ తోట కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) సదుపాయం, క్లెయిమ్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిఎఫ్ కోసం పేర్లు నమోదు చేసే సమయంలో దొర్లిన లోపాలు ఇప్పుడు కార్మికులకు ఇబ్బందికరంగా మారాయి. అత్యధిక శాతం క్లెయిమ్‌లు అపరిష్కృతంగానే ఉంటున్నాయి. ఈ విషయాలను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజా నివేదిక వెల్లడించింది. అస్సాం టీ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఎటిఇపిఎఫ్ఒ) వల్ల కార్మికులకు ఎదరవుతున్న పలు సమస్యలను ప్రస్తావించింది. 2017–18 నుండి 2021–22 వరకు సంస్థ పనితీరుపై కాగ్ తన నివేదికను ఇటీవల అసెంబ్లీకి సమర్పించింది. అస్సాంలో టీ తోటలు, కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఏర్పాటైన ఎటిఇపిఎఫ్ఒ తన పూర్తి బాధ్యతను ఇంకా నెరవేర్చలేదని నివేదిక వెల్లడించింది. ఎటిఇపిఎఫ్ఒలో మొత్తం 1,197 టీ తోటలు నమోదు కాగా, అందులో 624 తోటల్లో మాత్రమే కార్మికులు మాత్రమే సరైన నమోదును కలిగి ఉన్నారని పేర్కొంది. అర్హులైన కార్మికుల సంఖ్య 12,37,351 కాగా, అందులో 11,98,231 మందికి మాతమ్రే సరైన నమోదు... వివరాలు ఉన్నాయి. అంటే 39,120 మంది అర్హులైన కార్మికులు 2022 మార్చి నాటికి ఎటిఇపిఎఫ్ఒ పథకాల ప్రయోజనాలకు నోచుకోవడం లేదు. కాగ్ తెలిపిన వివరాలను అనుసరించి, 2022 మార్చి చివరినాటికి 334 టీ తోటలలో పిఎఫ్ చందాల జమలో రూ. 315.45 కోట్ల లోటు ఉంది. ఈ తోటలలో 83 శాతం వరకు ఐదేళ్లపాటు చందా చెల్లింపు పూర్తిగా ఆలస్యం.. చెల్లింపులు జరగకపోవడం వంటి సమస్యలు చోటు చేసుకున్నాయి. ఈ గణాంకాల్లో అస్సాం టీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎటిసిఎల్) యాజమాన్యంలోని తోటలు చేరలేదు. ఎటిసిఎల్‌కు చెందిన 19 టీ తోటలలో 20,994 మంది ఉద్యోగులు ఎటిఇపిఎఫ్ఒలో నమోదయ్యారు. అయితే, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం వల్ల, 2005 నుండి ఉద్యోగి–ఉద్యోగదాత పిఎఫ్ చందాలను జమ చేయడంలో ఈ తోటలు తప్పనిసరి చేశాయని నివేదిక పేర్కొంది. ఈ మొత్తం డిఫాల్ట్ మొత్తం, చట్టబద్ధ వడ్డీతో కలిపి రూ. 419.07 కోట్లు కాగా, 2022 మార్చి నాటికి దాంట్లో మాత్రం రూ. 32.43 కోట్లు (8 శాతం) మాత్రమే ఎటిఇపిఎఫ్ఒకి చేరాయి. మిగిలిన రూ. 386.64 కోట్లు పెండింగ్‌గా ఉన్నట్లు కాగ్ వివరించింది.

కాగా, ఎటిఇపిఎఫ్ఒ అక్టోబర్ 2023లో తెలిపిన ప్రకారం, ఆ సంవత్సర సెప్టెంబర్ నాటికి ఎటిసిఎల మొత్తం పెండింగ్ పీఎఫ్ చందాను జమ చేసింది. ఆలస్య చెల్లింపులపై 15 శాతం చట్టబద్ధ వడ్డీ ఇంకా జమ చేయాల్సి ఉంది. 2017 నుండి 2022 వరకు పిఎఫ్ క్లెయిమ్‌లలో 87 నుంచి 96 శాతం, పెన్షన్ క్లెయిమ్‌లలో 99 శాతాన్ని ఎటిఇపిఎఫ్ఒ పరిష్కరించింది. అయితే కుటుంబ పెన్షన్ కేసుల పరిష్కారం ఆ కాలంలో కేవలం 10–39 శాతం మాత్రమే ఉందని నివేదిక తెలిపింది. ఎటిఇపిఎఫ్ఒ పరిష్కరించిన పిఎఫ్, పెన్షన్, కుటుంబ పెన్షన్, డిపాజిట్‌లింక్డ్ ఇన్సూరెన్స్ పథకాల మొత్తం 1,994 క్లెయిమ్‌ల విలువ రూ. 14.01 కోట్లు. కాగా, 2022 మార్చి నాటికి లబ్ధిదారుల ఖాతాల్లో జమ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని నివేదిక తెలిపింది. వీటిలో 2017–18, 2018–19 సంవత్సరాలకు చెందిన కేసులు 52 శాతం ఉన్నాయి. ఇవి మూడేళ్లకుపైగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఎటిఇపిఎఫ్ఒ పెట్టుబడులు చేసిన కొన్ని కార్పొరేట్ బాండ్లు భద్రత ప్రమాణాలను దృష్టిలో ఉంచకుండా కొనుగోలు చేయటం వల్ల 2019–20 నుండి వడ్డీ చెల్లింపులు నిలిచిపోయాయని, దీనివల్ల రూ. 11.42 కోట్ల వడ్డీ నష్టం కలిగిందని నివేదిక స్పష్టం చేసింది. ఇలావుంటే, ఈ బాండ్లలో ఆరు బాండ్లు వివిధ కాలాల్లో 2027 సెప్టెంబర్ వరకు మేచ్యూరిటీకి వస్తాయి, వీటిలో మొత్తం రూ. 69.61 కోట్ల నష్టం సంభవించే అవకాశం ఉందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

## బెంగాల్‌కు రూ.2 లక్షలకోట్లు కేంద్రం బకాయి
### తక్షణం చెల్లించాలంటూ పార్లమెంటు ప్రాంగణంలో తృణమూల్ ఎంపిల నిరసన ప్రదర్శన




**న్యూఢిల్లీ:** పార్లమెంటు ప్రాంగణంలో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపీలు బుధవారం నిరసన ప్రదర్శన జరిపారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ''బంగ్లా విరోధి మోదీ'' అంటూ నినాదాలు చేశారు. పశ్చిమ బెంగాల్‌కు న్యాయబద్ధంగా రావాల్సిన వాటాను ఇచ్చి తీరాలని వారు కోరారు. కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.2 లక్షలకోట్లు చెల్లించాల్సి ఉందని వారు చెప్పారు. ఆ తర్వాత టిఎంసి ఎంపీలు పార్లమెంటు హౌస్‌లోకి ప్రదర్శనగా వెళ్ళారు. నినాదాలు చేస్తూ పశ్చిమ బెంగాల్‌కు జరుగుతున్న అన్యాయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. ''బెంగాల్ తల వంచదు, బెంగాల్ ఆగదు, ముందుకే వెళుతుంది, కేంద్ర ప్రభుత్వం దగ్గర పోగుపడి ఉన్న బెంగాలీ ప్రజల ప్రతి రూపాయినీ తిరిగి వసూలు చేస్తాం'' అని ఎంపీలు నినాదాలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు మొదట పార్లమెంటు భవనం ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం ప్రార్థనాస్థలం వద్దగుమిగూడారు. పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం రెండు లక్షల కోట్లు బకాయిలు వెంటనే చెల్లించాలంటూ నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అక్కడి నుండి ప్రదర్శన జరిపారు. ''చాలా తీవ్రమైన సమస్యమీద మేం నిరసన ప్రదర్శన జరుపుతున్నాం,దేశంలో సమాఖ్య వ్యవస్థ నిర్మాణం పూర్తిగా ధ్వంసమైంది, కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది, రాష్ట్రానికి వివిధ పథకాల కింద ఇవ్వాల్సిన నిధులు గడచిన కొద్ది సంవత్సరాలుగా ఇవ్వడంలేదు, , వాస్తవం ఏమిటంటే, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద బెంగాల్ రాష్ట్రానికి నాలుగు సంవత్సరాలుగా చెల్లించాల్సిన వాటాను ఇవ్వడం లేదు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు గానీ, కొత్త పనులకు గానీ నిధులు ఇవ్వడంలేదు, ఈ మేరకు ఈ పథకం కింద రూ.7000 కోట్ల నుండి రూ.8000 కోట్ల మేరకు బకాయికలు చెల్లించాలి'' అదేవిధంగా ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి గృహ నిర్మాణ పథకాల కింద నిర్ణీత ప్రకారం ఇవ్వాల్సిన నిధులను కూడా చెల్లించడం లేదని ఆమె విమర్శించారు. ''జల్ జీవన్ మిషన్ పథకం కింద నిధులు ఇవ్వాలి, ప్రధానమంత్రి దీనిని ఎంతో గొప్ప ప్రాజెక్టుగా అభివర్ణించారు, ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన నీటిని సరఫరా చేస్తామని వాగ్దానం చేశారు, ఈ పథకం 2024లో ఆగిపోయింది, ఆ తర్వాత నుండి నిధులు ఇవ్వడం లేదు, పైపులు వేశారు, కానీ ఈ నిర్మాణ కార్యక్రమం సగంలోనే ఆగిపోయింది'' అని మహువా మొయిత్రా విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ''పశ్చిమ బెంగాల్‌కు రూ.2 లక్షల కోట్లు బకాయిలు కేంద్రం చెల్లించాలి, ఇవన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి, ఇది బెంగాల్‌కు ఇవ్వాల్సిన న్యాయబద్ధమైన వాటా, దీనిని తప్పనిసరిగా కేంద్రం తిరిగి ఇవ్వాల్సిందే, మోదీ బంగ్లా విరోధి, మోదీ ప్రభుత్వం సిగ్గుమాలినరీతిలో ఈ నిధులను తొక్కిపట్టింది, ఈనాడు మా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలం అందరం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఆయన కాళ్ళ దగ్గర నిలబడి అడుగుతున్నాం, ఈ విషయం ప్రస్తావిస్తున్నాం, తమ రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా గొంతెత్తి ప్రశ్నిస్తున్నాం'' అని మహువా మొయిత్రా అన్నారు. పశ్చిమ బెంగాల్ గ్రామీణాభివృద్ధి కీలక పథకాల నిధులు తొక్కిపట్టినా రాష్ట్రంలో అభివృద్ధి వేగం ఆగదంటూ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేసిన మరునాడే టిఎంసి ఎంపీలు ఈ నిరసన ప్రదర్శన జరిపారు. వచ్చే ఏడాది ఎన్నికల నేపథ్యంలో టిఎంసి 14 సంవత్సరాల పాలన విజయాల నివేదికను మమతా బెనర్జీ కోల్‌కతాలో మంగళవారం విడుదల చేశారు. రెండోకోట్ల మందికి తమ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందని, ఇతర రాష్ట్రాలకు ఆదర్శ నమూనాగా నిలిచిందని చెప్పారు. కేంద్రం సహకరించకపోయినాగానీ పథకాలను కొనసాగిస్తున్నామని, రాష్ట్రంలోనే వనరులను సమీకరిస్తున్నామని మమతా బెనర్జీ చెప్పారు.

### సిబ్బంది కొరత..
## పలు ఇండిగో సర్వీసులు రద్దు




**ముంబయి:** సిబ్బంది కొరత, ఆపరేషనల్ సమస్యలతో ఇండిగో సంస్థ 70కి పైగా విమానాలను బుధవారం రద్దు చేసింది. దేశవ్యాప్తంగా అనేక విమాన సర్వీసులు ఆలస్యమయ్యాయి. టెక్నికల్ సమస్యలు, ఎయిర్‌పోర్ట్ రద్దీ కారణాల వల్ల కూడా విమానయాన కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని కంపెనీ తెలిపింది. కొత్త ఎఫ్‌డిటిఎల్ నిబంధనల రెండవ దశ అమల్లోకి వచ్చిన తర్వాత సిబ్బంది కొరత మరింత పెరిగిందని ఈ వర్గాలు పేర్కొన్నాయి. ఇండిగో సమయపాలన మంగళవారం 35 శాతానికి పడిపోగా, ఇతర ప్రధాన ఎయిర్‌లైన్స్ గణనీయంగా మెరుగైన పనితీరు కనబరచడం గమనార్హం.

### తత్కాల్ టికెట్లకు కౌంటర్లలో
## 'ఒటిపి' తప్పనిసరి!




**న్యూఢిల్లీ:** రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల వద్ద తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే, ప్రయాణికులు తమ మొబైల్ ఫోన్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ (ఒటిపి) ఇవ్వడం తప్పనిసరి కానుంది. తత్కాల్ టికెట్ వ్యవస్థ దుర్వినియోగాన్ని అరికట్టడమే ఈ చర్య లక్ష్యంగా ఉందని అధికారులు తెలిపారు. రైల్వే మంత్రిత్వ శాఖ నవంబర్ 17న పైలట్ ప్రాతిపదికన కౌంటర్ల వద్ద ఒటిపి ఆధారిత తత్కాల్ టికెటింగ్ విధానాన్ని ప్రారంభించింది. ప్రారంభంలో కొన్నిట్రైన్లతో మొదలై, త్వరలోనే ఈ సంఖ్య 52కి పెంచారు. మరుసటి కొన్ని రోజుల్లో ఈ కౌంటర్ రిజర్వేషన్ సిస్టమ్ అన్ని మిగిలిన రైళ్లకు అమలులోకి వస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. సాధారణ ప్రయాణికులు ఆఖరి నిమిషంలో టికెట్లను సౌకర్యవంతంగా పొందేందుకు ఒటిపి తత్కాల్ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. ఈ విధానంలో, రిజర్వేషన్ కౌంటర్‌లో తత్కాల్ టికెట్ బుక్ చేస్తూ ప్రయాణికుడు రిజర్వేషన్ ఫారంలో ఇచ్చిన మొబైల్ నంబరుకు ఒటిపి వస్తుంది. దానిని సరి చూసుకున్న తర్వాతే టికెట్ కన్ఫర్మ్ అవుతుందని రైల్వే మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. తత్కాల్ సదుపాయాన్ని దుర్వినియోగం చేయకుండా చూడడం, అసలు ప్రయాణికులు అధిక డిమాండ్ ఉన్న టికెట్లను సులభంగా పొందేలా చేయడం వంటి లక్ష్యాలతో ఈ మార్పులు చేసినట్టు తెలిపింది. దీని ద్వారా రైల్వే టికెటింగ్‌లో పారదర్శకత, సౌకర్యం, భద్రత మరింత మెరుగవుతుందని తెలిపింది.

## ఆంధ్రప్రదేశ్‌కు రూ.902 కోట్లు తక్షణ సాయం
### కేంద్ర మంత్రులకు నారా లోకేశ్ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌కు తక్షణం రూ.902 కోట్లు సహాయాన్ని అందించాలని కేంద్రహోం మంత్రి అమిత్ షాకు ఆ రాష్ట్ర మంత్రులు విజ్ఞప్తి చేశారు. మొంతా తుఫాను బీభత్సం సృష్టించడంతో మొత్తంగా రూ.6,362 కోట్ల మేరకు తమ రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని ఆ రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వి.అనిత తెలియజేశారు. బుధవారం ఢిల్లీలో వారు హోంమంత్రితోపాటు కేంద్ర వ్యవసాయశాఖామంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి లిఖితపూర్వక విజ్ఞాపనలు అందజేశారు. నష్టం వివరాలు సమర్పించారు. మొంతా తుఫానువల్ల కలిగిన నష్టం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రమంత్రులకు వివరించారు. బిజెపి నాయకత్వానగల ఎన్‌డిఎ కూటమిలో తెలుగుదేశం పార్టీ అత్యంత కీలక భాగస్వామిగా ఉంది.

కేంద్రమంత్రులతో సమావేశం సందర్భంగా తుఫాను నష్టం అంచనాలకు సంబంధించిన సమగ్ర వివరాలన్నింటినీ వారికి తెలియజేశారు. రాష్ట్రంలో 24 జిల్లాలో ఉన్న మొత్తం 443 మండలాలలో 3,109 గ్రామాలలో వరద నష్టం జరిగిందని తెలియజేశారు. తుఫాను తీవ్రతవల్ల రాష్ట్రంలో అనేక రంగాలకు నష్టం కలిగిందని ఆ నివేదికలో కేంద్రమంత్రులకు తెలిపారు. రహదారులు, మౌలిక సదుపాయాలకు రూ.4,324 కోట్లు, శాశ్వతనిర్మాణాలకు రూ.1.302 కోట్లు, నీటి వనరులు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.369 కోట్లు, వ్యవసాయం, సంబంధిత అనుబంధ రంగాలకు రూ.271 కోట్లు, ప్రభుత్వ ఆస్తులకు రూ.48 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.41 కోట్లు, గృహాలకు రూ.7 కోట్ల మేరకు నష్టంవాటిల్లిందని లిఖితపూర్వకంగా కేంద్రానికి తెలియజేశారు. నారాలోకేశ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా,ఐటి శాఖల మంత్రిగా ఉన్నారు. మొంతా తుఫానువల్ల2,471 మంది ప్రజలను సహాయ కేంద్రాలకు తరలించామని, వారికి ఆహారం, నీరు, పాలు, ఇతర నిత్యావసరాలను సరఫరా చేశామని కేంద్రమంత్రికి ఆయన వివరించారు. దెబ్బతిన్న ప్రతి కుటుంబానికీ రూ.3,000 వంతున సమాయం అందజేశామని, ఎమర్జెనీ నిధులకింద రూ.60 కోట్లు ప్రజలకు విడుదల చేశామని నారాలోకేశ్ కేంద్రమంత్రికి చెప్పారు. అదేవిధంగా వ్యవసాయమంత్రి చౌహాన్‌తో కూడా విడిగా ఆయన సమావేశం జరిపారు. వ్యవసాయ రంగానికి రాష్ట్రంలో జరిగిన నష్టాని తెలియజేశారు. దాదాపు 1.61 లక్షల హెక్టార్లలో వ్యవసాయ భూములు దెబ్బతిన్నాయని, 3.27 లక్షలమంది రైతులు నష్టపోయారని, దాదాపు 4.36 లక్షల మెట్రిక్ టన్నుల పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం అంచనావేసినట్లు మంత్రికి తెలియజేశారు. ధాన్యం, మొక్కజొన్న, పత్తి, వేరుసెనగ, కందులు సహా వివిధ రకాల తృణధాన్య పంటలకు నష్టం కలిగినట్లు చెప్పారు.

## బెంగాల్‌లో 'సర్' కుట్ర వెనుక అమిత్ షా

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి
మమతా బెనర్జీ ఆరోపణ



**మాల్దా:** అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిమాసాల ముందు పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితాలసవరణ 'సర్'ను అమలు చేసే కుట్ర వెనుక కేంద్ర హోంమంత్రి అమిత్ షానే ఉన్నారని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. బుధవారం ఇక్కడ ఒక సమావేశంలో ఆమె మాట్లాడుతూ, 'సర్'ని ఓటర్లను అస్థిరపరచడానికి రాజకీయ ఉద్దేశంతో బిజెపి చేస్తున్న కసరత్తుగా అభివర్ణించారు. పశ్చిమ బెంగాల్‌లో గెలవాలన్నదే అమిత్ షా లక్ష్యమని, అందుకే, ఆయన హడావుడిగా 'సర్'ను మొదలుపెట్టించారని అన్నారు. అయితే, తొందరపడుతున్న బిజెపి తన గోతిని తానే తవ్వుకుంటున్నదని, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంటుందని మమత వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు బెంగాల్‌లో 'సర్' అమలు చేసే ఈ కుట్రకు అమిత్ షా వెనుక ఉన్నారు, అని ఆమె అన్నారు. బిజెపి ఈ ఓటర్ల సవరణ చర్య రాజకీయ ప్రభావాన్ని తప్పుగా అంచనా వేసిందని పేర్కొంటూ, 'బెంగాల్, బిహార్ ఒకటికావు' అని వ్యాఖ్యానించారు. అయితే, 'ఈ ప్రక్రియను టిఎంసి వ్యతిరేకించడం లేదని, కానీ దీన్ని నిర్వహించడానికి సరైన సమయం ఇవ్వాలని ఆమె స్పష్టం చేశారు. బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం ఇలా తొందరపెట్టలేరని ఆమె విమర్శించారు. ఈనెల 12 నుంచి 'సర్' విచారణలు ప్రారంభమయ్యే నేపథ్యంలో ప్రజలకు సహాయం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'మే ఐ హెల్ప్ యు' శిబిరాలను ప్రారంభిస్తున్నామని మమత ప్రకటించారు. బిజెపి సిద్ధాంతపరమైన హిందుత్వ అజెండాను లక్ష్యంగా చేసుకున్న ఆమె 'మాకు హిందుత్వ పాఠాలు బిజెపి నుంచి నేర్చుకోవాల్సిన అవసరం లేదు' అన్నారు. సునాలి ఖతూన్ ఘటనను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. గర్భిణిగా ఉన్న సునాలిని ఎనిమిదేళ్ల కుమారుడితోసహా బంగ్లాదేశ్‌కు నెట్టివేశారని గుర్తుచేశారు. ఈ విషయంపై తాము సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేశామని అన్నారు. సుప్రీం కోర్టు కూడా సునాలిని తీసుకురావాలని కేంద్రాన్ని ఆదేశించిందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని మమత హితవు పలికారు.

### మోదీ సర్కారు ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చే చర్యలు...
## దాదాపు 'డెత్ వారెంటే'

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ధ్వజం

**న్యూఢిల్లీ :** అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు సంబంధించి ప్రత్యేకంగా విపరీతమైన నిరంకుశత్వాన్ని ప్రదర్శించిందని, ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపం మార్చేలా తీసుకుంటున్న చర్యలకు 'దాదాపు డెత్ వారెంటే' అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆరోపించారు. ప్రభుత్వం పార్లమెంట్ ద్వారా అటవీ పరిరక్షణకు చేసిన సవరణలను (కన్సర్వేటివ్) చట్టం, 1980 అలాగే అటవీ కన్సర్వేషన్ రూల్స్ (2022)ను ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఆరావళి పర్వత శ్రేణిలోని 100మీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉన్న ఏ పర్వతాలపైనా మైనింగ్ నిషేధం ఉండదని ప్రభుత్వం ప్రకటించడం అక్రమ మైనర్లు, మాఫియాలు ఎత్తు పరిమితికంటే తక్కువ ఉన్న 90శాతం శ్రేణిని ముగించడానికి బహిరంగ ఆహ్వానమని సోనియాగాంధీ ధ్వజమెత్తారు. గుజరాత్ నుంచి రాజస్థాన్ ద్వారా హర్యానా వరకు విస్తరించి ఉన్న ఆరావళి పర్వత శ్రేణి భారత భౌగోళిక చరిత్రలో చాలాకాలంపాటు ముఖ్యమైన పాత్రను పోషించిందన్నారు. ఇది థార్ ఎడారి నుండి గంగా మైదానాల వరకు ఎడారీకరణ వ్యాప్తికి అవరోధంగా పనిచేసిందన్నారు.రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్, రణతంబూర్ వంటి గర్వించదగిన కోటలను ఆరావళి కొండలు కాపాడి, వాయవ్య భారతదేశం అంతటా ఆధ్యాత్మిక సమాజాల పుట్టినిల్లుగా మారిందని సోనియాగాంధీ 'ది హిందూ' ప్రచురించిన వ్యాసంలో పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ ద్వారా ఇప్పటికే నశించిపోయిన ఈ కొండలపై మోదీ ప్రభుత్వం ఇప్పుడు దాదాపు డెత్ వారెంట్‌పై సంతకం చేసినట్లే అని సోనియా గాంధీ ఆరోపించారు. ఆరావళి పర్వత శ్రేణి యొక్క ఉత్తర చివరలో దేశ రాజధాని ఢిల్లీలో ఈ నెలలో వార్షిక స్మోగ్ సీజన్‌ను ప్రారంభించిందని సోనియా గాంధీ ఎత్తిచూపారు. విషపూరిత గాలిని పీల్చుకుంటూ తమ దైనందిన జీవితాన్ని గడుపుతున్న లక్షలాది మంది దుమ్ము, పొగ, కణ పదార్థాల పొగమంచు అలుముకుంటోందని, పొగమంచు మన వార్షిక దినచర్యలో భాగమైనప్పటికీ పరిశోధనలు ఇది పూర్తిస్థాయి, నెమ్మదిగా జరిగే ప్రజారోగ్య విషాదంఅని చూపిస్తున్నాయన్నారు. ఈ కాలుష్యం వల్ల ఏటా పది నగరాల్లోనే 34,000మంది మరణిస్తున్నారని అంచనా వేస్తున్నారని సోనియాగాంధీ తన వ్యాసంలో పేర్కొన్నారు.



ప్రజాపక్షం
గురువారం, 04 డిసెంబరు

## మోదీ సర్కార్.. మరో యూటర్న్

చట్టాలు చేయడం.. ఆదేశాలు ఇవ్వడం... తీవ్రమైన ప్రతిఘటన నేపథ్యంలో రద్దు చేసుకోవడం కేంద్రంలోని మోదీ సర్కారుకు అలవాటుగా మారింది. సాగు చట్టాలతో ఎదురైన చేదు అనుభవం, పార్లమెంటులో వాటిని రద్దు చేసుకోవాల్సిన దుస్థితి నుంచి పాఠాలు నేర్చుకోని కేంద్రం మరోసారి అదే తరహా ప్రయత్నంలో భంగపడింది. 'పెగాసస్' స్పైవేర్ సృష్టించిన సునామీని మరచిపోని, సమస్యల్లో పడింది. 'సంచార్ సాథీ'పై యూటర్న్ తీసుకుంది. ఈ యాప్ ప్రీ-ఇన్‌స్టలేషన్ తప్పనిసరికాదని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన సైబర్ భద్రతా యాప్ సంచార్ సాథీని మొబైల్ ఫోన్లలో తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలన్న ఆదేశాలపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం దిగివచ్చింది. ప్రీఇన్‌స్టలేషన్ అవసరం లేదని మొబైల్ తయారీ సంస్థలకు సమాచార-సంచార మంత్రిత్వ శాఖ తెలిపింది. యాప్ ద్వారా ఎలాంటి స్నూపింగ్ జరగదని, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాల ఆధారంగా ఆదేశాలను మార్చే అవకాశం కూడా ఉందని పార్లమెంట్‌లో కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వ్యాఖ్యల తర్వాత ఈ ప్రకటన వెలువడడం గమనార్హం. పౌరులకు సైబర్ భద్రతను అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని, యాప్ పూర్తిగా భద్రతాపరమైనదేనని అంటూనే, ఈ యాప్‌ను ఎప్పుడైనా తొలగించుకోవచ్చన్న హితవు పలికింది. ఇన్‌బిల్ట్ యాప్‌లను మొబైల్ ఫోన్ల నుంచి తొలగించడం సులభం కాదన్నది నిజం. స్మార్ట్‌ఫోన్‌లలో సంచార్ సాథీ తప్పనిసరిగా కనిపించాలి, దాని ఫంక్షన్లను నిలిపివేయకూడదు అని 7(బి)లో పేర్కొనటంతో గూగుల్, ఆపిల్ వంటి సంస్థలు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ఫలితంగా వివాదం తలెత్తింది.

ప్రజల గోప్యత ప్రమాదంలో పడుతుందని ప్రతిపక్ష పార్టీలు ధ్వజమెత్తాయి. ప్రజల సంక్షేమం కోసం ఈ యాప్ అత్యవసరమని వాదిస్తూ వచ్చిన కేంద్రం, పార్లమెంట్‌లో మాట మార్చింది. సంచార్ సాథీ యాప్ ఇన్‌స్టలేషన్ ఇకపై మొబైల్ వినియోగదారులకు ఐచ్ఛికం మాత్రమేనని ప్రకటించింది. 'పెగాసస్' నిఘా సాఫ్ట్‌వేర్ సృష్టించిన ప్రకంపనలు సద్దుమణగక ముందే మోదీ ప్రభుత్వం అదే తరహా ప్రయత్నం చేయడం అనుమానాలకు తావిస్తున్నది. ప్రతీ మొబైల్ ఫోన్‌లోనూ ఈ యాప్ ఉండితీరాలన్న నిబంధన యూజర్ల గోప్యతా హక్కులకు విఘాతం. ప్రజాస్వామ్య హక్కులకు ప్రమాదకరం. విస్తృతమైన డేటాను సేకరించే టూల్స్ ఈ యాప్‌లో ఉండే అవకాశం లేకపోలేదు. వినియోగదారుల భద్రత కోసం యాప్ తీసుకురావడం తప్పుకాదు. అధునాతన సాంకేతికతను వినియోగించడం నేరం కాదు. కానీ, మొబైల్ ఫోన్ తయారీదారులంతా ఇన్‌బిల్ట్‌గా ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలనడమే సందేహాలకు కారణం. ఇన్‌బిల్ట్ యాప్‌లను తొలగించడం సులభం కాదు. ఒకవేళ అన్‌ఇన్‌స్టాల్ చేస్తే, ఫోన్ సాఫ్ట్‌వేర్‌లో తీవ్రమైన సమస్యలు తలెత్తవచ్చు. ఒక్కోసారి ఫోన్ పనిచేయకపోయే ప్రమాదం కూడా ఉంది. వినియోగదారులను ఇబ్బందులకు గురి చేసే యాప్‌పై ప్రభుత్వానికి ఎందుకంత మోజు? పెగాసస్ స్పైవేర్‌పై జరిగిన ఆందోళనలు, పార్లమెంటు సమావేశాలకు ఆటంకాలను బిజెపి సర్కారు ఇంత త్వరగా ఎలా మరిచిపోయింది? పెగాసస్ ఇజ్రాయెల్‌కు చెందింది.. సంచార్ సాథీ భారత్ అభివృద్ధి చేసింది... అంతకు మించి తేడా ఏమీ లేదన్నది ప్రతిపక్షాల వాదన. 'ఫెడరల్ వ్యవస్థను దెబ్బతీసి, ఏకీకృత రాజ్య స్థాపనే లక్ష్యంగా' పని చేస్తున్నదని మోదీ ప్రభుత్వంపై ఆరోపణలు ఉన్నాయి. కొత్తకొత్త విధానాలతో పౌర అంశాలనే మళ్లీ మళ్లీ తెరపైకి తీసుకురావడం ఈ ఆరోపణలకు బలాన్నిస్తున్నది. ప్రతి ఫోన్‌లోనూ ప్రభుత్వ యాప్ ఉండాలన్న తపన తప్పు, గోప్యతా ప్రమాణాలపై స్పష్టత శూన్యం. వినియోగదారుల సంభాషణల నుంచి సందేశాల వరకూ... ఫొటోల నుంచి వ్యక్తిగత డేటావరకూ, ప్రతి విషయం బట్టబయలయ్యే ప్రమాదం ఉంది. అలాంటిది జరగదని ప్రభుత్వం ఇస్తున్న హామీ నమ్మశక్యంగా లేదు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిందిగా కోరడం వేరు.. ఇన్‌బిల్ట్ యాప్‌గా ఉండాలని ఆదేశించడం వేరు.. 'పెగాసస్' సెగను ఎదుర్కొన్న ప్రభుత్వం, ఈసారైనా జాగ్రత్త పడకపోవడం శోచనీయం. నిర్ణయాన్ని తీసుకునేముందు రాజకీయ పార్టీలు, పౌర అభిప్రాయాలు తీసుకోకపోవడం అనుమానాలకు కారణం. సంచార్ సాథీ ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం అంటున్నది. వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం వాటిల్లుతుందని ప్రతిపక్ష పార్టీలు అనుమానిస్తున్నాయి. వ్యతిరేకత వ్యక్తమవుతున్న అంశాలను పునఃసమీక్షించుకొని, అవసరమైన మార్పులు చేర్పులు చేయడం అత్యవసరం. ఇన్‌బిల్ట్ యాప్‌గా కాకుండా, వినియోగదారుల ఇష్టాయిష్టాలకు వదిలివేయడం శ్రేయస్కరం. అనుమానాలు తీర్చకుండా మొండిగా ముందుకు వెళ్లడం ఎవరికీ మంచిది కాదు. ప్రస్తుతానికి యూటర్న్ తీసుకున్న మోదీ ప్రభుత్వం, మరో కొత్త మార్గంలో ఇదే ప్రయత్నం చేయదన్న నమ్మకం ఎవరికీ లేదు. విశ్వాసాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.



ప్రొఫెసర్ దేవరాజు మహారాజు

# పాఠ్యాంశాలు మార్చుకున్నంత మాత్రాన సైన్స్, చరిత్ర మారవు!

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం పాఠశాల పాఠ్యగ్రంథాల నుంచి సైన్సు, చరిత్రకు సంబంధించి పలు అంశాలను తొలగించింది. నిజానికి అవి చాలా చాలా ముఖ్యమైన అంశాలు. జీవపరిణామాన్ని విజ్ఞాన శాస్త్ర సిలబస్‌లో లేకుండా చేయడం – తాము నమ్మే సృష్టి, సిద్ధాంతాన్ని రాబోయే తరాలు నమ్ముతూ ఉండాలనుకోవడం నేటి ఆరెస్సెస్ బిజెపి ప్రభుత్వ విధానం, అలాగే చరిత్ర పాఠ్యపుస్తకాల నుండి మొత్తానికి మొత్తంగా మొఘలుల పాలనా కాలాన్ని తొలగించడం – వారి విద్వేషపాలసీ విధానానికి అనుగుణంగా చేసిందే! టిప్పు సుల్తాన్ దేశభక్తిని మరుగుపరచటం కూడా అలాంటిదే!! ముస్లింలు, మైనార్టీలు, దళితులంటే వారికున్న ద్వేషభావాన్ని ప్రత్యక్షంగా చూపించడమే! పాఠ్యగ్రంథాల సిలబస్‌లు మార్చుకున్నంత మాత్రాన అసలు చరిత్ర మారదు కదా? చారిత్రక ఆనవాళ్ళు తుడిచిపెట్టుకుపోవు కదా? ఆర్కియాలజీ విభాగం వారి రిపోర్టులూ, ప్రపంచ వ్యాప్తంగా వందల మంది చరిత్రకారులు రాసిన చరిత్ర గ్రంథాలు మాట్లాడుతూనే ఉంటాయి కదా? ఆయా విషయాల మీద వాస్తవికతకు అద్దంపడుతూ వెలువడిన సినిమాలు, నాటకాలు, ఇతర సృజనాత్మక రచనలు నేటి ప్రభుత్వ అబద్ధపు ప్రచారాల్ని బట్టబయలు చేస్తూనే ఉంటాయి కదా?

మొఘలుల చరిత్ర ఏదో కొద్దికాలం కాదు.. ఈనేల మీద పరిపాలన సాగిస్తూ, సుమారు నాలుగు దశాబ్దాల పాటు ఇక్కడే పాతుకుపోయింది. అంతే కాదు, ఈ దేశంలో అంతర్భాగమైపోయింది. మొఘలుల తర్వాత వచ్చిన బ్రిటీషువారు ఈ దేశాన్ని దోచుకుపోయారు. దోచుకున్నది తీసుకుపోయి బ్రిటన్‌లో పెట్టుకున్నారు. ఉదాహరణకు మన ప్రాంతం నుండి తీసుకుపోయిన కోహినూర్ వజ్రం, బ్రిటీష్ రాణి కిరీటంలో ధగధగా మెరిసింది కదా? మరి మొఘలులు దోచుకున్నదేమిటి? దోచుకుంటే అది వారెక్కడికి తీసుకుపోయారు? అని భావితరాల పౌరులు ప్రశ్నలు సంధించరా? మొట్టమొదట దేశంలోకి ప్రవేశించిన బాబర్ తప్ప, మిగిలిన మొఘల్ చక్రవర్తులందరూ ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడే కన్నుమూశారు కదా? ఈ దేశపు మట్టిలో మట్టయిపోయారు. భారతీయ జనజీవితంలో ఐక్యమైపోయారు.

సాధారణ శకానికి పూర్వం ఎప్పుడో అశోకచక్రవర్తి పరిపాలించిన సువిశాలమైన భూభాగాన్ని మళ్ళీ మొఘలులు ఆక్రమించి సుస్థిరపరిచారు.

ఇతర చొరబాటుదారులు దేశంలో చొరబడకుండా అడ్డుకుంటూ శత్రుదుర్భేద్యంగా నిలబడ్డారు. శతాబ్దాలు గడిచిపోతున్నా ప్రపంచ పర్యాటకులు మొఘలుల కట్టడాలను చూడడానికి విపరీతంగా వస్తున్నారు కాదా? తాజ్‌మహల్, లాల్‌ఖిలా, హుమాయూన్ సమాధి, ఆగ్రాకోట, బులంద్ దర్వాజ వంటివన్నీ యునెస్కో వరల్డ్ హెరిటేజ్ స్థలాలుగా గుర్తింపుపొందాయి కదా? కాదంటారా? రోజూ వేలమంది సందర్శకులకు ఆ కట్టడాల నేపథ్యం తెలియనీయకుండా జాగ్రత్తపడతారా? అక్బరు, షాజహాన్‌ల పేర్లు బయటికి రానీయకుండా బిజెపి పాలనలో మోదీ చక్రవర్తి అవి కట్టించాడని చెప్పుకుంటారా? చెప్పుకున్నా చెప్పుకుంటారు. ఆశ్చర్య పడాల్సింది ఏమీ లేదు. వారి అబద్ధపు ప్రచారాలు, ఆర్భాటాలు ఎంత దిగజారుడు స్థాయిలో ఉంటున్నాయో రోజూ చూస్తూనే ఉన్నాంకదా? ఇక, తామే ఎల్ల కాలమూ అధికారంలో ఉంటామన్న భ్రమలో నేటి ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టుంది. కాల ప్రవాహంలో మార్పు సహజం అని గ్రహించలేక పోతున్నారు. గతంలో హిట్లర్ కూడా ఇలాగే మార్పులు చేయించాడు. మరి ఎల్లకాలమూ అధికారంలో ఉండలేకపోయాడు కదా?

ఇక సైన్సు పాఠ్యగ్రంథాల నుండి జీవపరిణామ సిద్ధాంతాన్ని తొలగించడం గురించి చూద్దాం. మనిషిగా పుట్టిన ప్రతివాడూ తప్పక తెలుసుకోవాల్సిన అంశం– జీవపరిణామం. ఇది ఏ ఒక్క దేశానికో సంబంధించిన విషయం కాదు. కేవలం జీవశాస్త్రం అభ్యసించే విద్యార్థులు చదువుకునేది కూడా కాదు. ప్రపంచ పౌరులందరూ అధ్యయనం చేయాల్సిన విషయం. అర్థం చేసుకోవాల్సిన విషయం. చదువు లేనివారు సైతం చదువుకున్నవారిని అడిగి, సారాంశం–తెలుసుకోల్సిన విషయం. కొన్ని లక్షల ఏళ్లపాటు కొనసాగిన మానవుడి తొలి దశలు ఏవో, అవి ఎంతెంతగా సంఘర్షిస్తూ వచ్చాయో – వాతావరణ పరిస్థితులను ఎలా ఎదుర్కుంటూ వచ్చాయో– ఎప్పటికప్పుడు కొత్త విషయాలు అవగతం చేసుకుంటూ, ఎదుగుతూ, పరిణామం చెందుతూ ఇప్పటి ఈ స్థితికి ఎలా చేరుకున్నాయో తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉంది! ఏకకణ జీవుల నుండి, బహుకణ జీవుల నుండి, వెన్నెముక లేని జంతువుల్లో జరిగిన జీవ పరిణామం–తొలి దశ అయితే.. అందులో నుండి వెన్నెముక గల జీవులు–చేపలు, ఉభయచరాలు– సరీసృపాలు–పక్షులు –ఆ తర్వాత హోమినిడికి చెందిన వానరాలు, అందులో నుండి తొలి మానవ దశలు రావడం మలిదశ.

ఒకానొక కాలంలో ఎన్నో తొలి మానవ దశలు కలిసి, ఏకకాలంలో ఈనేల మీద సంచరించాయి. ఆహారం కోసం పోటీపడి కొట్లాడుకున్నాయి. అలా ఆ ఘర్షణల్లో తెలివైన జాతి–హోమో సేపియన్ గెలుస్తూ, తన జాతిని కొనసాగించుకుంటూ వచ్చింది. మిగిలిన జాతులన్నీ క్రమంగా అంతరించిపోయాయి. హోమో అనేది మానవ జాతికి సంబంధించిన జీనస్. సేపియన్ – అనేది స్పీసీస్. 'సేపియన్' అంటే వివేకం గలది అని అర్థం. సేపియన్‌గా ఈ భూమి మీద బతుకున్నందుకు ప్రతి ఒక్కరూ తమ వివేచనను ఉపయోగిస్తూ ఉండాలి! అందువల్ల ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడ ఏ మూలలో ఉన్న మానవుడైనా, అతను హోమో సేపియనే– అంటే మనుషులంతా ఒక్కటే అని కదా అర్థం. ఆ రకంగా ప్రతి మనిషీ విశ్వ మానవుడే! అనాగరికతను వదిలేస్తూ మనిషి నాగరికుడిగా ఎలా తయారయ్యాడో, మనిషి కేంద్రంగా అతను ఆధునిక, అత్యాధునిక యుగాలను ఎలా నిర్మించుకుంటూ వచ్చాడో తెలుసుకోవాలంటే తప్పదు ప్రతి ఒక్కరూ జీవపరిణామ శాస్త్రం చదువుకోవాల్సిందే!

దైవ విశ్వాసంలో నిండా మునిగి, ఆత్మ, పరమాత్మ, పునర్జన్మ లాంటి అంధ విశ్వాసాల్లోనే జీవన సత్యం ఉందనుకునే వారికి జీవపరిణామం అక్కరలేదు– అబద్ధాలు పూర్తిగా నమ్ముతూ, నిజాలకు రుజువులడిగే అతి తెలివిగాళ్లకు నిజమే జీవ పరిణామ శాస్త్రం అక్కర లేదు. ఆత్మవిశ్వాసాన్ని తొక్కిపెట్టి, దైవ విశ్వాసానికి భజనలు చేసే వారికి అవును– జీవపరిణామం అక్కరలేదు–

జీవ పరిణామ శాస్త్రం హేతువాదానికి మూలం!
మానవ వాదానికి మూలం!
స్వేచ్ఛాలోచనకు మూలం!
విశ్వ దృష్టికి మూలం!
జీవ పరిణామమంటే చీకటిలోంచి వెలుగులోకి చేసిన ప్రయాణం!
అజ్ఞానం లోంచి జ్ఞానంలోకి చేసిన ప్రయాణం!
మనిషి, మనిషి విలువను తెలుసుకోవడానికే
మానవ జీవ పరిణామ గురించి తెలుసుకోవాలి!

మరి వీటిలో ఏ ఒక్కటీ గుర్తించలేనివారు, భరించలేని వారు, ప్రస్తుతం అధికారంలో ఉన్నారు కాబట్టి, వారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. రాబోయే తరాల్ని నిర్వీర్యం చేయడానికి పూనుకున్నారు.

ఏ ప్రభుత్వమైనా ముఖ్యంగా చేయాల్సినవి రెండు పనులు.

1. విద్య 2. వైద్యం – దేశ ప్రజలకు బాధ్యతతో అందించాలి! వైద్యం సమకాలీన సమాజంలో బతికి ఉన్న పౌరులకు మాత్రమే పని కొస్తుంది. కానీ, విద్య రాగల భవిష్యత్ తరాలకు కూడా అందుతూ ఉండేది. సరైన విద్య అందించకుండా ఒక తరాన్ని తయారు చేస్తే, దాని ప్రభావం రాబోయే ఎన్నో తరాల మీద పడుతుంది. ఆలోచించి చూడండి. వైద్యం కన్నా విద్య ఎంతో ముఖ్యమైందో.

వైద్యం చాలా అవసరమే. దేశ పౌరులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తరాలు ఆరోగ్యంగా పుడతాయి. నిజమే! కానీ, అధిక సంఖ్యలో అజ్ఞానులు పుట్టినందువల్ల దేశానికి ఏంలాభం? సమాజగతిని మార్చేజ్ఞానులు కొంతమందైనా తయారు కావాలి కదా? అందుకే ప్రభుత్వాలు హేతుబద్ధమైన విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి. మనకు నిత్యజీవితంలో అందుబాటులోకి వస్తున్న అనేకానేక వైజ్ఞానిక పరికరాలు ఏ కొద్ది మంది శాస్త్రజ్ఞులో కనుకున్నవి. మరికొద్ది మంది సాంకేతిక నిపుణులు తయారు చేస్తున్నవీను! అత్యధిక ప్రపం చ జనాభా వాటిని సుఖంగా, సులభంగా వాడుకుంటోంది కదా?

సమాజ గతిని మార్చగల శక్తి సామర్థ్యాలు ఎప్పుడైనా ఏ కొద్ది మందికో ఉంటాయి. ఆ కొద్దిమంది తయారు కావడానికి ప్రభుత్వాలు అన్ని అవకాశాలు కల్పించాలి. అంతేగాని, మొదళ్ళు కత్తిరించి, రెక్కలు కత్తిరించి, మాటను కత్తిరించి, ఆలోచనను కత్తిరించి ప్రభుత్వం వివేకవంతుల్ని తయారుచేయలేదు. పాఠ్యపుస్తకాల్లోంచి అవసరమైన విషయాలు తొలగించడమంటే, నిజాల్ని తొక్కిపెట్టడమే. సమాజాన్ని నిస్సత్తుగా మార్చడమే, యువత జ్ఞాన సంపన్నులై ఎక్కడ ప్రశ్నలు సంధిస్తారోనని ఒకరకంగా ప్రస్తుత ప్రభుత్వం భయపడుతున్న ట్టుగా ఉంది. నిజాల్ని దాచిపెట్టి తమ హిందూత్వ ఎజెండాను తెచ్చి, సృష్టి సిద్ధాంతాన్ని బాలబాలికల మెదళ్ళలో కుక్కి, రాజ్యాంగా న్ని పక్కకి తోసి, మనుస్మృతిని వాడుకలోకి తేవాలన్నది ఆరె స్సెస్, బిజెపిల ఉద్దేశం. ఆ దిశలో వాళ్ళు మొదటి నుండి పనిచేస్తున్నారు. సమస్యలు ఎదురైనపుడు కాళ్ళ బేరానికి రావడం వాళ్ళకు అలవాటు. బ్రిటిష్ వారికి క్షమాపణలు చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో ఆనాటి యువతీ యువకులు పాల్గొనకుండా అడ్డుకున్నది వీరే. నెహ్రూ ప్రభుత్వంలో హోంమంత్రి సర్దార్ పటేల్ ఆరెస్సెస్‌ను నిషేధి స్తే క్షమాపణలు చెప్పి బయటపడింది వీరే. తమ కార్యకర్తల్ని విడిపించుకోవడానికి ఇందిరా గాంధీ ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పి నాటి ఎమర్జెన్సీని బలపరిచింది వీరే. ఇప్పుడు మళ్ళీ వారే అప్పటి ఎమర్జెన్సీని విమర్శిస్తున్నారు– నిజాయితీ లేదు, నిబద్ధత లేదు. నిజాలు మాట్లాడరు. అక్రమ మార్గాల్లో ఎన్నికై వస్తారు. బలం లేకపోయినా, రెండు ఊతకర్రల్ని చంకనేసుకుని కుంటుతారు. పని శూన్యం! ప్రచారం అమోఘం!!

మొఘలులు ముస్లింలు గనక, ఈ దేశంలోని హిందువులంతా వారిని ద్వేషించాలని అధికారంలో ఉన్న అతిపెద్ద రాజకీయ పార్టీ భావిస్తోంది. ఆ 'భావన' దేశ ప్రజల్లో కలగడానికి ఎన్ని మారణకాండలైనా జరిపిస్తుంది. మహిళల్ని నగ్నంగా వీధుల్లో తిప్పినా బాధపడదు. E.D; CBI, కోర్టులు వంటి వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేసి వాటితో ఊడిగం చేయించుకుంటున్న విధంగానే , ఇప్పుడు NCERTని కూడా మార్చుకుంటోందని ఈదేశ పౌరులు అర్థం చేసుకుంటున్నారు. కార్యాచరణకు సిద్ధపడుతున్నారు.

*కవిరాజు త్రిపురనేని జాతీయ పురస్కార తొలి గ్రహీత, బయాలజీ ప్రొఫెసర్.*

## దిష్టితో కొబ్బరి చెట్లు ఎండిపోవడమేంటి?

*(ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు)*

నేడు శాస్త్ర, సాంకేతికతతో ప్రపంచం దూసుకుపోతుంది. భారతదేశం కూడా ఆధునిక వైజ్ఞానిక ఆవిష్కరణతో ముందుకు వెళ్తుంది. మరోవైపు మూఢనమ్మకాలు మనల్ని అధఃపాతాళానికి నెడుతున్నాయి. మరి ఈ మూఢనమ్మకాలు చదువురాని అమాయక ప్రజలే నమ్ముతారని ఆలోచన సమాజంలో ఉంది. కానీ విద్యావంతులు, పాలకులు సైతం అంధ విశ్వాసాలు నమ్ముతున్న తీరును ఆశ్చర్యపరుస్తుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత కొన్ని నెలలుగా కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ వాళ్ళ దిష్టి కారణమని చెప్పడం విస్మయం కలిగిస్తుంది. ఆయన కోట్లాది ప్రజలకు సినిమా హీరో, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి. మరి సమాజాన్ని తప్పుదోవ పట్టించే ఇలాంటి అశాస్త్రీయమైన మాటలు అంధకారానికి నిదర్శనం. ఇవి ప్రాంతీయ విద్వేషాలను కూడా రగిలిస్తున్నాయి. అసలు కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి సముద్రపు నీరు వెనక్కి రావడం, మురుగు కాలువ నీటిలో లవణాల శా తం పెరగడం వంటి కారణాలను నివేదికలు చెబుతున్నాయి. మహిమ గల వ్యక్తిగా దిష్టి గురించి చెప్పడం పాలకుల అజ్ఞానాని కి నిదర్శనం. ఇది ఒక రకంగా రాజకీయంగా తన ఉనికి మూఢనమ్మకాలతో మూడు పెట్టినట్టుంది. ఇటీవల కాలంలో దేశంలో కొందరు కేంద్ర మంత్రులు, ముఖ్య మంత్రులు సైతం కూడా మూఢత్వాన్ని పెంచి పోషించే వ్యాపకాలు చేస్తున్నారు.

అట్టడుగు వర్గాలనే బలి చేస్తున్నారు.
మనిషి వైజ్ఞానిక ఫలాలు అనుభవిస్తూనే...
అంధత్వంలోకి జారుకుంటున్నాడు.

ఇప్పటికే మంత్రగాళ్ళు, జ్యోతిష్కులు, బాబాలు, స్వాములతో ప్రజలు మోసపోతున్నారు. బాణామతి, చేతబడినీ నమ్ముతున్నారు. ఎడమ కాళ్లకు నల్ల దారం కట్టుకునే సంస్కృతి పెరుగుతుంది.

తల్లి కడుపులోంచి పుట్టబోయే బిడ్డకు ముహూర్తాలు చూస్తున్నారు. మనిషి మరణానికి సైతం మంచి చెడు చూస్తున్నారు. ప్రజల్లో అంధ విశ్వాసాలు ఏ స్థాయిలో ఉన్నాయో దీన్ని బట్టి అర్థమవుతుంది. క్షుద్ర పూజల వంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఒకచోట వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలో జోగిని వ్యవస్థ కొనసాగుతూ ఉన్నది. ముఖ్యంగా కరీంనగర్, వరంగల్ జిల్లాలోని ప్రాంతంలో గ్రామాల ప్రజలు వేములవాడ ప్రాంతానికి చెందిన దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ రాజరాజేశ్వర స్వామి పేరు మీద లింగ ధారణ చేసుకొని దేవుని మనిషిగా అంకితమవుతారు. ఈ ఆచారం ముఖ్యంగా దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల్లో కొనసాగుతుంది. ఏ ఒక్క అగ్రకులం కూడా ఇలాంటి లింగ ధారణ చేయరు. దేవుని పేరిట ఆచారంలో కూడా అట్టడుగు వర్గాలను బలి చేస్తున్నారు. ఇటీవల తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా గర్భిణీ మహిళలు, వితంతువులు కొబ్బరికాయలు కొట్టడానికి వెనుకాడుతున్నరని తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇది మూఢాచారాలు, విశ్వాసాలు, అవగాహన లోపాలకు నిదర్శనమన్నారు.

ఇంత సైన్స్ అభివృద్ధి చెందినప్పటికీ ప్రజలు శాస్త్రీయ జీవన విధానాన్ని అవలంబించకపోవడం దురదృష్టకరం.

**మితిమీరిన అంధవిశ్వాసాలు...** నేడు సైన్స్ ఎంతగానో అభివృద్ధి చెందినప్పటికీ ఇప్పటికీ గ్రామ ప్రాంత ప్రజలు అస్వస్థకు గురైనప్పుడు బాబాలను, స్వాములను, సిగం ఊగే వాళ్లను, పాస్టర్లును ఆశ్రయిస్తున్నారు. వారు ఇచ్చే పసుపు, కుంకుమ, విభూతిని, నిమ్మకాయలను, కొబ్బరి కాయలను రాత్రిపూట ఆది, గురువారం, అమావాస్య రోజున గ్రామ ప్రాంత నడివీధు ల్లో పెట్టి వారి రోగాలకు సాంత్వనగా భావిస్తారు. పట్టణాల్లో కొందరు విద్యావంతులు సైతం ఇలాంటి అజ్ఞానా న్ని ఆచరించడం ఆందోళన కలిగిస్తుంది.

ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో విజృంభించిన వ్యాధులను తగ్గించుకోవడానికి జంతుబలులు, నరబలులు చేస్తున్నారని వార్తలు వినబడుతున్నాయి. ఇటీవల కరీంనగర్ జిల్లాలోని ఇల్లందకుంట మండలం, మర్రివానిపల్లి గ్రామంలో ఐదు నెలలుగా వరుస మరణాలు సంభవించాయి. గ్రామానికి కీడు సోకిందని, వరుస మరణాలు జరుగుతున్నాయని భావించిన ప్రజలు, ఒక పండితుడి సూచనతో ఆ ఊరిని విడిచిపెట్టి, పొలాల వద్దకు వెళ్లి వంటలు చేసుకుని భోజనం చేశారు. ఇలాంటి మూఢనమ్మకాలను అజ్ఞానులతో పాటు విజ్ఞానులు కూడా పాటించడం చాలా విచారించదగ్గ విషయం. మరోవైపు మంత్రాల నెపంతో దాడులు, హత్యలు పెరుగుతున్నాయి. మానసిక బలహీనత వలన విచక్షణ కోల్పోయి అతీంద్రియ శక్తులు నమ్మడం వల్లనే సమాజంలో ఇలాంటి దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఇవి శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తున్నాయి. ఇటీవల రంగురాళ్లు ధరించడం, సంఖ్యా శాస్త్రం ఆధారంగా పేర్లు మార్చుకోనే వారి సంఖ్య పెరిగింది.

**పాలకుల వైఖరిలో మార్పు రావాలి...**

ప్రజల్లో రోజురోజుకు శాస్త్రీయ వైఖరి, ప్రశ్నించే తత్వం లోపించడమే ఈ గుడ్డి నమ్మకాలకు కారణం. ఇదే కాకుండా పాలకుల్లో కూడా శాస్త్రీయ వైఖరి లోపించడం, ప్రభుత్వ విధానాలు కూడా దీనికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. మితిమీరిన మత విశ్వాసాలు, అశాస్త్రీయ బోధనలు, ప్రభుత్వ విధానాలు, మీడియా ప్రకటనలు ప్రజల్ని మరింత మూఢత్వ దిశగా ప్రేరేపిస్తున్నాయి. మనదేశంలో గుళ్ళు, గోపురాలు, చర్చిలు, మసీదులకు ఇచ్చినంత ప్రాముఖ్యత విద్యాలయాలకు ఇవ్వడం లేదు. సైన్స్ ఆవిష్కరణల కన్నా సూడో సైన్స్‌కు ఆదరణ పెరిగిపోతుంది. భూత వైద్యానికి, అతీంద్రియ శక్తులకు ఆదరణ పెరుగుతుంది. సమాజ అభివృద్ధికి మూలం విజ్ఞాన శాస్త్రమే. కావున విద్యాసంస్థల్లో శాస్త్రీయ ప్రగతిశీల విద్య అభ్యసనం జరగాలి.

ప్రభుత్వాలు హేతుబద్ధ, శాస్త్రీయ ఆలోచన విధానాలను ప్రోత్సహించాలి. నిత్య సమస్యలను ఎదుర్కోవడానికి గల శాస్త్రీయ పరిష్కారాలను ప్రజలకు తెలియచేయాలి. సైన్స్ ప్రచార సంస్థలు కూడా ఆ దిశగా కృషి చేయాలి. అప్పుడే దేశంలో వేళ్లానుకొని ఉన్న సామాజిక రుగ్మతలను నిర్మూలించవచ్చు. మన విశ్వవిద్యాలయాలు పరిశోధన కేంద్రాలుగా ఎదగడానికి కావాల్సిన వాతావరణాన్ని కల్పించాలి. ఇవి నవ కల్పనలకు నాంది పలకాలి. యువతను పరిశోధనవైపు ఆకర్షించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహించాలి. దీనికై శాస్త్ర సాంకేతి క రంగాలకు బడ్జెట్లో తగినన్ని నిధులు కేటాయించాలి. రాజకీయ నాయకుల ఆలోచన, ప్రభుత్వ పరిపాలన ప్రగతిశీలంగా ఉండాలి. అప్పుడే ప్రజల్లో వైజ్ఞానిక చైతన్యం వస్తుంది.

**సంపతి రమేష్ మహారాజ్**
7979579428.

## భారత విజయానికి ప్రతీక 'ఆపరేషన్ ట్రిడెంట్'

భారతీయ త్రివిధ దళాలైన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నావికా దళం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైనవిగా రుజువు చేసుకున్నాయి. 1612లో నాటి ఈస్ట్ ఇండియా కంపెనీ తన అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన చిన్న నావికా దళం, స్వాతంత్ర్యానంతరం తనను తాను దేశ అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటూ, ఆవిష్కరణల ఆసరాతో స్వదేశీ పరిజ్ఞాన గొడుగు కింది అతి బలశాలిగా అవతరించడం మనందరికీ గర్వకారణం. అంకితభావం, సమరోత్సాహం, శౌర్య పరాక్రమాలు, క్రమశిక్షణ లాంటి కవచాలను ధరించి దేశానికి విజయాలను తేవడంతో పాటు సముద్రతీరాల గస్తీ, దేశ భద్రత, అంతర్జాతీయ సంబంధాల్లో ఊతం ఇవ్వడం, దేశ ఆర్థికాభివృద్ధిలో తోడ్పడడం, ప్రపంచ శాంతి స్థాపనకు పీస్ కీపింగ్ ఫోర్స్గా పని చేయడం, విపత్తు నిర్వహణ, సముద్రయానంలో ఇన్నొవేషన్, గస్తీలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో పాటు వినియోగం లాంటి పలు మహత్తర సేవలను అనునిత్యం అందిస్తున్నది.

**1971 ఇండో-పాక్ యుద్ధంలో ఆపరేషన్ ట్రిడెంట్:**

1971 ఇండోపాక్ యుద్ధ సమయంలో 03 డిసెంబర్ రోజున పాకిస్థానీ సేనలు భారత ఎయిర్ బేస్‌లపై ఆకస్మికంగా ముప్పేట దాడి చేయడం, దానికి ప్రతిస్పందనగా 4, 5 డిసెంబర్ 1971 రోజుల్లో భారత నావికాదళాలు ఆపరేషన్ ట్రిడెంట్ పేరున కరాచీలోని పాకిస్థానీ నావికాదళ కేంద్రంపై దాడి చేయడంతో వేల మంది పాకిస్థానీ సైనికులు మరణించడం, భారత్‌కు తిరుగులేని విజయాన్ని ఇవ్వడం మన గత ఘన చరిత్ర. ఇండియన్ నేవీ నేతృత్వంలో ఆపరేషన్ ట్రిడెంట్ అర్జించి పెట్టిన ఘన విజయానికి గుర్తుగా ప్రతి ఏటా 04 డిసెంబర్ రోజు భారతీయ నావికాదళ దినోత్సవం ఘనంగా నిర్వహించుట ఆనవాయితీగా మారింది. దేశ భద్రత, విపత్తు సమయాల్లో అమూల్య సేవలు, సముద్ర తీర ప్రాంతాల పకడ్బందీ గస్తీ లాంటి పలు అమూల్య సేవలు అందించడంతో పాటు యుద్ధ సమయాల్లో లేదా దేశ రక్షణ విధులు నిర్వహిస్తున్న మన నావికా దళ అమరవీరుల కు ఘన నివాళులు అర్పించడం, వారి సేవల ను స్మరించుకోవడం, నావికా దళ వీరులకు కృతజ్ఞతలు తెలియజేయడం దేశ భక్తి పరులుగా మనందరి కనీస బాధ్యత.

04 డిసెంబర్ 2025న నిర్వహించుకుంటున్న భారతీయ నావికా దళ దినోత్సవ ఇతివృత్తంగా సంఘటిత పోరాటానికి సదా సిద్ధంగా నావికాదళం (కంబాట్ రెడీ; కొహెసివ్, నావీ)



అనే అంశాన్ని తీసుకొని ఆ దిశగా పటిష్ట అడుగులు వేస్తున్నది. స్వదేశీ టెక్నాలజీ వినియోగంతో బలపడడం, వినూత్న శాస్త్ర సాంకేతిక ప్రగతి వినియోగంతో నావీ సేవలు బలీయం కావడం కొనసాగుతూనే ఉన్నది. 04 డిసెంబర్ వేడుకలు న్యూఢిల్లీ గేట్ వే ఆఫ్ ఇండియా కూడలిలో సాంస్కృతిక కార్యక్రమాలు, అమర వీరులకు శ్రద్ధాంజలి ఘటించడం, విశిష్ట సేవలకు తగు గుర్తింపులు/పతకాలు ఇవ్వడం ఘనంగా జరుగుతుంది.

**భారతీయ నావికా దళం:**

1612లో ఒక చిన్న దళంగా ప్రారంభమైన భారత నావికా దళం నేడు 67,252 మంది చురుకైన దళం, 75,000 రిజర్వ్ దళాలతో అభేద్యంగా, మహాశక్తివంతమైన సముద్రయాన/తీర గస్తీ దళంగా ఆవిర్భవించింది. శామ్ నొ వరునా (పవిత్ర జలదేవత దీవెనల తో) అనే నినాదంతో దేశ భద్రతే పరమ లక్ష్యంగా 150 నావలు/జలాంతర్గాములు, 300ఎయిర్ క్రాఫ్ట్‌ల బలంతో అభేద్యంగా మారడం హర్షదాయకం. భరతమాత సేవలో పునీతం అవుతున్న భారత త్రివిధ దళాలు, నేడు ముఖ్యంగా నావికాదళ శౌర్య పరాక్రమ సాహస వీరులకు, అమరవీరుల కుటుంబాలకు వినయంగా కృతజ్ఞతలు తెలియజేద్దాం. నేల, జలం, ఆకాశమే హద్దుగా మన త్రివిధ దళాలకు సలాం చేద్దాం.

*(04 డిసెంబర్ భారతీయ నావికాదళ దినోత్సవం సందర్భంగా)*

**కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## మొబైల్‌లో మొదలైన సంబంధాలు హింసతో ఎందుకు ముగుస్తున్నాయి?

ఇటీవలి కాలంలో వివాహేతర సంబంధాలు, సంబంధిత హింస, హత్యలు, కుటుంబ విచ్ఛిన్నాలు పెరుగుతున్న ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. ఒక్కరివైపు ఆకర్షణతో ఒకే వ్యక్తితో పదేపదే ఫోటోలు దిగడం, వాటిని క్రాప్ చేసి గ్యాలరీలో దాచుకోవడం, తరచుగా చూసుకోవడం వంటి ప్రవర్తనలు కేవలం అలవాటుగా అనిపించవచ్చు. కానీ ఇవి లోతులో ఒక భావోద్వేగ అస్థిరత, ఆసక్తి ఆధారిత రిలేషన్ షిప్, లేదా మానసిక రుగ్మతకి సంకేతాలు కావచ్చని మనం గుర్తించాలి. ఈ ప్రవర్తన భాగస్వామికి తెలిసినప్పుడు నిందలతో, దాచిపెట్టే ప్రయత్నాలతో మొదలై, చివరకు హింసా ఘటనల వరకు దారి తీసిన ఉదాహరణలు మీడియాలో, పోలీస్ కేసుల్లో పునరావృతమవుతున్నాయి. ఇది వ్యక్తిగత అభిరుచి సమస్య కాదు, కుటుంబ వ్యవస్థనే దెబ్బతీసే తీవ్రమైన మానసిక ప్రవర్తనా సమస్య. వివాహేతర సంబంధాలు పెరగడానికి కారణాలు ఎన్నో ఉన్నాయి, కానీ వాటిలో ఒక ముఖ్యమైన కారణం మానసిక అస్థిరత. దంపతుల మధ్య ఉండే సంబంధంలో తృప్తి లేకపోవడం, భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోవడం, కొత్త రిలేషన్ షిప్ పట్ల అధిక ఆకర్షణ, అటెన్షన్ కోసం చేసే ప్రయత్నాలు, సోషల్ మీడియాలో లభించే తాత్కాలిక గుర్తింపు, ఇవన్నీ కలిసి వ్యక్తిని వివాహేతర సంబంధాల వైపు పరుగులు తీయిస్తున్నాయి. వైవాహిక జీవితం అంటే కేవలం ఇద్దరి సంబంధం కాదు; అది భావోద్వేగ, నైతిక, సామాజిక బాధ్యత. క్షణిక మైన ఆత్మ తృప్తి కోసం ఈ వివాహ విలువలను మంట గలిపే నిర్ణయం సరైనది కాదు.

సెల్‌ఫోన్ వినియోగం, సోషల్ మీడియా, లేట్‌నైట్ చాటింగ్, ఫ్రెండ్‌షిప్ పేరుతో పరిచయాలు వేగంగా పెరుగుతున్నాయి. వీటితో భావాలు త్వరగా కలుస్తాయి, సంబంధాలు వేగంగా ఏర్పడతాయి, వాస్తవికత కన్నా ఊహలకు విలువ పెరుగుతుంది, ప్రేమ ముసుగులో ప్రమాదకర నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ చిన్నచిన్న తప్పులు చాలా పెద్ద జీవితాలను చెదర గొడుతున్నాయి. వివాహేతర సంబంధం ప్రభావం వ్యక్తిపైనే కాకుండా జీవిత భాగస్వామిపై, పిల్లలపై, ఇరువురి కుటుంబాలపై, సమాజంలో వారి గౌరవంపై తీవ్రంగా పడుతుంది. మొదట చిన్న అబద్ధాలతో మొదలై, ఆ తర్వాత భావోద్వేగ హింస, మానసిక ఒత్తిడి, చివరకు శారీరక హింస, విడాకులు, లేదా అత్యంత దారుణంగా హత్యలకు కూడా దారితీస్తుంది.

**భావోద్వేగ నియంత్రణ ముఖ్యమైన జీవన నైపుణ్యం**

ప్రతి వ్యక్తి తన భావోద్వేగాలను నియంత్రించుకోవాలి. ఆత్మపరిశీలన, ఆరోగ్యకర సంభాషణ, చిత్తశుద్ధి, రిలేషన్ షిప్ విలువలను అర్థం చేసుకోవడం తోనే మానసిక ఆరోగ్యానికి పునాది. వైవాహిక విలువలను, నైతిక బాధ్యతలను గుర్తించి జీవించకపోతే, కుటుంబం విచ్ఛిన్నం కావడం తప్పదు.

వివాహేతర సంబంధాలను పర్సనల్ లైఫ్ అని అనుకోవడం చాలా పెద్ద తప్పు. ఇది మానసిక ఆరోగ్యం, సంబంధ పరిపక్వత, కుటుంబ రక్షణకు సంబంధించిన సమస్య. అవగాహన, కౌన్సెలింగ్, భావోద్వేగ పరిపక్వత, నైతిక విలువలు ఇవే పరిష్కారం.

మనసు ఒకరి మీద అతిగా ఫిక్స్ అవుతుంటే నాకు ప్రాబ్లమ్ లేదు, పరిస్థితి అయితే ఇలా చేసింది అని అంటారు. కానీ మొదటి అడుగు నా ప్రవర్తన తప్పుదారి పడుతోంది అని గుర్తించడం.

**డిజిటల్ దూరం అత్యంత అవసరం:** ఒకరి ఫోటోలు, చాట్లు, సోషల్ మీడియా లింకులు మనసులో మళ్లీ మొదలవ్వడానికి ప్రధాన కారణం. అందుకే ఫోటోలు డిలీట్ చేయాలి, చాట్ హిస్టరీ క్లియర్ చేయాలి, సోషల్ మీడియా మ్యూట్/రిమూవ్ చేయాలి, ఫోన్ వినియోగాన్ని పరిమితం చేయాలి. ఈ ఒక్క స్టెప్ చాలామంది సమస్యను 60% తగ్గిస్తుంది.

మెదడు ఖాళీగా ఉంటే అదే వ్యక్తి గురించే ఆలోచిస్తుంది. అందుకే వ్యాయామం, వాకింగ్, పుస్తకాలు చదవడం, కొత్త పనిపై దృష్టి, హాబీలు బ్రెన్ను వ్యక్తి పనుల వైపు తిప్పాలి. అధిక మోహం లేదా ఇలాంటి బానిస ప్రవర్తన వెనుక కారణాలు ఒంటరితనం, భావోద్వేగ ఖాళీ, స్వీయ విలువల లోపం, అసంతృప్తి వైవాహిక జీవితం ఇవి అర్థం చేసుకుంటేనే మార్పు మొదలౌతుంది.

**భావోద్వేగ నియంత్రణ సాధనాలు:** దీర్ఘ శ్వాస టెక్నిక్స్, ధ్యానం, జర్నలింగ్, సిబిటి, ద్వారా భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవచ్చు.

**సంబంధాలలో సరిహద్దులు:** ఏ సంబంధం అయినాస్నేహం, పరిచయం సరిహద్దులు లేకపోతే అది నెమ్మది గా అనారోగ్యకరమైన ఆకర్షణగా మారుతుంది. అంతవరకు మాట్లాడకూడదు, అర్ధరాత్రి చాటింగ్‌లు చేయకూడదు, రహస్యంగా ఫోటో లు దిగకూడదు.

**భాగస్వామిని గౌరవించడం:** తప్పు ప్రవర్తన వల్ల భాగస్వామి బాధపడుతున్నారు అంటే దాంపత్య జీవితంలో సమస్యలు ప్రారంభమైనట్లుగా భావించాలి. అన్యోన్య దాంపత్య జీవితానికి దంపతుల మధ్య పారదర్శకత, నమ్మకం, హద్దులు, ఒకరిపై మరొకరి పట్ల గౌరవం తప్పనిసరి.

**ప్రొఫెషనల్ కౌన్సెలింగ్:** ప్రవర్తన నియంత్రణలోకి రాకపోతే అది ఆబ్సెసివ్ ప్రేమ డిజార్డర్ ఎమోషనల్ డీపెండన్సీ ఇంపల్స్ కంట్రోల్ ఇష్యూ సంకేతం కావచ్చు. సైకాలజిస్ట్ దగ్గర కౌన్సెలింగ్ తీసుకుంటే ఆలోచనా విధానం సరిదిద్దబడుతుంది. భావోద్వేగ నియంత్రణ వస్తుంది. సమస్య మూలాలను పరిష్కరించవచ్చు. ఈ ప్రవర్తన ప్రేమ కాదు, ఇది హార్మోన్లు + ఒంటరితనం + అదుపు కోల్పోవడం, క్రమంగా ఇది హింస, వివాహ సమస్యలు, హత్య, ఆత్మహత్యల వరకు దారితీస్తుంది. అందుకే ఇప్పుడే చర్య తీసుకోవడం తప్పనిసరి.

**డా. అట్ల శ్రీనివాస్ రెడ్డి,** రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్,
9703935321

## స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా విధులు నిర్వహించాలి

సిపి సునిల్‌దత్

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : జిల్లాలో పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణలో సమన్వంతో విధులు నిర్వహించి ఎన్నికలను విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో కిసాన్ ఫంక్షన్‌హాల్‌లో పోలీసు అధికారులు, సిబ్బందితో జరిగిన అవగాహన సదస్సులో సిపి పాల్గొని ఎన్నికల విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని గుర్తించి అడ్డుకట్టవేయాలన్నారు. ఈ సదస్సులో అడిసిపి లా అండ్ ఆడర్ ప్రసాద్‌రావు, రూరల్ ఎసిపి తిరుపతిరెడ్డి, సిఐలు రాజు, మురళి, రూరల్ డివిజన్ ఎస్సైలు, ఎఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్వగ్రామంలో

## కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవం

ప్రజాపక్షం/వైరా : తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమ్కా స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం సర్పంచ్ ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి నూతి వెంకటేశ్వరరావును అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం నామినేషన్ల విత్‌డ్రా అనంతరం ఏకగ్రీవంగా నూతి వెంకటేశ్వరరావును సర్పంచ్‌గా ప్రకటించారు.



## ఎన్నికల సిబ్బంది చట్టబద్ధంగా విధులు నిర్వహించాలి

ఎన్నికల పరిశీలకులు విశ్వేశ్వర రెడ్డి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : గ్రామపంచాయితీల ఎన్నికలు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమని, ప్రతీ ఎన్నికల సిబ్బంది తమ విధులను చట్టబద్ధంగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం పర్యటించి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు అత్యంత జాగ్రత్తగావ్యవహరించాలన్నారు. ఇందులో భాగంగా ముందుగా ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల శిక్షణా కేంద్రాలను సందర్శించారు. పాల్వంచ మండలంలోని అనుబోస్ కాలేజీలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేసి హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం బూర్గంపాడు మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలను సందర్శించారు. అదే విధంగా భద్రాచలంలోని రైతు వేదికలో జరుగుతున్న శిక్షణ వద్దకు చేరుకుని శిక్షణా నాణ్యతను పరిశీలించారు. శిక్షణా కేంద్రాల్లో మౌళిక వసతులు సజావుగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణలో ఎన్నికల విధులను సమగ్రంగా అర్థం చేసుకుని క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలన్నారు. ఎలాంటి తప్పిదాలు దొర్లకుండా చూడాలని, అన్ని సూచలను, మార్గదర్శకాలు పాటించాలన్నారు. అదే విధంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని లక్ష్మీదేవిపల్లి, శ్రీనగర్ కాలనీ గ్రామపంచాయితీలు, సుజాతనగర్ మండలంలోని సీతంపేట, బంజార, సర్వారం కేంద్రాలను సందర్శించి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఓటు హక్కు ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకునేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు.

## ఎర్రుపాలెం మండలంలో 6 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం

ప్రజాపక్షం/ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలో మొదటి విడతలో జరుగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 6 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. జమలాపురం గ్రామపంచాయతీ నుండి ఖమ్మం కెఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు సతీమణి తుళ్లూరి నిర్మలకుమారి, గట్లగౌరవరం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా బండ్ల ఆత్మప్రసాద్ సతీమణి బండ్ల రాణి, కాచవరం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా షేక్.ఫాతిమాభి, రామన్నపాలెం గ్రామసర్పంచ్‌గా వేమిరెడ్డి పరమేశ్వరి, కంద్రిక గ్రామ సర్పంచ్‌గా భూక్యా రాము, చొప్పకట్లపాలెం గ్రామ సర్పంచ్‌గా బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డిలు ఇప్పటి వరకు ఏకగ్రీవం అయ్యారు.



## ఉపసంహరణ ఉత్కంఠకు తెర

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలో ఉపసంహరణ ఉత్కంఠకు తెరపడింది. అశ్వాపురం మండలంలో మొత్తంగా 24 గ్రామ పంచాయితీలలో సర్పంచ్ నామినేషన్ అభ్యర్థులలో సంద్రలబోడు పంచాయితీ ఏకగ్రీవం కాగా మిగతా 23 పంచాయితీలలో ఎన్నిక నిర్వహణ జరగనుంది. అదే విధంగా 233లో 20 వార్డులు నామినేషన్లు తిరస్కరణ జరగగా 213 నామినేషన్లలో 20 వార్డులు ఏకగ్రీవం కాగా 193 వార్డులలో ఎన్నికల నిర్వహణ జరగనుంది అని ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్ తెలిపారు. మొత్తంగా అశ్వాపురం మండలంలో ఉపసంహరణ ఉత్కంఠకు తెరపడిన అనంతరం అభ్యర్థులు ఎన్నికల ప్రచార బరిలోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. అశ్వాపురం పంచాయితీ పరిధిలోని నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఎవరూ కూడా ఉపసంహరణకు మొగ్గు చూపలేదు. నేడు ఉపసంహరణ విషయంలో అన్ని పార్టీ కార్యాలయాల్లో ఉత్కంఠభరితమైన చర్చ జరగగా చివరకు పలు పార్టీలు బలపరిచిన అభ్యర్థులు కూడా ఉపసంహరణకు మొగ్గు చూపలేదు. అంటే అశ్వాపురం పంచాయితీ త్రిము పోరుకు సిద్ధమైనది, కొన్ని గ్రామాలలో త్రిముఖ పోరు బిఆర్ఎస్, సిపిఐ, సిపిఎంలలో కాంగ్రెస్‌లో రెండు వర్గాలతో ప్రచారంలోకి దూసుకువెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు.

## రెబెల్స్‌ని బుజ్జగిస్తున్న నేతలు

ఉపసంహరణ దిశగా రెబెల్స్ అభ్యర్థులు

ప్రజాపక్షం/మధిర : స్థానిక సంస్థల ఎన్నికల్లో మధిర మండలంలో అధికార పార్టీని రెబెల్స్ బెడద వెంటాడుతోంది. తొలి విడతలో జరిగే సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు వెల్లువెత్తాయి. ఒక్కో చోట సర్పంచ్ పదవికి 2నుంచి 3 మంది వరకు దరఖాస్తు చేశారు. ఈ పోటీ అధికార పార్టీలోనే ఎక్కువగా కన్పిస్తుండగా రెబెల్స్‌ను బుజ్జగించి పోటీ నుంచి తప్పించడం నేతలకు తలనొప్పిగా మారింది. నామినేషన్లు ఉపసంహరణ చేసుకునేందుకు గడవు బుధవారం ముగియనుండడంతో రెబెల్స్‌ను బరిలో నుంచి తప్పించేందుకు నేతలు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలతో పాటు పార్టీ పదవుల్లో తగు న్యాయం చేస్తామని వారికి హామీలు ఇస్తూ బుజ్జగింపులు చేస్తున్నారు. అయితే కొందరు పార్టీ ఆదేశాల మేరకు నామినేషన్ విత్ డ్రాకు సిద్ధమైనట్లు సమాచారం. ఇక బరిలో ఉండే అభ్యర్థులెవరో ఈ రెండురోజుల్లో తేలిపోనుంది. ఇదిలా ఉంటే ఎన్నికల ప్రచార వేడి మాత్రం అమాంతం పెరిగిపోతోంది. నిన్నటి వరకు టిక్కెట్ కోసం నానా తంటాలు పడిన అభ్యర్థులు ఇప్పుడు రెబెల్స్‌ను బుజ్జగించడం, క్యాడర్ చేజారిపోకుండా కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఏదీఏమైనా గ్రామాల్లో పంచాయతీల ఎన్నికల వేడి నెలకొంది.

# తొలి దశకు ముగిసిన ఉపసంహరణ ఘట్టం

ఖమ్మం జిల్లాలో 19,
భద్రాద్రి కొత్తగూడెంలో
13 పంచాయతీలు ఏకగ్రీవం
పలు పంచాయతీల్లో హోరాహోరీ

ప్రజాపక్షం/ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఉపసంహరణ ఘట్టం బుధవారంతో ముగిసింది. ఖమ్మం జిల్లాలో తొలి దశలో 192 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా ఏడు మండలాల పరిధిలోని 19 గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎనిమిది మండలాల పరిధిలోని 158 పంచాయతీల్లో 13 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన పంచాయతీల్లో హోరాహోరీ పోరు జరుగుతుంది. ఖమ్మం జిల్లాలో మొత్తం 19 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, ఇందులో ఒకటి సిపిఐ కాగా మిగిలినవన్ని కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. రఘునాథపాలెం మండలంలో ఐదు గ్రామపంచాయతీలు, చింతకానిలో రెండు, వైరాలో మూడు, బోనకల్‌లో ఒకటి, మధిరలో రెండు, ఎర్రుపాలెం మండలంలో ఆరు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

చింతకాని మండలంలోని రాఘవాపురం సర్పంచ్ స్థానాన్ని సిపిఐ ఏకగ్రీవంగా కైవసం చేసుకోగా, మిగిలిన అన్నిచోట్ల కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రఘునాథపాలెం మండలంలో రఘునాథపాలెం, రేగులచలక, మంగ్యాతండా, రాములుతండా, మల్లెపల్లి ఏకగ్రీవం కాగా, రఘునాథపాలెం పంచాయతీలో రెండు వార్డులకు ఎన్నికలు జరగనుండగా పైన పేర్కొన్న పంచాయతీల్లో సర్పంచ్ స్థానంతో పాటు వార్డులు కూడా ఏకగ్రీవమయ్యాయి. వైరా మండలంలో పుణ్యపురం, స్నానాల లక్ష్మీపురం , గోవిందాపురం గ్రామాల్లో సర్పంచులు, వార్డులు ఏకగ్రీవమయ్యాయి. చింతకాని మండలంలోని రేపల్లెవాడ, రాఘవాపురం పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బోనకల్ మండలంలో కలకోట, మధిర మండలంలో సైదల్లిపురం, సిద్దినేనిగూడెం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఎర్రుపాలెం మండలంలో జమలాపురం, కాచవరం, గట్లగౌరారం, చొప్పకట్లపాలెం, కంద్రిక, రామన్నపాలెం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

ఒకటి కోయచలక తుది వరకు చర్చలు జరగగా చివరి నిమిషంలో చర్చలు విఫలం కావడంతో ఎన్నికలు జరగనున్నాయి. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొలి దశలో 158 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా బూర్గంపాడు మండలంలో మొత్తం 18 పంచాయతీలకు గాను మోరంపల్లి బంజర, పినపాక పట్టి నగర్, లక్ష్మీపురం, నకిరిపేట, కృష్ణా సాగర్ గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పినపాక మండలంలో మొత్తం 23 పంచాయతీలు ఉండగా పాతరెడ్డిపాలెం, జగ్గారం, కృష్ణాపురం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అశ్వాపురం మండలంలో చంద్రలబోడు గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. దుమ్ముగూడెం మండలంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం కాగా ఒకటి సిపిఎం, మూడింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. దుమ్ముగూడెం, గంగోలు, కొత్తూరు, కోయనర్సాపురం గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒకటి సిపిఎం మిగిలినవన్ని కాంగ్రెస్ కైవసమయ్యాయి. కాంగ్రెస్ ఏకగ్రీవం చేసుకున్న ప్రతి చోట ఉప సర్పంచ్ స్థానాలు బిఆర్ఎస్‌కు కేటాయించడంగమనార్హం.

**రెండవ దశలో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం :**


ఈనెల 14న జరగనున్న రెండవ దశ ఎన్నికలకు సంబంధించి 183 పంచాయతీల్లో ఎన్నికలు జరగాల్సి ఉండగా తొమ్మిది గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో సిపిఐ ఒకటి, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఒకటి మిగిలినవి కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

కామేపల్లి మండలంలోని ఊటుకూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్‌తో పాటు 10 వార్డులకు ఒక్కొక్క నామినేషనే దాఖలైంది. ఈ సర్పంచ్ స్థానాన్ని సిపిఐకి చెందిన ఈసం హన్మంతరావు కైవసం చేసుకున్నాడు. ఇదే మండలంలో పాత లింగాల, జోగ్గూడెం, నర్సింగ్ తండా, కెప్టెన్ బంజర, లాల్యాతండా పంచాయతీలకు వార్డులు, సర్పంచ్‌లకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి.

తిరుమలాయపాలెం మండలంలోని తిమ్మక్కపేట పంచాయతీని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్‌కు చెందిన అభ్యర్థి సర్పంచ్ స్థానాన్ని గెలుచుకున్నాడు. కూసుమంచి మండలంలోని లాల్‌సింగ్ తండా, నేలకొండపల్లి మండలంలోని ఆచర్లగూడెం గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కాగా, ఇవి కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాల్వంచ మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీని సిపిఐ ఏకగ్రీవంగా గెలిచింది. సిపిఐకి చెందిన బానోత్ రవి సర్పంచ్‌గా ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఐదు పంచాయతీలు ఏకగ్రీవం

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ







ప్రజాపక్షం/రఘునాథపాలెం : రఘునాథపాలెం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి తొలి విడత నామినేషన్ల ఉపసంహరణ బుధవారం ముగిసింది. మండలంలో 37 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో ఐదు గ్రామ పంచాయతీలలో సర్పంచ్ స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ నాలుగు గ్రామ పంచాయతీల్లో వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలైంది. దీనితో ఐదు సర్పంచ్ స్థానాలతో పాటు నాలుగు గ్రామ పంచాయతీల వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవం కాగా ఓ పంచాయతీకి సంబంధించి సర్పంచ్ స్థానంతో పాటు 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రెండు వార్డులు పోటీ అనివార్యమైంది. మంగ్యాతండా, మల్లెపల్లి, రాములుతండా, రేగులచలక గ్రామాలు సర్పంచ్, వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. రఘునాథపాలెం సర్పంచ్ స్థానంతో పాటు 12 వార్డులకు గాను 10 వార్డులు ఏకగ్రీవం కాగా నాలుగు, ఐదవ వార్డులో పోటీ నెలకొంది. మిగిలిన 32 గ్రామ పంచాయతీల్లో డిసెంబర్ 11న ఎన్నికలు జరగనున్నాయి. మంగ్యాతండా సర్పంచ్‌గా మాలోత్ భార్గవి, మల్లెపల్లి సర్పంచ్‌గా తేజావత్ భద్రి, రాములు తండా సర్పంచ్‌గా బానోత్ వెంకట్రామ్, రేగులచలక సర్పంచ్ యండపల్లి రమాదేవి, రఘునాథపాలెం సర్పంచ్‌గా గాజుల కృష్ణారావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలు పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు ద్విముఖ, త్రిముఖ పోటీ నెలకొంది. కోయచలక గ్రామ పంచాయతీ చివరి నిమిషంలో ఏకగ్రీవం కాకుండా మిగిలిపోయింది. ఓ వార్డుకు సంబంధించి నామినేషన్ వేసిన అభ్యర్థి ఉపసంహరణకు రాకపోవడంతో మొత్తం సర్పంచ్ స్థానంతో పాటు 10 వార్డులకు పోటీ అనివార్యమైంది. ఉపసంహరణల అనంతరం పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. నేటి నుంచి గ్రామాల్లో ప్రచారం ఊపందుకోనుంది.

## బోనకల్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ(ఎం) కూటమి మధ్య పోటీ

చిన్నబీరవల్లి, రాపల్లిలో కాంగ్రెస్ వర్గాల మధ్యే ప్రధాన పోటీ
కలకోట ఏకగ్రీవం

ప్రజాపక్షం/బోనకల్ : బోనకల్ మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్‌కు సిపిఐ(ఎం), బిఆర్ఎస్ కూటమికి మధ్య ప్రధాన పోటీ నెలకొంది.

మొత్తం 22 పంచాయతీలు ఉండగా కలకోట గ్రామ పంచాయతీ ఏకగ్రీవమైంది. టిపిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్‌కుమార్ సతీమణి అనిత కాంగ్రెస్ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన పంచాయతీల్లో సిపిఐ(ఎం), బిఆర్ఎస్ కూటమి కలిసి పోటీ చేస్తుండగా కాంగ్రెస్ విడిగా పోటీ చేస్తుంది. సిపిఐ రాపల్లి, బ్రాహ్మణపల్లి, ఆళ్లపాడు, చిరునోముల, ముష్టికుంట పంచాయతీల్లో కాంగ్రెస్‌కు మద్దతునిస్తుండగా మోటమర్రి, గోవిందాపురం (ఎల్) గ్రామాల్లో సిపిఐ(ఎం)కు రాయన్నపేటలో బిఆర్ఎస్‌కు మద్దతునిస్తున్నది. చిన్నబీరవల్లి గ్రామంలో రెండు కాంగ్రెస్ గ్రూపులతో పాటు సిపిఐ(ఎం) అభ్యర్థి కూడా పోటీ చేస్తున్నారు.

ఇక్కడ ప్రధాన పోటీ కాంగ్రెస్‌లోని రెండు వర్గాలకు చెందిన సమీప బంధువుల మధ్య పోటీ జరుగుతుంది. రాపల్లిలో కాంగ్రెస్‌లోని ఒక వర్గానికి బిఆర్ఎస్ మద్దతునిస్తుండగా మరో వర్గానికి సిపిఐ, సిపిఐ(ఎం), టిడిపి మద్దతునిస్తున్నాయి. మండలంలో ముష్టికుంట, గార్లపాడు, రామాపురం, గోవిందాపురం (ఎల్), తూటికుంట్ల, పెద్ద బీరవల్లి, నారాయణపురం, మోటమర్రి, చిరునోముల, చిన్నబీరవల్లి లో సిపిఐ(ఎం) పోటీ చేస్తుండగా మిగిలిన చోట్ల బిఆర్ఎస్‌ను బలపరుస్తుంది. ఈ దఫా మండలంలో ఎక్కువ స్థానాలకు గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు సిపిఐ(ఎం), బిఆర్ఎస్ కూటమి సర్వశక్తులు ఒడ్డుతుంది.

## మొదలైన ఎన్నికల వేడి

ఐదు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం
మిగిలిన 13 గ్రామపంచాయతీలో 46 మంది సర్పంచ్ అభ్యర్థుల పోటీ
18 గ్రామ పంచాయతీలో 309 మంది వార్డు అభ్యర్థులు పోటీ

ప్రజాపక్షం/బూర్గంపాడు : బూర్గంపాడు మండలంలోని 18 గ్రామ పంచాయితీలలో ఎన్నికల వేడి మొదలైంది. బుధవారం ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణలో భాగంగా మండలంలో ఐదు గ్రామ పంచాయతీల సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తంగా చూస్తే మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు గాను 104 మంది సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేశారు. అయితే ఉపసంహరణలో భాగంగా 53 మంది సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. దీంతో మిగిలిన 13 గ్రామ పంచాయతీలకు 46 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్న వారు తమ భవితవ్యాన్ని తేల్చుకోనున్నారు. ఇదే కోవలో మండలంలోని 18 గ్రామ పంచాయతీలో గల వార్డులకు 474 మంది వార్డు సభ్యులుగా తమ నామినేషన్లను వేశారు. కాగా ఉపసంహరణలో భాగంగా 108 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో మండలంలోని పలు పంచాయతీలకు చెందిన 57 వార్డులు ఏకగ్రీవంగా అయ్యాయి. కాగా 309 మంది వార్డు సభ్యులుగా పోటీలో ఉన్నారు. ఏకగ్రీవంగా కృష్ణసాగర్ సర్పంచ్‌గా తాటి వాణి, లక్ష్మీపురం సర్పంచ్‌గా బాదం వెంకటేశ్వర్లు, నకిరిపేట సర్పంచ్‌గా శర్పా నాగమణి, మోరంపల్లిబంజర్ సర్పంచ్‌గా బొర్రా సుభద్ర, పినపాక పట్టినగర్ సర్పంచ్‌గా బానోత్ పద్మలు ఎన్నికయ్యారు. ఉపసంహరణ ప్రక్రియ ముగియడంతో పంచాయతీ ఎన్నికల్లో పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు అభ్యర్థులకు గుర్తులకు కేటాయించారు. దీంతో గ్రామాల్లో ఎన్నికల్లో ప్రచార ఊపు అందుకోనుంది. ఈ ప్రచారాలతో అభ్యర్థులుగా పోటీలో ఉన్న వారు తమ భవితవ్యాన్ని ఓటర్లు ముందు ఉంచనున్నారు.

## పోలీస్ స్టేషన్లో 101 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాపక్షం/ఏన్కూరు : ఏన్కూర్ పోలీస్ స్టేషన్లో 101 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్సై ఎన్ సంధ్యా తెలిపారు. 56 మంది బెల్ట్ షాప్ నిర్వాహకుల పైన, 6గురు రౌడీషీటర్ల పైన, పాత కేసులలో ఉన్న 9మంది పైన, మిగతా పలు కేసులలో ఉన్న 30 మంది పైన బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్సై సంధ్య తెలిపారు. అదే విధంగా ఎన్నికల ప్రశాంతతకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

నలుగురు యువకులు మృతి
మృతుల్లో 6వ తరగతి విద్యార్థి
నుజ్జునుజ్జైన కారు
కుటుంబాల్లో విషాదం




ప్రజాపక్షం/సత్తుపల్లి : మండల పరిదిలోని కిష్టారం గ్రామ శివారు అంబేద్కర్ నగర్ కాలనీ వద్ద, నెషనల్ హైవే 365బిబి పై బుధవారం తెల్లవారుజామున జరిగిన భయంకరమైన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. మృతుల్లో 9 ఏళ్ల బాలుడు ఉండటం విషాదాన్ని మరింత పెంచింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దేసి జాయ్(18) తండ్రి శ్రీనివాసరావు, మార్స కట్ల శశి(11) తండ్రి రాజబాలు, షేక్ సాజిద్ (25) తండ్రి అజ్మీర్, తలారి అజయ్ తండ్రి రాజు(23),షేక్.ఇమ్రాన్ ఖాసీంలు కారు నెం.టిజీ 04 ఏ 4744 టాటా ఆల్ట్రోజ్ వాహనంలో వియ్యం బంజరవైపు నుండి సత్తుపల్లికి వచ్చే క్రమంలో, కిష్టారం గ్రామంలో అతివేగంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను బలంగా డీకొట్టారు. ప్రమాద తీవ్రతకు డివైడర్ రోడ్డుపైకి లేచి పడగా,కారు సుమారు 30 మీటర్లు దూరం వరకు పల్టీలు కొట్టుకుంటూ వెళ్ళిందని దీని కారణంగా కారు పూర్తిగా ధ్వంసం కాగా ముగ్గురు యువకులు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా, ఇద్దరు యువకులు గాయపడ్డారన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సిఐ టి.శ్రీహరి నేతృత్వంలోని బృందం ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ ని క్లియర్ చేసి, మృతదేహాలను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న కల్లూరు ఎసిపి వసుంధర యాదవ్ ఘటనకు గల కారణాలను సిఐని శ్రీహరి అడిగి తెలుసుకుని, మార్చురీలో ఉన్న యువకులు మృతదేహాలను పరిశీలించారు. విద్యార్థుల మృతితో ఆయా కుటుంబాలు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అయ్యప్పస్వామి ఆలయంలో మహా అన్నదానం



ప్రజాపక్షం/మధిర : మధిరలోని లడకబజార్ అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న శ్రీ స్వామి అయ్యప్పదేవాలయం నందు మహా అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం అసూర సంస్థల అధినేత పబ్బతి రవికుమార్ ప్రారంభించారు. గత 53రోజులుగా ఘనంగా జరుగుతున్న మండల పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. నిరంతరంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి పబ్బతి రవికుమార్, లీలామాధురి దంపతులు, కుమారుడు సాయి తేజ, ఓనమాల ప్రణీత్, లౌక్యదంపతుల బియ్యాన్ని అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ముందుగా స్వామి వారికి చక్రస్నానం, తదితర పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు అయ్యప్ప స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారరావు, చెరుపల్లి శ్రీధర్, అయ్యప్ప మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ అన్నారు. బుధవారం వైరారోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఎక్కువ మందిని ఆటోలో ఎక్కించుకోవద్దన్నారు. డ్రైవర్ సిటులో ఇరువైపుల ప్రయాణికులను ఎక్కించుకుంటే వాహనం సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో కండిషన్‌లో ఉంచుకోవాలని ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స నిమిత్తం క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి మానవత్వం చాటుకోవాలన్నారు. ఆటోలకు హై ఓల్టేజ్ బల్బులు అమర్చి ఎదురుగా వచ్చే వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సదరు ఆటోవాలాపై చర్యలు తీసుకుంటామన్నారు.

## దట్టమైన పొగమంచులో ప్రయాణాలు ప్రమాదకరం

సిపి సునిల్‌దత్

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : దట్టమైన పొగమంచులో ప్రయాణాలు చేయడం ప్రమాదకరమని అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు నిలుపుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ప్రజలకు సూచించారు. బుధవారం తెల్లవారుజామున సత్తుపల్లి సమీపంలో కిష్టారం గ్రామం వద్ద కారు డివైడర్‌ను ఢీకొని ముగ్గురు మృతి చెందగా ఇరువురికి గాయాలైయ్యాయని ఈ ప్రమాదానికి పొగమంచే కారణమని గుర్తించామన్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని ప్రజలు పొగమంచులో ప్రయాణాలు మానుకోవాలన్నారు. మంచు కారణంగా ఎదుటి వాహనాతో పాటు పాదచారులు, ద్విచక్ర తదితర చిన్న వాహనాలు కనిపించక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయని తెలిపారు. వేగంగా వాహనాలు నడపటకూడదని ఎదుటి వాహనాలను నిషితంగా గమనించి ముందుకుసాగాలని వాహనచోదకులకు సూచించారు. మంచుకురిసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం, వాహనాను అధిగమించే ప్రయత్నంచ చేయడం ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధమన్నారు. నిభందనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## సర్పంచ్ అభ్యర్థులను ప్రకటించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలోని మండలంలోని పలు గ్రామాలకు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడి యం శ్రీహరి సర్పంచ్ అభ్యర్థులను ప్రకటించారు.గోనె సంధ్యారాణి (తీగారం), మైదాసి ప్రభాకర్ (సూరారం), తాళ్లపల్లి సుభాష్ (షాపెల్లి), అన్నం స్వప్న రాణి (తమ్మడపల్లి జి), దొంతమల సంతోష్ (ఓబులాపూర్), మెరుగు మహేశ్వరి (హిమ్మత్ నగర్), అన్నెబోయిన బిక్షపతి (జఫర్‌గడ్), చడ కవిత (తిమ్మంపేట), కొడారి సాంబరాజు (ఉప్పుగల్లు), కాటం దేవేంద్ర (కూనూర్), రడపాక అఖిల (కొనయిచలం), గోపి సోమయ్య (తిడుగు), తాటికాయల మమత (సాగరం), ఎడ్ల వెంకటస్వామి (రఘునాథపల్లి), బానోత్ వినోద (లక్ష్మి నాయక్ తండ), బానోత్ అరుణ శ్రీ (అళ్వార్ బండ తండ), భూక్య యాకూబ్ (దుర్గనాయక్ తండ), బానోత్ భాస్కర్ (ముగ్దుల్ తండా), రడపాక హరి బాబు (తమ్మడపల్లి ఐ), మైదాసి ప్రభాకర్ (సూరారం)లను ప్రకటించారు.

## కటాక్షపూర్ సర్పంచ్ అభ్యర్థిగా షబానా నామినేషన్



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల సమన్వయ కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ సతీమణి ఎండి షబానా బుధవారం హౌస్ బుజుర్గ్ గ్రామపంచాయతీలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేశారు. ఆత్మకూరు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఎండి షబానాకు మద్దతు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థి ఎండి షబానా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పని చేస్తానని, ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని, పారదర్శక పాలనను అమలు చేస్తానని, రాజకీయాలకతీతంగా గ్రామ ప్రజలను సమానంగా చూసుకుంటానని హామీ ఇచ్చారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో 'టాలీప్రైమ్'పై వర్క్‌షాప్




**ప్రజాపక్షం/కెయుక్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో టాలీప్రైమ్: కాన్సెప్ట్‌లు, ఫీచర్లు, ప్రాక్టికల్ వినియోగం అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సెషన్ విశ్వవిద్యాలయ సెమినార్ హాల్‌లో జరిగింది. టాలీప్రైమ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్లకు పైగా వినియోగదారులను కలిగి ఉన్న ప్రముఖ బిజినెస్ సాఫ్ట్‌వేర్. భారతదేశంలో అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ విభాగంలో దాదాపు 80 శాతం మార్కెట్ షేర్‌ను కలిగి ఉంది.ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు టాలీప్రైమ్ సాఫ్ట్‌వేర్ యొక్క ముఖ్యమైన అంశాలు, వినియోగ విధానాలు, ప్రాక్టికల్ అప్లికేషన్ గురించి లోతుగా అవగాహన పొందారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తోడ్పడేలా ఈ కార్యక్రమం రూపొందించబడింది.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అమరవేణి, ప్రొఫెసర్ రాజేందర్ కట్ల, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ప్రొఫెసర్ వరలక్ష్మి , డీఎన్ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్, ప్రొఫెసర్ నరసింహ చారి, ప్రిన్సిపల్ యూనివర్సిటీ పీజీ కాలేజ్ సుబేదారి, డాక్టర్ ఫణీంద్ర కుమార్, డాక్టర్ ప్రగతి రెడ్డి పాల్గొన్నారు.

## నామినేషన్లు దాఖలు



**ప్రజాపక్షం/కన్నాయిగూడెం:** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా బుధవారం నుండి మూడవ విడత నామినేషన్ కన్నాయిగూడెం మండలంలో ప్రారంభం కాగా మండలంలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి పిరీలా స్వప్న సురేష్, లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి బోట జ్యోతి నగేష్‌ల, బుధవారం రాజన్నపేట గ్రామ పంచాయతీ పరిధిలో రైతు వేదికలో సర్పంచ్ నామినేషన్ వేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కన్నాయిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అప్సర్ పాషా హాజరై తుపాకులగూడెం నుండి దేవాదుల లక్ష్మీపురం నుండి కాంగ్రెస్ గ్రామ నాయకులు, మండల నాయ కులతో కలిసి కన్నాయిగూడెం రైతు వేదికలో ఎన్నికల సంఘ అధికారులకు సర్పంచ్ నామినేషన్‌పత్రాలు అందజేశారు. కన్నాయిగూడెం మండల మాజీ వైస్ ఎంపిపి బొల్లె భాస్కర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొట్ల నగేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎస్‌కె యాకుబ్ పాషా, కిసాన్ కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు అగ్గు నారాయణ, కిసాన్ కాంగ్రెస్ మండల నాయకులు పాలకుర్తి శ్రీధర్, పీరిలా సురేష్, లక్ష్మీపురం గ్రామ కమిటీ అధ్యక్షులు నర్సింగరావు, బిసి జేఏసి అధ్యక్షులు ముదురుకొల్లా బిక్షపతి, తుపాకులగూడెం, లక్ష్మీపురం గ్రామాల కాంగ్రెస్ నాయకులు, సీనియర్ గ్రామనాయకులుయూత్ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండలో కలెక్టర్ పర్యవేక్షణ




**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అమీన్‌పేట్ క్లస్టర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. నామినేషన్‌ల స్వీకరణ, సిబ్బంది విధి నిర్వహణ, అవసరమైన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. అధికారులు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

## ధైర్యంతో ముందుకు సాగాలి

### స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :**అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హన్మకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల వారోత్సవాలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అంగవైకల్యంతో పుట్టడం పిల్లల తప్పు కాదని అలాంటి పిల్లలను సమాజంలో చిన్న చూపు చూడటం మంచిది కాదని తెలిపారు. అంగవైకల్యం కలిగిన పిల్లలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. దాదాపు 200మంది మానసిక వికలాంగ పిల్లలకు మల్లికాంబ మనోవికాస కేంద్రం అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. మల్లికాంబ మనోవికాస కేంద్రానికి నావంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. మల్లికాంబ మనివికాస కేంద్రం నిర్వాహకురాలు రామలీల, జాయింట్ సెక్రెటరీ ప్రొఫెసర్ పద్మ, ఈసి మెంబర్ బండ సదానందం, కళ్యాణ్, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలట్ పత్రాల పంపిణీ

**ప్రజాపక్షం/జనగామ:** గ్రామ పంచాయితి ఎన్నికల సందర్భంగా పోస్టల్ బ్యాలట్ పత్రాలను సర్వీస్ ఓటర్లకు, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు సరిగ్గా పంపిణి జరగాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. పోస్టల్ బ్యాలట్ పంపిణి, నిర్వహణ మీద బుధవారం జేసి పింకేష్‌కుమార్‌తో సంబంధిత అధికారులతో కలెక్టర్ గూగుల్ మీట్ ద్వారా రివ్యూ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడుత పోలింగ్ జరిగే మండలాలలో ఈనెల 9వ తేదీన జరిగే మండలాలలో ఈనెల 9వ ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ కేంద్రంకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్ ఏవో, మండలస్థాయిలో తహశిల్దార్‌లు నోడల్ ఆఫీసర్‌గా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు, మండల స్థాయి అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆత్మవిశ్వాసమే ఆయుధం

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

### అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు




**ప్రజాపక్షం/హనుమకొండ:** దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో ముందుకు సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. బుధవారం హనుమకొండ అంబేద్కర్ భవన్ లో జిల్లా మహిళా, శిశు,దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ దివ్యాంగుల నుండి నేర్చుకోవాల్సిన చాలా విషయాలు మనకెంతో ఉన్నాయని, ఇక్కడ మీరు చేసిన ప్రదర్శనలతో తెలుస్తుందని పేర్కొన్నారు. ఏదో కావాలి అనుకునే మిగతా వారి కంటే ఉన్నంతలోనే మీరంతా ఎంతో సంతోషంగా ఉన్నారని ఈ కార్యక్రమం ద్వారా తెలుస్తుందన్నారు. మిగతా వారితో దయ, కరుణ, సహానుభూతి, ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసంతో ఉంటారని అన్నారు. ఇలాంటి లక్షణాలు అందరిలో ఉంటే ఇంకా ఎక్కువగా పరస్పర గౌరవం సమాజంలో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పెన్షన్లు, భవిత కేంద్రాలు, స్కాలర్ షిప్పులు, ప్రత్యేక స్వయం సహాయక సంఘాలు, విద్యా, ఉపాధి, గృహ కల్పనలో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కృషి పట్టుదలతో రాణిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జయంతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో దివ్యాంగ బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగులకు బ్యాంకు రుణాలు మంజూరు ఉంటుందన్నారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరూ ప్రోత్సాహం అందించాలన్నారు.వేడుకలలోభాగంగాబన్ను, వికాస్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, స్పందన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమం ముగింపు సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలతో పాటు మెడల్స్ బహూకరించారు. డిఆర్డీవో మేన శ్రీను, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఇసంపెల్లి జోనా, డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య, కేయూ పాలకమండలి సభ్యులు డాక్టర్ కె.అనితా రెడ్డి, విద్యా ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ల మహేందర్, దివ్యాంగ సంఘం ప్రతినిధులు రాజు, శ్రీనివాస్, సిడిపివో విశ్వజ, ఎఫ్ ఆర్వో రవి కృష్ణ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జిఅధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

## తప్పిదాలు, పొరపాట్లకు తావివ్వొద్దు

### కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** నామినేషన్ల స్వీకరణ కేంద్రాలలో నామినేషన్ల ప్రక్రియను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం పరిశీలించారు. హనుమకొండ జిల్లాలో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైన దామెర క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో దామెర, ల్యాదెళ్ళ గ్రామ పంచాయతీలకు, ఒగ్లాపూర్ క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఒగ్లాపూర్, దమ్మన్నపేట గ్రామపంచాయతీలకు సర్పంచ్, వార్డు స్థానాలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరిస్తుండగా కలెక్టర్ పరిశీలించారు. క్లస్టర్ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న ఎలక్షన్ నోటీస్, రిజర్వేషన్ల జాబితా లను పరిశీలించారు. ఆర్వోలు, ఏఆర్వోలతో నామినేషన్ల ప్రక్రియ గురించితెలుసుకున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాట్లను, నామినేషన్ల ప్రక్రియను ఎంపీడీవో కల్పన జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాన్ని నిలబెట్టడం మానవత్వానికి ప్రతీక




**ప్రజాపక్షం/హనుమకొండ:** రక్త దానంతో ఎందరో ప్రాణాలను కాపాడవచ్చని, తలసేమియా, హిమోఫీలియా లాంటి రోగులకు రక్త దానం ఎంతో మేలు చేస్తుందని, రక్త దానం చేయండి ప్రాణాలు కాపాడండని న్యాయవాదులకు వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబపిలుపునిచ్చారు.వరంగల్ కోర్టు ప్రాంగణం డిఎల్ ఎస్ సేవా సదన్ లో వరంగల్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్,వరంగల్ డిస్ట్రిక్ట్ బార్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరం ప్రారంభించి ఆమె మాట్లాడారు. వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మల గీతాంబ, పట్టాభి రామారావు న్యాయమూర్తులు ప్రసంగిస్తూ రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడబడుతాయని, రక్తదాన ఆవశ్యకత గురించి ప్రచారం చేసి కోర్టు ఆవరణలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలుస సుధీర్ ప్రసంగిస్తూ రక్తం కొరత తీవ్రంగా పెరుగుతున్న తరుణంలో థలసీమియా పిల్లలు,అత్యవసర శస్త్ర చికిత్సలు, క్యాన్సర్, ప్రమా ద బాధితులు ప్రాణాలు చేతిలో పెట్టుకొని రక్తానికై ఎదురు చూస్తున్నారని,మన దేహం నుంచి వెలువడే ఒక యూనిట్ రక్తం మూడు ప్రాణాలకు వెలుగునిస్తుందని రక్తం ఇవ్వడం ప్రాణాన్ని నిలబెట్ట డం మనిషితనమని, మానవత్వానికి ప్రతీకని అన్నారు.వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి సాయి కుమార్, న్యాయమూర్తులు క్షమా దేశ్ పాండే, రామలింగం, నారాయణ బాబు, ఉషా క్రాంతి, పూజ, నందికొండ రితిక, హారిక, వెంకట చంద్ర ప్రసన్న, వరంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మైదం జయపాల్, ప్రధాన కార్యదర్శి డి. రమాకాంత్, సంయుక్త కార్యదర్శి మునిపట్ల శ్రీధర్, మహిళా సంయుక్త కార్యదర్శి రేవూరి శశిరేఖ, హనుమకొండ బార్ మహిళా సంయుక్త కార్యదర్శి, కోశాధికారి సిరిమల్ల అరుణ, వరంగల్, హనుమకొండ గ్రంథాలయ కార్యదర్శులు గుండ కిషోర్, వెంకట్, సీనియర్ ఇ.సి మెంబర్ ఇజ్జగిరి సురేష్, మహిళా సీనియర్ ఇ.సి కళ కోట్ల నిర్మల జ్యోతి, ఇ.సీ సభ్యులు మర్రి రాజు, జాటోతు రవి, తోట అరుణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హన్మకొండ శాఖ పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జె కిషన్ రావు, బ్లడ్ డోనర్ మోటివేటర్ గంధసిరి శ్రీనివాస్, మడిపల్లి ఆనంద్ గౌడ్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేసారు. రక్తదానం చేసిన 60 మంది న్యాయవాదులకు ప్రతి సభ్యునికి పండ్లు పంపిణీ చేసి సర్టిఫికేట్లు ఇచ్చి అభినందనలు తెలిపారు. అందరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

# పోలింగ్ విధులకు స్థానికేతర సిబ్బంది ఎంపిక పూర్తి

### కలెక్టర్ సమక్షంలో జిపి ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్



**ప్రజాపక్షం/ములుగు:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్, సాధారణ పరిశీలకుడు ప్రశాంత్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆయిల్ ఫెడ్, హైదరాబాద్ సమక్షంలో బుధవారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలాల వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 146 గ్రామ పంచాయతీ సర్పంచ్, 1290 వార్డుల స్థానాలకు, 1306 పోలింగ్ స్టేషన్‌లలో ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకొని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓపిఓల ర్యాండమైజేషన్ జరిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావు, డిపిఓ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల పేరుతో నాటకాలాడుతున్న కాంగ్రెస్, బిజెపిలపై యుద్ధభేరి

### ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణలో జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు



**ప్రజాపక్షం/హనుమకొండ :** బిసి రిజర్వేషన్ల పేరుతో నాటకాలాడుతున్న కాంగ్రెస్, బిజెపి పార్టీలపై బీసీ జేఏసీ యుద్ధభేరి మోగించింది. ఈ క్రమంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించుకునేందుకు బీసీ జేఏసీ ఆధ్వర్యంలో డిసెంబర్ 9న చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ నేతృత్వంలో హన్మకొండలో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ లు హాజరై చేలో ఢిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటుందని ఆ రెండు పార్టీలపై ఆయన యుద్ధం ప్రకటించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ బిజెపి పార్టీల బీసీ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, బీసీ సమాజం ముందు రెండు పార్టీలను దోషులుగా నిలబెడతామన్నారు. బీసీ రిజర్వేషన్లు వచ్చుడో, కాంగ్రెస్ బిజెపి, పార్టీలను భూస్థాపితం చేసుడో అనే విధంగా ఉద్యమ కార్యాచరణను రూపొందించినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.జనాభా దామాషా ప్రకారం బీసీలకు చట్టసభలతో పాటు, స్థానిక సంస్థల కోటాలో, విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. బిసి జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు డా. చిర్ర రాజు గౌడ్, డా. సంగాని మల్లేశ్వర్, బోనగాని యాదగిరి గౌడ్, దొడ్డపల్లి రఘుపతి, తమ్మేలా శోభరాణి, మాదం పద్మజ దేవి, తెల్ల సుగుణ, పల్లెపు సమ్మయ్య, అమరావది సారంగపాణి, చిర్ర సుమన్ గౌడ్, కరుణ, స్వరూప తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ సంక్షేమ పథకాలు సర్వత్రా ఆదర్శప్రాయం



**ప్రజాపక్షం/సంగెం:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలే రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో మనకు ఆయుధంగా మారతాయని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ పాలనను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. బుధవారం గీసుకొండ మండలంలోని ఊకల్ క్రాస్ వద్ద గల ఎస్ఎస్ గార్డెన్ లో సంగెంగీసుకొండమండలాల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో ఆయన గ్రామపంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలోని 109 మంది సర్పంచ్‌లను కాంగ్రెస్ కండువాలతో తన వద్దకు తీసుకురావాలని ఆదేశించారు. గెలిచి వచ్చిన వారి గ్రామాలను అభివృద్ధి చేయడానికి అధిక నిధులు ఇచ్చే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలను ప్రజలకు వివరించి, ఓట్లు అడగాలని దిశా నిర్దేశం చేశారు.

# ఇది మన జాతర...జట్టులా కలిసి పనిచేద్దాం

### జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకాన్



**ప్రజాపక్షం/ములుగు:** జనవరిలో నిర్వహించనున్న మేడారం మహా జాతర విజయవంతం కోసం అవసరమైన సమన్వయ చర్యలపై జిల్లా ఎస్‌పి కేకాన్ సుధీర్ రామనాథ్ బుధవారం పూజారులతో, అభ్యుదయ సంఘం యువతతో సమావేశం నిర్వహించారు. ఎస్‌పి మాట్లాడు తూ ఇది మన జాతర.. అందరం ఒక జట్టులా కలిసి పనిచేస్తునే జాతర విజయవంతమవుతుంది. గత పుణ్యం వల్లే ఈ జాతరలో తల్లులకు సేవ చేసే అదృష్టం మనందరికి లభించిందని అన్నారు.

**సమన్వయం...భద్రతపై కీలక సూచనలు**

పూజారులు, యువత కోసం ప్రత్యేక పాసులు జారీ చేసి పూజారులు, యువత, పోలీస్‌శాఖ మధ్య సమన్వయ లోపం లేకుం డా కృషి చేస్తానని సూచించారు. ఈ సంవత్సరం మేడారం పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతుండడంతో భక్తుల రద్దీ భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం 10వేల మందికి పైగా పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్‌తో సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తయ్యేలా విజ్ఞప్తి చేస్తానని ఎస్‌పి అన్నారు.

**ట్రాఫిక్ నియంత్రణ..పార్కింగ్ ఏర్పాట్లు**

గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు లేకుండా మెరుగైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. జాతరకు వచ్చే ప్రతి భక్తుడు సులభంగా దర్శనం చేసుకొని సురక్షితంగా తిరిగి ఇంటికి చేరేలా పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. పూజారులు, యువత, మేడారం ప్రజలు, పోలీసులు అందరూ ఒక కుటుంబంలా కలిసి పనిచేసి, ఆచార సాంప్రదాయాలను పాటిస్తూ ఒక కుటుంబంలా పని చేసి మహా జాతరను విజయవంతం చేయాలని ఎస్‌పి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క సారలమ్మ పూజారులు, గోవిందరావు, పగిడిద్ద రాజు, పూజారులు ములుగు డిఎస్‌పి రవీందర్, పస్రా సీఐ దయాకర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, అభ్యుదయ యూత్ యువత కన్నెపల్లి యువత, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ అభ్యర్థిపై అధికారులకు ఫిర్యాదు




**ప్రజాపక్షం/వెంకటాపూర్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా వెంకటాపూర్ మండలంలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం వెంకటాపూర్ మండలంలో ఎన్నికలఅధికారులు స్క్రూట్నీ నిర్వహించారు. అయితే మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భాషబోయిన పోషాలు సర్పంచ్ అభ్యర్థి గా తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. నామినేషన్ పత్రాల్లో ఎన్నికల నియమాల ప్రకారం స్థిర ఆస్తుల, నేర చరిత్రను సెల్ఫ్ అఫడవిట్ లో తెలియజేయాల్సి ఉంది. అందుకు విరుద్ధంగా తన నేర చరిత్రనుగోప్యతపాటించాడు.ఆ విషయం తెలుసుకున్న మిగతా సర్పంచ్ అభ్యర్థులు బుధవారం వెంకటాపూర్ మండల కేంద్రం చేరుకొని పోషాలు పై ఆర్వోకి ఫిర్యాదు చేశారు.ఆయన చరిత్రకు సంబంధించిన పూర్తి ఆధారాలను అందజేశారు. అయినప్పటికీ సంబంధిత ఎన్నికల అధికారులు అదేమీ పెద్ద నేరం కాదన్నట్టుగా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నామినేషన్ పత్రంలో తన నేరచరిత్రను పొందుపరచకపోవడం నేరమని, ఎన్నికల సంఘం అధికారులను తప్పుదోవ పట్టించడమేనన్నారు. అయినప్పటికీ ఎన్నికల అధికారులు పోశాలుకు ఎందుకు మద్దతిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. ఆర్వో ఈ అంశంపై చర్యలు తీసుకోకపోతే ఆర్డీవోతో పాటు జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు వారు వెల్లడించారు. అవసరమైతే ఈ అంశంపై కోర్టుకు కూడా పోయేందుకు సిద్ధంగా ఉన్నామని మిగతా సర్పంచ్ అభ్యర్థులు పేర్కొంటున్నారు. వాస్తవానికి ఒక అభ్యర్థి పై ఎలిగేషన్ వచ్చిందంటే మండల స్థాయి అధికారి ఎంపిడిఓతో పాటు స్థానిక ఎస్సై పిలిపించి సదరు అభ్యర్థి నేర చరిత్రకు సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉంటుందని అలాకాకుండా ఎన్నికల అధికారులు సొంత నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు. ఏదేమైనా వెంకటాపూర్ మండలంలో ఈ అంశం బుధవారం చర్చనీయాంశంగా మారింది.

# క్రీడ

# రాయ్‌పూర్‌లో రఫ్ఫాడించారు

**• సఫారీలతో రెండో వన్డేలో టీమిండియా భారీ స్కోరు • సెంచరీలతో కదం తొక్కిన విరాట్, గైక్వాడ్.. • దక్షిణాఫ్రికా లక్ష్యం 359 పరుగులు!**



రాయ్‌పూర్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో టీమిండియా బ్యాట్స్‌మెన్స్ రాణించారు. ముఖ్యంగా రుతురాజ్ గైక్వాడ్, కింగ్ కోహ్లీ సెంచరీలతో కదం దొక్కగా.. చివరలో కెప్టెన్ కేఎల్ రాహుల్ సైతం ధాటిగా బ్యాటింగ్ చేయడంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికాకు 359 పరుగుల టార్గెట్‌ను విధించింది. టాస్ గెలిచిన భారత జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 40 పరుగులు జోడించిన తర్వాత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ (14) అవుట్ అయ్యాడు. ఆ తర్వాత కొద్దిసేపటికే మరో ఓపెనర్ జైస్వాల్ (22) సైతం పెవిలియన్‌కు చేరుకున్నాడు. విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ జోడీ స్కోర్‌ను పరుగులెత్తించారు. రుతురాజ్ గైక్వాడ్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. మరో వికెట్ పడగకుండా జాగ్రత్త పడుతూ పరుగుల వరద పారించారు. ఈ క్రమంలోనే రుతురాజ్ కేవలం 77 బంతుల్లోనే కెరీర్‌లో రెండో సెంచరీని నమోదు చేశాడు. 82 బంతుల్లో 12 ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 105 పరుగులు చేశాడు. మరో ఎండ్‌లో విరాట్ సైతం అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. రాంచీ వన్డేలో సెంచరీతో కదం తొక్కిన విరాట్.. అదే ఫామ్‌తో రాయ్‌పూర్ వన్డేలో చెలరేగాడు. ఈ క్రమంలో వన్డేలో కింగ్ కోహ్లీ 93 బంతుల్లో ఏడు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 102 పరుగులు చేశాడు. రుతురాజ్–విరాట్ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 156 బంతుల్లో 195 పరుగులు చేశాడు. ఇక చివరలో బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కేఎల్ రాహుల్ సైతం ధాటిగా బ్యాటింగ్ చేశాడు. దాంతో టీమిండియా భారీ స్కోర్‌ను చేయగలిగింది. కేఎల్ రాహుల్ 43 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 66 పరుగులతో అజేయంగా నిలిచాడు. కేఎల్ రాహుల్‌కు ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (24) సహకారం అందించాడు. దాంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్‌కు రెండు, బర్గర్, ఎన్గిడికి చెరో వికెట్ దక్కింది. ఇక వన్డేల్లో దక్షిణాఫ్రికాపై భారత్‌కు ఇది రెండో భారీ స్కోర్. 2010లో గ్వాలియర్ వన్డేలో మూడు వికెట్ల నష్టానికి 401 పరుగులు చేసింది.

## మ్యాచ్ మధ్యలో విరాట్ వద్దకు దూసుకువచ్చిన అభిమాని..!



డ్రింక్స్ బ్రేక్ సమయంలో ఓ అభిమాని పిచ్ వరకు వద్దకు పరుగెత్తుకుంటూ వచ్చి.. కింగ్ కోహ్లీ కాళ్లను మొక్కాడు. రాంచీ వన్డేలోనూ ఇలాంటి ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ సెంచరీ చేసిన సమయంలో స్టేడియంలోని విరాట్ కాళ్లపై పడిపోయాడు. తాజాగా రాయ్‌పూర్ వన్డేలోనూ సెక్యూరిటీని తప్పించుకొని వచ్చిన ఓ అభిమాని విరాట్ కాళ్లను మొక్కాడు. అయితే, గ్రౌండ్‌లో భద్రతా వైఫల్యంపై పలువురు విరాట్ అభిమానులు కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు ఆ అభిమాని అదృష్టవంతుడని చెప్పడం విశేషం.

## టీ20 ప్రపంచకప్.. టీమిండియా జెర్సీని ఆవిష్కరించిన రోహిత్ శర్మ

వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్ సందర్భంగా బిసిసిఐ బుధవారం కొత్త జెర్సీని విడుదల చేసింది. దక్షిణాఫ్రికా— భారత్ మధ్య రాయ్‌పూర్ వేదికగా జరుగుతున్న వన్డే మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ తర్వాత టీమిండియా మాజీ కెప్టెన్, ఐసిసి టీ20 ప్రపంచకప్ ప్రచారకర్త రోహిత్ శర్మ టీమిండియా కొత్త జెర్సీని ఆవిష్కరించారు. టీమిండియా రైజింగ్ స్టార్ తిలక్ వర్మ, బిసిసిఐ కార్యదర్శి దేవ్‌జిత్ సైకియా, సంయుక్త కార్యదర్శి ప్రభతేజ్ సింగ్ భాటియా, బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పాల్గొన్నారు. రాయ్‌పూర్‌కు చెందిన దాదాపు వంద మందికిపైగా విద్యార్థులను ఆహ్వానించారు. ఐసిసి మెగా ఈవెంట్ కోసం సిద్ధం చేసిన భారత జెర్సీ లైఫ్ సైజ్ మోడల్‌ను ఆవిష్కరించారు.



# షాక్స్

## చరిత్ర వివరిస్తున్న 'మమ్మీ'!

ఆస్ట్రియా–ఇటలీ సరిహద్దులో ఉన్న ఒట్జల్ ఆల్ప్స్ పర్వత ప్రాంతంలో జర్మనీకి చెందిన ఇద్దరు పర్వతారోహకులు గురిచిన ఒక ఘనీభవించి, మమ్మీగా మారిన మానవ శరీరం కాంస్య యుగం నాటి చరిత్రను వివరిస్తున్నది. ఈ మమ్మీని 'షట్జీ' లేదా 'ఐస్మాన్' అని పిలుస్తున్నారు. 1991లో బయటపడిన ఈ శవం సుమారు 5,300 సంవత్సరాల పూర్వం నాటి మధ్యవయసు వ్యక్తిదని పరిశోధకులు నిర్ధారించారు. అత్యంత చల్లగా ఉన్న వాతావరణం కారణంగా, అతని శరీరం, దుస్తులు, మరియు వాడిన వస్తువులు చెక్కుచెదరలేదు. దీనివల్ల యూరప్‌లో ఆ కాలంలో జీవనం ఎలా ఉందో తెలుసుకోవడానికి అవకాశం లభించింది. అతని ఎత్తు సుమారు 1.60 మీటర్లు (5 అడుగులు 3 ఇంచులు), బరువు సుమారు 50 కిలోలుగా ధ్రువీకరించారు. అతనికి ఆర్థరైటిస్ (కీళ్ల నొప్పులు)



ఉన్నట్లు పరిశోధనలో తెలిసింది. అతని కడుపులో పరాన్నజీవులు ఉన్నట్లు ఆధారాలు దొరికాయి. అదే విధంగా అతని ఆహారంలో ఇబెక్స్ (పర్వత మేక), ఎర్ర జింక మాంసం, ధాన్యాలు ఉన్నాయి. జుట్టులో కాపర్, ఆర్సెనిక్ ఎక్కువగా ఉన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. దీని ఆధారంగా అతను కాపర్ ఉత్పత్తి లేదా కరిగించే పనిలో పాల్గొని ఉంటాడని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. డిఎన్ఎను విశ్లేషించి, అతనిది నలుపు చర్మమని, కళ్లు గోధుమ రంగులో ఉండేవని నిర్ధారించారు. తల వెంట్రుకలు ఎక్కువగా లేనందువల్ల, బట్టతల ఉండవచ్చని కూడా అంటున్నారు. అంతకు ముందు కనుగొన్న చాలా ఆధారాల్లో తెల్లని చర్మం, తేలికపాటి జట్టును గుర్తించగా, ఐస్మాన్ అందుకు భిన్నంగా ఉన్నాడు. అతనిలో అనాటోలియా (ప్రస్తుతం టర్కీ ప్రాంతం) రైతుల వంశపారంపర్య లక్షణాలు ఎక్కువగా ఉన్నాయి. పరిశోధన ప్రకారం, అతను సుమారు 45 సంవత్సరాల వయస్సులో మరణించాడు. అతని ఎడమ భుజంలో ఒక బాణం గాయం ఉంది. దీనివల్ల అతని మరణం ఒక దాడి లేదా హత్య కారణంగా జరిగిందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కానీ ఎవరు, ఎందుకు అతన్ని దాడి చేసారన్న ప్రశ్నకు ఇంకా స్పష్టమైన సమాధానం లభించలేదు. మొత్తం మీద ఈ మమ్మీని పరిశీలించడం ద్వారా కాంస్య యుగంలో మనుషుల ఆరోగ్య పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ వంటి అంశాలపై విలువైన సమాచారం తెలుస్తున్నది. ఐస్మాన్ శరీరం, అతని వస్తువులను ఇటలీలోని బొల్జానో నగరంలోని సౌత్ టేత్ ఆర్కియాజికల్ మ్యూజియంలో భద్రపరిచారు. ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, సాధారణ ప్రజలకు ఆసక్తి కలిగిస్తూ, నిరంతరం పరిశోధనకు అతని శరీరం, వస్తువులు ఉపయోగపడుతున్నాయి.

# చరిత్ర

## సంప్రదాయ ధాన్య గిడ్డంగి 'హొర్రియో'

హొర్రియో అనేది స్పెయిన్ వాయువ్య ప్రాంతాల్లో, ముఖ్యంగా గలీషియా, ఆస్టూరియాస్ తదితర ప్రాంతాల్లో కనిపించే సాంప్రదాయ ధాన్య గిడ్డంగి. ధాన్యం, మక్కజొన్న, ఇతర ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేసేందుకు ప్రత్యేకంగా వీటిని నిర్మిస్తారు. సాధారణంగా నేలపైన గిడ్డంగులను నిర్మిస్తారు. గుంట తవ్వి, గడ్డివేసి ధాన్యాన్ని నిల్వ చేసుకునే 'పాతర' కూడా మనకు తెలుసు. అయితే, హొర్రియోలను నేల మీద కాకుండా, రాతి స్తంభాలపై ఎత్తుగా ఉండేలా కడతారు. రాతి స్తంభాలపై అడ్డంగా నాపరాళ్లను అమరుస్తారు. పురుగులు, ఎలుకలు లోనికి రాకుండా ఈ జాగ్రత్తలు తీసుకుంటారు. హొర్రియో గోడలను పూర్తిగా మూసివేయరు. గాలి, వెలుతురు వచ్చేలా మధ్యలో స్వల్ప ఖాళీలను ఉంచుతారు. అందుకే, గిడ్డంగిలో ఎప్పటికప్పుడు గాలి ప్రవహిస్తూ ఉంటుంది. ఈ విధానం వలన ధాన్యం తేమతో పాడవకుండా, చెడిపోకుండా నిల్వ ఉంచడం సాధ్యమవుతుంది. మొదట్లో ఇవి పూర్తిగా ఉపయోగకరమైన అవసరాల కోసం మాత్రమే కట్టబడ్డాయి. కానీ కాలక్రమేణా వీటిని మతపరమై అలంకారాలతో, శిల్పాలతో అలంకరించడం మొదలైంది. అందువల్ల ఇవి కేవలం గిడ్డంగులు కాకుండా, స్పెయిన్ గ్రామీణ శిల్పకళా సంపదకు ప్రతీకలుగా నిలుస్తాయి. హొర్రియో అంటే స్పెయిన్ గ్రామీణ సంస్కృతికి ప్రతిరూపం.



## ఇన్కా నాగరికత ఆనవాళ్లు..

పెరూ దేశంలోని పవిత్ర లోయలోని ఒల్లంతయ్‌టాంబో కోట ఇన్కా నాగరికతకు నిదర్శనం. అక్కడి నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక కళలు నాటి సాంకేతిక విజ్ఞానానికి, నాగరికతకు ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. అక్కడ కనిపించే ఎత్తైన స్థూపాకార పంట స్థలాలు ఎక్కువగా వ్యవసాయానికి ఉపయోగించేవారు. అయితే, క్లైమేట్ కంట్రోల్ వ్యవస్థగా కూడా పనిచేసేవి. వీటివల్ల వేర్వేరు వాతావరణాలు ఏర్పడి, అనేక రకాల పంటలను సాగు చేసుకునే అవకాశం ఇక్కడని ఇన్కాలు కనుగొన్నారు. ఒల్లంతయ్‌టాంబోలోని ఔన్నత్యమైన రాళ్ల నిర్మాణం నీటి పారుదల, నిల్వ వ్యవస్థలను శాస్త్రీయంగా నియంత్రించేది. ఇది కేవలం వ్యవసాయ క్షేత్రం మాత్రమే కాకుండా, రాజరిక ఆస్థానంగా, ప్రార్థనా కేంద్రంగా కూడా ఉండేది. అంతేగాక, శత్రువుల చొరబాట్లను అడ్డుకునే కుడ్యాలుగా కూడా పనిచేసేది. ఇక్కడి నిర్మాణాల్లోని ఖచ్చితమైన పట్టణ విన్యాసం, అద్భుత కట్టడాలు, పొలాల నిటారుగా విస్తరణ తదితరాలను చూస్తుంటే, ఇన్కా ప్రజలు శాస్త్రజ్ఞానాన్ని, ప్రకృతిని, ఆధ్యాత్మిక భావాలను అద్భుతంగా సమన్వయం చేసినట్టు స్పష్టమవుతుంది. ఒల్లంతయ్‌టాంబోను మతపరమైన అంశాలకు ముడిపెట్టడం సమంజసం కాదు. ఎందుకంటే, ఇది శాస్త్రీయంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకత కలిగిన స్థలంగా కూ డా ఖ్యాతిగాంచింది. క్రీస్తుశకం 1400 నుంచి 1533 వరకు కొనసాగిన ఇన్కా సామ్రాజ్యం, నాటి నాగరికతకు సంబంధించి, ఇప్పటికీ అత్యంత సంరక్షితంగా ఉన్న స్థలాలలో ఇది ఒకటి. ఇక్కడి రాతిబండల నిర్మాణం, క్లిష్టమైన సాగు వ్యవస్థ, పూజా మందిరాలు, రాజ ఆస్థానాలన్నీ అప్పటి నాగరికత ప్రగతికి స్పష్టం చేసే సాక్ష్యాలే. ఆ కమనీయ నిర్మాణంతో కూడిన ఒల్లంతయ్‌టాంబో ఇవాళ కూడా పరిపూర్ణంగా శాస్త్రాన్ని, ప్రకృతిని, ఆధ్యాత్మికతను మిళితం చేసిన మహనీయ నాగరికత ప్రతీకగా నిలుస్తోంది.



# ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలి

### సిఎంకు వినతిపత్రం అందించనున్న జిల్లా సమితి




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం సిఎం రేవంత్‌రెడ్డికు అందించనున్నట్లు బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిని, ఆదిలాబాద్ మున్సిపాలిటీని కార్పొరేషన్ పరిధిలోకి చేర్చి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వేలైన్ ప్రారంభమైతే ప్రజలకు 200 కిలోమీటర్ల ప్రయాణం తగ్గుతుందని, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును కూడా తక్షణం అమలు చేయాలని తెలిపారు. జిల్లాలో పోడు భూముల సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి కనీసం రూ.1000 కోట్లు కేటాయింపులతో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు సిపిఐ జిల్లా సమితి గురువారం ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం అందజేయనున్నట్లు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సమావేశంలో సిపిఐ నాయకులు కుంటాల రాములు, షేక్ పాషా, అరుణ్‌కుమార్, షేక్ సలీం, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానికులకే 80 శాతం ఉద్యోగాలు

### ఆర్‌కె – 4 గడ్డ ప్రాంతాల బాధితులకు న్యాయం

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ :** ఓపెన్ కాస్ట్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు పునరావాసం కల్పించి స్థానికులకే 80 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్ ఆర్కేపి ఓసి వద్ద బుధవారం నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓపెన్ కాస్ట్ ఫస్ట్ ఫేజ్ సమయంలో రామకృష్ణాపూర్ శాంతినగర్, ఆర్‌కె – 4 గడ్డ ప్రాంతాల కాలనీవాసులకు యాజమాన్యం అన్యాయం చేసిందని విమర్శించారు. ఎన్నో ఉద్యమాలు చేసినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, ఇప్పుడు ఆ పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం సిపిఐ పట్టణ అధ్యక్షులు మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఓసి దుమ్ము, ధూళితో ప్రజలు అనారోగ్యానికి గురయ్యారని, గతంలో పిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని, ప్రతినెల హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. ఓసి ప్రభావిత ప్రాంతాల్లోని అమరావాది, దొరగారిపల్లి చెరువులలో పూడికతీత పనులు చేపట్టాలని, సింగరేణి నిధుల ద్వారా తాగు, సాగునీరు, వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సబ్‌కలెక్టర్ చంద్రయ్య, రాష్ట్ర కాలుష్య నివారణ మండలి అధికారి లక్ష్మణ్ ప్రసాద్, సింగరేణి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాటాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

### కార్మికుల వేతనాలు పెంచాలని

### 'రిమ్స్' ఎదుట ధర్నా




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు ఆగవని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ స్పష్టం చేశారు. బుధవారం రిమ్స్ ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీసం 26వేల రూపాయల వేతనం అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఒక నెల వేతనం, ఐదు నెలల పిఎఫ్, ఈఎస్ఐలను రేపటి సాయంత్రం లోగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని అన్నారు. ఐహెచ్ఎఫ్ఎంఎస్ ద్వారా వెంటనే కొత్త టెండర్లు పిలిచి రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచి, ప్రమోషన్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డిసెంబర్ 5న రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులు విధు లు బహిష్కరించి హైదరాబాద్‌లోని మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం వద్ద భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు డొగ్రే చందు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి ముజీబ్, రిమ్, సూపర్ స్పెషాలిటీ బ్రాంచ్ ప్రతినిధులు, కార్మికులు జి సంగీత, ఎండి ఖాసీం, నల్ల శివన్న, పెందుర్ దిలీప్, శ్రీను, సర్జబాయ్, పద్మ, దాసు(దత్తాత్రి), ఫెయిజ్, డి లక్ష్మి, డేవిడ్, రవి, రమేష్, ఆవేశ్‌ఖాన్, ఆఫ్నన్, పి.నవీన్, జి రాకేష్, అలీం, సైఫ్‌ఖాన్, జి రజనీకాంత్, జక్కుల రాము, నర్సింగ్, డి. కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సమష్టి కృషితో విజయం



**ప్రజాపక్షం/మధిర :** సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో సమష్టి కృషితో విజయం కైవసం చేసుకోవటానికి సిపిఐ, కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ పిలుపునిచ్చారు. బుధవారం మధిర మండలం పరిధిలోని మల్లవరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణిని కాంగ్రెస్ పార్టీ బలపరిచినట్లు ఉమ్మడి సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ మల్లారంలో సిపిఐ విజయానికి కాంగ్రెస్, సిపిఐ ప్రతి కార్యకర్త ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో కర్నాటి రామారావు, విజయ్, తన్నీరు, రామకృష్ణ, కరివేద దుర్గభవాని, కరివేద రాంబాబు, పరుచూరి రాము, వెంకటేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వరరావు, మడుపల్లి లక్ష్మణ్, కొంగర మురళీ తదితరులు పాల్గొన్నారు.

# మహమ్మదాబాద్ సర్పంచ్ స్థానానికి సిపిఐ అభ్యర్థిగా అంజయ్య నామినేషన్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సంస్థాన్ నారాయణపురం మండలంలోని మహమ్మదాబాద్ గ్రామపంచాయతీ సిపిఐ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా ముత్యాల అంజయ్య బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం ముత్యాల అంజయ్య మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజాసేవే తన లక్ష్యం అన్నారు. విద్యా, వైద్య మౌలిక వసతుల సేవలను అందించడం కర్తవ్యంగా భావిస్తున్నామన్నారు. మండలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ క్లస్టర్ కేంద్రాలలో సర్పంచ్ నామినేషన్‌లు 14, వార్డు మెంబర్లు 17 నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు.




# 'పడమటిపల్లి' సర్పంచ్ సిపిఐ అభ్యర్థిగా రంగారెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పడమటిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి పల్లా రంగారెడ్డి(రంగన్న)ని శాఖ సమావేశంలో బుధవారం ఎంపిక చేశారు. పల్లా రంగారెడ్డి ప్రస్తుతం సిపిఐ పడమటి పల్లి గ్రామశాఖ కార్యదర్శిగా, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడిగా, రైతు సంఘం జిల్లా నాయకుడిగా పనిచేస్తూ పార్టీ నిర్వహించే కార్యక్రమాల్లో, ఆందోళనల్లో పాల్గొంటూ పార్టీ శ్రేణులను ఉత్సాహ పరుస్తున్నారు. ఈసందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ సర్పంచ్ గా ప్రజలు కమ్యూనిస్టులను గెలిపించి గ్రామ అభివృద్ధికి అవకాశం కల్పించాలన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనదని రంగన్న గ్రామ ప్రజలకు తెలిపారు.



# కమ్యూనిస్టులతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

### సిపిఐ జనగాం జిల్లా కార్యదర్శి రాజారెడ్డి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని కంచనపల్లి గ్రామంలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా పనుల డానియేల్‌ను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని కంచనపల్లి గ్రామంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కావటి యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాజారెడ్డి హాజరై మాట్లాడుతూ కంచనపల్లి గ్రామంలో గతంలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నపుడు చేసిన అభివృద్ధి తప్ప కంచనపల్లి ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, గొంగళ్ల మహేందర్, సుధాకర్, ఏలియా, మహేందర్, దయాకర్ పాల్గొన్నారు.



# 'స్థానిక'లో సిపిఐ అభ్యర్థుల ఏకగ్రీవాలు







### కొట్టాల సర్పంచ్‌గా లింగయ్య ఏకగ్రీవం

**ప్రజాపక్షం/మర్రిగూడ:** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో జరుగుతున్న గ్రామ పంచాయతీల ఎన్నికలో కొట్టాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి కల్లేట్ల లింగయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిదంగా రాంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో 9వ వార్డు సభ్యుడిగా ఎరుకల నిరంజన్ గౌడ్, 6వ వార్డు సిపిఐ అభ్యర్థి బుర్ర రాములమ్మలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామాభివృద్ధికి నిరంతర పాటుపడతామన్నారు.

### రెండు వార్డు మెంబర్లుగా సిపిఐ అభ్యర్థుల ఏకగ్రీవ ఎన్నిక

**మునుగోడు:** మండలంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల నామినేషన్‌ల ఉపసవరణ బుధవారం ముగిసింది. ఎన్నికలో మండలంలోని చలిమెడ గ్రామ 8వ వార్డు సిపిఐకి చెందిన నెల్లికంటి కృష్ణవేణిని, కచలాపురం గ్రామ 8వ వార్డుగా సిపిఐ చెందిన చిరగొని స్వప్నలు ఏకగ్రీవంగా ఎన్నికైన్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవం గా ఎన్నికైన వార్డ్ మెంబర్లు మాట్లాడుతూ వార్డుల అభివృద్ధి కోసం పనిచేస్తామని తెలిపారు.



### ముఖమామిడి 10వ వార్డుకు...

**ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా ములకలపల్లి మండలంలోని ముఖమామిడి గ్రామ పంచాయితీలో గల 10 వార్డుకు నామినేషన్ కేవలం ఒక్క అభ్యర్థి కుర్సం సీతమ్మ మాత్రమే నామినేషన్ వేశారు. సీతమ్మ సిపిఐ అభ్యర్థిగా ఉన్నారు. దీంతో అధికారులు లాంఛనంగా ధ్రువీకరణ చెయ్యాల్సి ఉంది.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయం: కూచాడి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరిరావు అన్నారు.సోన్ మండలం పాక్పట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు రమేష్ రెడ్డి బీజేపీ కి రాజీనామా చేసి హస్తం పార్టీలో చేరుగా శ్రీహరి రావు కండువాలు కప్పి ఆహ్వానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## ఆరు సర్పంచ్‌లు, యాభై వార్డు సభ్యులు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/పాపన్నపేట:**మండల పరిధిలో 40 గ్రామ పంచాయతీలు, 346 వార్డు సభ్యులకు ఎన్నికకు నామినేషన్లు దాఖలు కాగా బుధవారం నాడు సభ్యుల ఉపసంహరణ ముగియడంతో ఆరు సర్పంచులు 50 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మల్లంపేటలో పుట్టి పద్మ రమేష్, కందిపల్లిలో పుట్టి భాగ్య, లక్ష్మి నగర్ లో కన్నె గంటి విజయదుర్గా నాని, యూసుపేటలో అనిత నరేందర్ రెడ్డి, అంబ్రియాతాండలో లునావత్ కిషన్, నామ్మాపూర్ లో రణజి గారి బేతమ్మ దశరథ్ లు కు పోటీదారులు ఉపసంహరించుకోవడంతో ఆరు సర్పంచులు ఏకగ్రీవమయ్యాయి. వీటితో పాటు ఆరు గ్రామ పంచాయతీలలో 50 వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవమయ్యాయి. 34 గ్రామ పంచాయతీలకి, 296 వార్డు సభ్యులకు ఎన్నికలు జరగనున్నట్లు అధికారులు వెల్లడించారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. అభ్యర్థులకు గుర్తులు రావడంతో గ్రామాలలో ప్రచారం ఊపందుకుంది.

## ఎసిబివలలో వెల్దుర్తి సర్వేయర్




**ప్రజాపక్షం/వెల్దుర్తి :**ఓ రైతు తన వ్యవసాయ భూమిని సర్వే చేయాలని కోరగా భూమిని రెండుసార్లు డిజిటల్ సర్వే చేయాల్సి ఉంటుందని ఇందుకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా సంబంధిత రైతు ఎసిబిని ఆశ్రయించగా డబ్బులు అడిగిన సర్వేయర్‌నుఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధ వారం చోటుచేసుకుంది. మెదక్ రేంజ్ ఎసిబి డిఎస్పి సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం వెల్దుర్తి కి చెందిన ఓ రైతు తనకు సంబంధించిన ఎకరం 10 గుంటల భూమిని సర్వే చేయాలని కోరగా ఇందుకుగాను రూ 20, 000 ఇవ్వాలని సర్వేయర్ డిమాండ్ చేశారన్నారు. దీంతో అక్టోబర్ 26న రైతు ఎసిబిఅధికారులను సంప్రదించాలని దీంతో తాము పలుమార్లు వి చారణ చేయగా డబ్బులు అడిగిన విషయం వాస్తవమేనని తెలుసుకొని బుధవారం వెల్దుర్తి శివారులోని వ్యవసాయ పొలం వద్ద సర్వే చేస్తున్న శ్రీనివాస్ ఆ రైతునుండి ట్రైన్ సర్వేయర్ రూ .20 వేలు తీసుకుంటుండగా పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టడం జరిగిందన్నారు. డబ్బులు అడిగిన సర్వే శ్రీనివాస్ తో పాటు డబ్బులు తీసుకున్న ట్రైనింగ్ సర్వేయర్ శరత్ కుమార్ గౌడ్ లపై కేసు నమోదు చేసినట్లు ఎసిబి డిఎస్పి సుదర్శన్ తెలిపారు.

## ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు




**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ మండలంలోని మల్లూరు గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన జంగం మహేష్ అనే వ్యక్తి ప్రభుత్వ స్థలంలో బోరుబావిని పూడ్చివేసి మల్లూరు గ్రామానికి చెందిన జంగం మహేష్ అట్టి స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాడని, అధికారి స్పందించి తాగునీటి కొరకు ఉపయోగిస్తున్న అట్టి బోరుబావిని యథావిధిగా కొనసాగిస్తూ ప్రభుత్వ భూమిని కాపాడాలని వారు వినతిపత్రంలో కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామస్థులు ఉన్నారు.

## 'ఏసియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో సిగ రవీందర్‌కు స్థానం




**ప్రజాపక్షం / నిజామాబాద్ :** సారంగపూర్‌లోని తెలంగాణ విశ్వవిద్యాలయం, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్. రవీందర్ కి ఏసియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. అత్యధిక ఈసర్టిఫికెట్లను పొందిన వ్యక్తిగా గుర్తించి ఆయన పేరు కు ఏసియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదు చేసి చోటు కల్పించింది. ఆ సంస్థ నుంచి ఈ సర్టిఫికెట్ అందింది .డాక్టర్ రవీందర్ వివిధ అంతర్జాతీయ, జాతీయ,రాష్ట్రీయ, సెమినార్లు, వెబినార్లు, అకాడమిక్ ఈవెంట్లు, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలలో 150 కంటే అత్యధిక ఈ సర్టిఫికెట్ పొందడం ద్వారా ఒక విశేషమైన విద్యాసాధనను సాధించారు. రెండు దశాబ్దాలకు పైగా అంకితమైన బోధన అనుభవం ద్వారా డాక్టర్ రవీందర్ విద్యా సమాజానికి తోడ్పడ్డారు. వారి మార్గదర్శకత్వంలో ఎంతో మంది విద్యార్థులు విజయవంతంగా ఉపాధ్యాయులు గాను, విద్యావేత్తలుగా మారారు. నిరంతర అభ్యసనం, వృత్తిపరమైన అభివృద్ధి, నిబద్ధత విద్యారంగంలో ఒక మైలురాయిని నెలకొల్పింది. ఈ అసాధారణ విజయమే ప్రపంచ రికార్డ్ గా గుర్తింపు పొందింది. డాక్టర్ రవీందర్ కి ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నందు గుర్తింపు పొందడం పట్ల ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ టి. మృణాలిని, తెలంగాణ విశ్వవిద్యాలయం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ బి.ఓ. ఎస్. మరియు నేషనల్ ఇన్స్టిట్యూషన ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ శంకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి సాయిలు, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు,సహచర అధ్యాపకులు డాక్టర్ ఆర్. కరుణాకర్, డాక్టర్ వి. శ్రీనివాస్, సువర్చల, పోలపల్లి శ్రీకాంత్, హరిత, గణేష్ నరేందర్, డిపార్ట్మెంట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రామలింగం, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

## సైబర్ నేరాలపై జాగ్రత్త



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**మొబైల్ ఫోన్ వినియోగం వల్ల మంచి చెడు ఉన్నాయని మంచి వాటిని వినియోగించుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సైబర్ నేరస్తుల వలలో చిక్కకుండా జాగ్రత్త ఉండాలని ఎస్ఐ శంకర్ బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలకు విద్యార్థులు ప్రజలు దూరంగా ఉండాలని అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని బహుమతులు వచ్చాయని ఫోన్ కాల్స్ ద్వారా మీ బయోడేటా అడుగుతే చెప్పరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలి




గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు ఆయేషా మస్రత్ ఖానం..



**ప్రజాపక్షం/నిర్మల్ :**సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు.బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ ఎన్నిక విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ,మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకోని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు.శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ,ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని వివరించారు.

**పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం :జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ఎన్నికకు ముందు,ఎన్నిక సమయంలో,ఎన్నిక తర్వాత,ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు.సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలను పై అధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు.మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు.ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు.రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు.ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు.పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధుల పై అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్,డీఈవో భోజన్న,ఎల్డీఎం రామ్ గోపాల్,శిక్షకులు,మైక్రో అబ్జర్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

**రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి**

నిర్మల్ పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మత్తుల పనులు నాణ్యమైన,పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.బుధవారం పట్టణంలోని బస్టాండ్,అంబేద్కర్ చౌక్ సమీపంలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మత్తుల పనులను కలెక్టర పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పట్టణంలో గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులను సకాలంలో పూర్తి చేయాలని అన్నారు.గుంతల రోడ్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని వివరించారు.మరమ్మత్తుల పనులన్నింటినీ నాణ్యవంతంగా చేయాలని పేర్కొన్నారు.మున్సిపల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు.వర్షాకాలం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని తెలిపారు.మినీ ట్యాంక్ బండ్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఫుట్ పాత కు మరమ్మత్తులు చేయాలని తెలిపారు.పట్టణంలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలని అన్నారు.రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు.ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు కలెక్టర్ హామీ ఇచ్చారు.పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇటీవల నిర్మాణం పూర్తయిన మినీ ట్యాంక్ బండ్ పార్కును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,మున్సిపల కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,టౌన్ ప్లానింగ్ అధికారి హరిభువన్,మున్సిపల్ అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నాకు తరలి వెళ్లిన జర్నలిస్టులు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టియుడబ్ల్యూజే (ఐజెయు) యూనియన్ హైదరాబాద్ లో ని సమాచార కమిషనర్ కార్యాలయం ముందు మహాధర్నకు పిలుపునిచ్చింది. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు బుధవారం పాపన్నపేట మండల జర్నలిస్టులు హైదరాబాద్ ధర్నాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మిన్పూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జర్నలిస్టు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మోహన్ రాజ్, టియుడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు సుమన్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నవాత్ బాలకిషన్, కల్లెటి సంగమేశ్వర్, జర్నలిస్టులు నాగరాజ్, శ్యామ్, మల్లేశం, బాల్ రాజు, అంతు శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు..

3,500 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



**ప్రజాపక్షం / వేమనపల్లి/ బెల్లంపల్లి:**వేమనపల్లి మండలం బుయ్యారం గ్రామంలో పోలీస్, ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించి భారీ ఎత్తున బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో 21 చోట్ల గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు 3,500 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి పారబోశారు. అనంతరం సిఐ బన్సిలాల్ గ్రామస్తులతో మాట్లాడుతూ గుడుంబా వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. వేమనపల్లి మండలాన్ని గుడుంబా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎవరైనా గుడుంబా అమ్మినా, తయారు చేసినా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. యువత నీల్వాయి పోలీసులకు అండగా ఉండి గుడుంబా నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల సేవలో రోటరీ క్లబ్...

నిజామాబాద్ రోటరీ సర్వీసెస్ ట్రస్ట్‌కు తన ట్రస్ట్ ద్వారా రూ. 2 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :**రోటరీ క్లబ్ చేస్తున్న సేవ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు తీసుకొని వస్తుందని, దివ్యాంగులకు కృత్రిమ కాలును అమర్చి వారిలో నూతన ఉత్తేజాన్ని కల్పిస్తున్న రోటరీ ట్రస్ట్ వారి సేవ అభినందనీయమని నిజామాబాద్ అర్బన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా అన్నారు. బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జగిత్యాల సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో నిజామాబాద్ రోటరీ సర్వీసెస్ ట్రస్ట్ వారిసహకారంతో ఉచిత కృత్రిమ కాలు పంపిణీ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథిగా పాల్గొని దివ్యాంగులకు కృత్రిమ కాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోటరీ క్లబ్ ట్రస్ట్ వారు 2009 నుండి సేవ కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్టు ద్వారా దివ్యాంగులకు కృత్రిమ కాలును అమర్చి వారిలో నూతన ఉత్తేజాన్ని కల్పిస్తున్నందుకు అభినందనీయమని అన్నారు. దివ్యాంగులకు మానవతా దృక్పథంతో అందరు సహాయ సహకారాలు అందించాలన్నారు. నిజామాబా ద్ రోటరీ సర్వీసెస్ ట్రస్ట్‌కు ప్రతి సంవత్సరం తన ట్రస్ట్ ద్వారా రూ. రెండు లక్షలు ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించా రు. దివ్యాంగుల కొరకు తన ట్రస్ట్ ద్వారా ఎటువంటి సహాయ సహకారాలైన అందించడానికి ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌సిటి ఛైర్మన్ ఆకుల అశోక్, అధ్యక్షులు శ్యాం అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, కోశాధికారి జుగల్ రాజు, బిజెపి నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## 191 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :**మొదటి విడత స్థానిక ఎలక్షన్లకు సంబంధించి శిక్షణ కార్యక్రమానికి హాజరు కాని 191 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య షోకాజ్ నోటీసు ల జారీ చేశారు. వీరందరూ కూడా తేది 05.12.2025 రో జు మీకు సంబందించిన డివిజనల్ లేవల్ శిక్షణ కేంద్రంలో శిక్షణ కార్యక్రమానికి తప్పకుండ హాజరు కాగలరని ,హాజరు కాని యెడల ఎన్నికల నియమావళి ప్రకారం తగు చర్యలు తీసుకోబడునని తెలిపారు. సంగారెడ్డి డివిజన్‌లో తారాప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఉదయం 10 గంటలకు, అందోల్ డివిజన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జోగిపే ట, యందు ఉదయం 10 గంటలకు, పటాన్‌చెరు డివిజన్ పరిధిలో డాక్టర్ అబుల్ కాలామ్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ప్ర భుత్వ డి గ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు ,నారాయ ణ ఖేడ్ డి విజన్ పరిధిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 1 0 గంటలకు ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపా రు.

## నామినేషన్ పత్రాల పరిశీలనలో జాగ్రత్త ...



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/కన్నెపల్లి/ బెల్లంపల్లి:**రాష్ట్రంలో జరుగుతున్న 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నామినేషన్ పత్రాల పరిశీలనలో అధికారులు అత్యంత జాగ్రత్త వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం కన్నెపల్లి మండలంలోని జనకాపూర్ గ్రామపంచాయతీలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌లతో కలిసి ఆయన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని ఫలితాలు ప్రకటించే వరకు నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, పోలింగ్ ఏర్పాట్లు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అర్హులు, అనర్హుల జాబితాను పూర్తి వివరాలతో రూపొందించాలని, ఎన్నికల గుర్తుల కేటాయింపులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను తహసీల్దార్ రామ్ చందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం దీనిని నిర్మిస్తోందని, పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలకు ఇక స్వస్తి

'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో ఆరు వారాల ప్రత్యేక కార్యక్రమాలు: ఎస్పి



**ప్రజాపక్షం/ సంగారెడ్డి:** సైబర్ నేరాలకు ఇక స్వస్తి " ఫ్రాడ్‌కా ఫుల్ స్టాప్ పేరుతో ఆరు వారాల ప్రత్యేక కార్యక్రమాలు, సైబర్ జాగ్రుకత దివాస్ లోభాగాంగా జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాహన ఒక్కటే ముఖ్యమైన మార్గమని జిల్లా ఎస్పితెలిపారు. ఈ సదర్భంగా ఎస్పిమాట్లాడుతూ సైబర్ నేరాలకు నియంత్రించడానికి ప్రజలలో సైబర్ భద్రతపై అవగాహన పెంచడానికి జిల్లా వ్యాప్తంగా సైబర్ జాగ్రుకత దివస్ కార్యక్రమాలనునిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ పేరుతో ఆరు వారాల ప్రత్యేక కార్యాచరణను రూపిందించడం జరిగిందని తెలిపారు.


**6-వారాల కార్యాచరణ**

మొదటి వారం సైబర్ సాదన :సైబర్ హెల్ప్ లైన్ 1930 ప్రాముఖ్యత సైబర్ మోసానికి గురైనట్లయితే గోల్డెన్ హవర్ మొదటి గంట లోపు ( వీలైనంత తొందరగా) 1930 కాల్ చేసి సమాచారం అందించాలి.
రెండవ వారం :స్కామ్ సి బచావ్ .డిజిటల్ అరెస్ట్ లైంగిక బ్లాక్ మెయిల్ సైబర్ ఫ్లినరీ
మూడవ వారం:పైసా పైలమ్ :బిజినెస్ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ (స్టాక్ టెస్ట్ ,టాస్క్ టెస్ట్ ) లోన్ ఫ్రాడ్ గిఫ్ట్ అడ్వటైజ మెంట్ ఫ్రాడ్ రివార్డ్స్ పాయింట్‌ఫ్లాడ్
నాల్గవ వారం : హార్ స్కీన్ సురక్షిత :మొబైల్ కంప్యూటర్ భద్రత హాకింగ్ ,ఫేక్ యాప్, ఎపికె లింక్ ,బెట్టింగ్, గేమింగ్
ఐదవ వారం : మేరా లాగ్ ఇన్ మేరా రూల్ సురక్షిత పాస్ వర్డ్‌లు ,లాగిన్ నియమాలు
ఆరవ వారం: మహిళల రక్షణ పిల్లల సంరక్షణ డేటింగ్ యాప్, సైబర్ బుల్లింగ్ సైబర్ ఫ్లాకింగ్ మాట్రిమోనియాల ఫ్రాడ్స్ లైడ్స్ చైల్డ్ సుక్యుయల్ ఫ్రాడ్ ఇలాంటి అంశాలతో ప్రజల ముం దుకు వెళ్లి సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే బుధవారం రోజు సంగారెడ్డి పట్టణంలోని ఇస్టా కళాశాలలో సైబర్ సారధి ,సైబర్ హెల్ప్ లైన్ 1930 గురించి అవగాహన కల్పిస్తూ సైబర్ మోసానికి గురైనట్లయితే గోల్డెన్ హవార్‌అనగా వీలైనంత తొందరగా 1930 కాల్‌చేసి సమాచారం అందించాలని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఎన్నికలవేళ టిఆర్ఎస్‌కు భారీ షాక్



**ప్రజాపక్షం/ముత్తారం :** ఎన్నికలవేళ బిఆర్ఎస్ పార్టీ కి భారీ షాక్ తగిలింది. పెద్దపల్లి జిల్లాముత్తారం మండలంలోని ఓడేడు బిఆర్ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఓడేడు మాజీ ఎంపీటీసీ శీలం తిరుపతి, తోపాటు దాసరి పవన్ గౌడ్ బుధవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరుపతి, దాసరి పవన్ గౌడ్ కి కండువా కప్పి మంత్రి శ్రీధర్ బాబు పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ ప్రకటించిన అభ్యర్థిని అధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ యాదగిరి రావు, శ్రీనివాస్, చంద్రయ్య, సత్యనారాయణరావు, కర్ణాకర్‌రావు తోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోతారం, పారుపల్లి చెరువును పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామ శివారులో ఉన్న పెద్ద చెరువును బుధవారం జాయింట్ కలెక్టర్ అధికారులు బృందంతో కలిసి పరిశీలించారు.ప్రజల జీవనాధారాల మెరుగుదలకు దేశంలో కుదటపడుతున్న జీవరాసులను పెంపొందించేందుకు సుప్రింకోర్టు ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు పారుపల్లి గ్రామ శివారులోని చెరువును ఎంపిక చేయడం జరిగిందని జీవనాధారాలతో పాటు జీవరాసుల త్రాగునీరు వసతుల ఇబ్బందులు కలగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరువులను పునరావృతం చేయడానికి పనులు చేపట్టారని దాసరి వేణు తెలిపారు.పరిశీలన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, డిఎఫ్ఎ శివయ్య, ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి,ఈఈ బలరామయ్య,డిఇ రాజేంద్రనాథ్,పి.ఆర్ఎఈ జగదీష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** నల్లా సర్వే నేపథ్యంలో ప్రజల నుంచి వస్తున్న సందేహాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఇన్ వార్డు ఆవరణలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కమిషనర్ ప్రఫూల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అభివృద్ధి పనులు, అమృత్, స్వచ్ఛభారత్ మిషన్, అమృత్ మిత్ర, నల్లా కనెక్షన్ సర్వే, విద్యుత్ మీటర్ సర్వే తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నగరంలో చేపట్టిన స్మార్ట్ సిటీ, వివిధ గ్రాంట్ల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. డివిజన్ల వారీగా జరుగుతున్న నల్లా కనెక్షన్ సర్వేను మరింత వేగవంతం చేయాలన్నారు. సర్వేపై ప్రజలకు వచ్చే సందేహాలను నివృత్తి చేసేందుకు ఏర్పాటు చేసే ప్రత్యేక కౌంటర్‌కు డిఇ స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలన్నారు. ఆయన పర్యవేక్షణలో ఏఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు తమ సందేహాలు, సమస్యలను ఈ కౌంటర్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఇ రాజ్ కుమార్, ఇఇలు సంజీవ్ కుమార్, శివానందం, దేవేందర్, లచ్చిరెడ్డి, అరుణ్, వెంకటేశ్వర్లు, ఓం ప్రకాష్, ఏఇలు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

నాలుగు పంచాయతీలు ఏకగ్రీవం



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్ మండలంలో గ్రామ పంచాయితీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ముగియడంతో పోటీలో నిలిచిన అభ్యర్థులను ఎన్నికల అధికారులు ప్రకటించారు. 25 గ్రామపంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల కోసం దాఖలైన నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారంతో ముగియడంతో పోటీలో నిలిచిన అభ్యర్థులను మండల ఎన్నికల అధికారులు ప్రకటించి ఎన్నికల గుర్తులను కేటాయించారు. మండలంలో కొండాపూర్, పలుగు గడ్డ, అనంతసాగర్, వెంకటాపూర్(బిజి) పంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో నాలుగు గ్రామపంచాయితీలు ఏకగ్రీవమైనట్లుగా అధికారులు ప్రకటించారు. అలాగే మాందాపూర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కాగా 8 వార్డులు ఏకగ్రీవం కాగా, సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు రాగ సర్పంచ్ స్థానానికి పోటీ ఏర్పడింది. అలాగే మండలంలో 20 గ్రామపంచాయతీలలో త్రీ ముఖ పోటీ నెలకొన్నట్లు అధికారులు తెలిపారు.

## పనులు ప్రారంభించకుంటే నోటీసు, బ్లాక్‌లిస్టు



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో వేగంగా చేపట్టాలని ఆయా కాంట్రాక్టర్లను నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. టెండర్ పొందిన పనులన్ని సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనులు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతే అనవసర కాలయాపన చేయకుండా సత్వర పరిష్కారానికై తన దృష్టికి తీసుకురావాలన్నారు. సకాలంలో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఒకవేళ నోటీసులను నిర్లక్ష్యం చేస్తే సదరు కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక ఈ.ఈ. పీవీ.రామన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరుపట్ల ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే ప్రతి విద్యార్థి పట్ల దృష్టి సారించి కళాశాలకు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని నోడల్ అధికారి బొప్పా రాతి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలను సందర్శించి విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా కళాశాలకు హాజరై మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని, కళాశాల అధ్యాపకులు విద్యార్థుల హాజరు శాతం పెంచేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. వీరి వెంట కళాశాల ప్రిన్సిపల్ బండి వెంకటేశ్వర్లు, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్711 రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంచర్ల రాజేష్ , అధ్యాపక బృందం తదితరులున్నారు.

# దివ్యాంగులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ

ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్

ఉన్నత చదువులను ప్రోత్సహిస్తాం : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**ప్రజాపక్షం/కరీంనగర్:** దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, వారు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించిందన్నారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని, నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా బోధన అందిస్తామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. హైదరాబాద్‌లో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు మెరుగైన వైద్యం, చదువు బాధ్యతలు చూస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు తమలోని దివ్య దృష్టిని వృధా చేయవద్దని, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు.
దివ్యాంగుల శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ దివ్యాంగులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, యూపిఎస్‌సి వంటి ఉన్నత ఉద్యోగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సిఎం ఆవిష్కరించారని గుర్తు చేశారు. సైన్ లాంగ్వేజ్‌లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని ఆమె అభినందించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి, జిల్లాలో డిసిబిసి భవన నిర్మాణానికి కృషి చేస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ, స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని దివ్యాంగుల కోపరేటివ్ చైర్మన్ వీరయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్‌ను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభ్యంతరాల పరిష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూ సేకరణ: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అభ్యంతరాల పరిష్కారం తర్వాతే బైపాస్ రోడ్డు భూ సేకరణ జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామంలో పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ నిమిత్తం చేపట్టిన ఎంజాయ్మెంట్ సర్వే ప్రక్రియను పరిశీలించి అనంతరం మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం బైపాస్ రోడ్డు మంజూరు చేసిందని, బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ నిమిత్తం ఎంజాయ్ మెంట్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుల అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరించిన తర్వాతే భూ సేకరణ జరుగుతుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెరుగైన పరిహారంతో రైతులను ఒప్పించిన తర్వాతే భూ సేకరణ జరుగుతుందని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి భావ్ సింగ్, ఇన్చార్జి తహసిల్దార్ విజేందర్, సర్వేయర్ లు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంగిస్తే చట్టరీత్యా చర్యలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు నిఘా ఏర్పాటు చేసినట్లు ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి తెలిపారు. మండలంలోని నేరెళ్ల గ్రామపంచాయతీ లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బుధవారం సీఐ రాం నర్సింహారెడ్డి,ఎస్సై జి.మహేష్ లు సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ..ఎన్నికలకు సంబంధించి నామినేషన్, పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని,సోషల్ మీడియాలో ఏ ఒక్కరి మనోభావాలు దెబ్బతీసే పోస్టులు పెట్టవద్దని,శాంతిభద్రతలకు ఆటంకం కల్గించే ఎలాంటి చర్యలకు పాల్పడ్డా చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉల్లంఘనలకు పాల్పడకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని సీఐ రాం నర్సింహారెడ్డి సూచించారు.

## తెలంగాణ సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవ సభలో మంత్రులు, పొన్నం, శ్రీధర్‌బాబు, నాగేశ్వార్‌రావు, లక్ష్మణ్‌లు



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** తెలంగాణ సమగ్రాభివృదికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ వచ్చిన తరువాత గత పాలకు 10 ఏళ్లలో చేయలేని అభివృద్ధి పనులను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండు ఏళ్లలో ఎంతో అభివృద్ధి చేసిందని తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడు , దుద్దిల్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరావు, వడ్లూరి లక్ష్మన్‌లు పేర్కొన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవ సభకు వారు పాల్గోన్ని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేడు హుస్నాబాద్‌కు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయడానికి రావాడం శుభసూచకమని వారు అన్నారు. గత పాలనలో చేసిన అప్పులను తీర్చుతూ నేడు అర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీలను , అనేక సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని అన్నారు. 10 ఏళ్లలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేని రేవంతురెడ్డి పాలను అందరికి రేషన్‌కార్డులతో పాటు సన్నబియ్యం ఇస్తుందని అన్నారు. అలాగే ఇందిరమ్మ ఇల్లు, ఉచిత బస్సు , రెండు వందల యునిట్ల కరంటు, 500వందలకు గ్యాస్ ఇస్తుందని పేర్కోన్నారు. రాజీవ్ అరోగ్యశ్రీ 10 లక్షలకు పెంచామని, అలాగే రాష్ట్రంలో 115 ఎటిసి సెంటర్లను ప్రారంబించి, అందులో చదువుకునే వారికి ఏడాదికి 2లక్షలు తీసుకునేలా కార్యచరణం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్బంగా హుస్నాబాద్ సమగ్రాభివద్దికి 262. 78 కోట్లాతో అభివృద్ది పనులకు ముఖ్యమంత్రి శంకుస్తాపన చేశారు.

**హుస్నాబాద్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి ముఖ్యమంత్రికి పొన్నం వినతి**

హుస్నాబాద్ గ్రామీణ ప్రాంతమని ఇక్కడ విద్య వ్యాప్తికి మౌళిక సదుపాయాల కల్పనకు వసతులు కలిపించాలని ముఖ్యమంత్రిని కోరారు. హుస్నాబాద్ నాలుగు జిల్లాల సరిహద్దులో ఉందని దీనికి రింగ్‌రోడ్డు ఇవ్వాలని సిఎంను కోరారు. గౌరవెల్లి ప్రాజెక్టు ఈ ప్రాంతానికి వరప్రధాయినిగా ఉందని గత 10 ఏళ్లుగా మీ సహకారంతో వచ్చె సీజన్‌లో గౌరవెల్లి పూర్తి చేసి హుస్నాబాద్ ప్రాంతానికి సాగు నీళ్ల మీరు చేస్తున్న కృషికి ధన్యావాదాలు తెలిపారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలి

త్వరలో యూడిఐడి కేంద్రం సేవలు అందుబాటులోకి..

ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** దివ్యాంగులు ఆత్మస్థైర్యం తో ముందుకు వెళ్లాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆటల పోటీల కార్యక్రమం బుధవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని, ఆటల పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దివ్యాంగులు అందరితో పాటు చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో సెర్ప్ ఆధ్వర్యంలో త్వరలో యూడిఐడి కేంద్రం అందుబాటులోకి రానున్నదని తెలిపారు. దానిలో పూర్తిస్థాయిలో సేవలు అందుతాయని పేర్కొన్నారు. డే కేర్ సెంటర్ సేవలు సైతం త్వరగా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజంను ఆదేశించారు. రెగ్యులర్ గా శిబిరాలు నిర్వహిస్తూ అలింకో ద్వారా సహాయ ఉపకరణాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సిరిసిల్ల పట్టణానికి చెందిన శ్రీ లక్ష్మీ వికలాంగుల సంఘానికి ఎస్ బీ ఐ ఆధ్వర్యంలో రూ. 8 లక్షల బ్యాంక్ లింకేజ్ రుణం పత్రాన్ని ఆ సంఘం బాధ్యులకు ఇంచార్జి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ సంఘం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ‘ఆల్ఫోర్స్’ విద్యార్థుల ఎంపిక

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి. నరేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్:** విద్యార్థులు వైజ్ఞానిక శాస్త్రం పట్ల అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేయడం ద్వారా విజయాలు సాధించవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైజ్ఞానిక శాస్త్రం చదవడం వల్ల విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, తద్వారా నూతన ఉత్సాహం వస్తుందని తెలిపారు. నిపుణులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తూ, ప్రయోగాత్మక బోధన ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తున్నామన్నారు. ప్రాథమికంగా పాఠశాల స్థాయిలో పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని తదుపరి స్థాయిలకు ఎంపిక చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి రాంమొండయ్య, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, డిసిఇబి కార్యదర్శి భగవంత రావు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందిస్తూ జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు. విజేతలకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వారిలో కొత్తపల్లి ఇటెక్నో పాఠశాల నుంచి పి.నిశాంత్ (చెక్కపొడితో ముద్రణ), ఆండ్రియా మదన్ జోస్ (ఇసుక విద్యుత్), బి.స్నితిక్ (స్వర్ణ నిష్పత్తి), వెదిర బాలుర రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఎస్.నితీష్ కుమార్ (హరిత శక్తి), వావిలాలపల్లి గర్ల్స్ ఇటెక్నో పాఠశాల నుంచి అవిజ్ఞ (ఆటోమేటిక్ విత్తనాలు నాటే యంత్రం) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు

కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం




**ప్రజాపక్షం/కరీంనగర్:** జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లు, నామినేషన్ల వివరాలు, భద్రతా ప్రణాళికపై పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వారు పాల్గొని జిల్లాలోని ఎన్నికల సన్నద్ధతపై వివరించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ రెండు విడతల్లో నామినేషన్ల వివరాలను వెల్లడించారు. మొదటి విడతలో 92 సర్పంచ్ స్థానాలకు 730, 866 వార్డు సభ్యుల స్థానాలకు 2174 నామినేషన్లు దాఖలయ్యాయని చెప్పారు. రెండవ విడతలో 113 సర్పంచ్ స్థానాలకు 888, 1046 వార్డు సభ్యుల స్థానాలకు 3056 నామినేషన్లు వచ్చాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 2946 పోలింగ్ కేంద్రాలలో కనీస వసతులు కల్పించామని, ఎన్నికల సిబ్బందికి డిసెంబర్ 6, 9, 12 తేదీల్లో మూడు దశల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు.
పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ మూడు విడతల్లో జరిగే ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. గత అనుభవాల ఆధారంగా 19 శాతం పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి అక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే 635 మంది పాత నేరస్థులు, రౌడీషీటర్లను బైండోవర్ చేశామని వివరించారు. ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు, ఒక ఎన్‌డిపిఎస్ కేసు నమోదు చేశామని, లైసెన్స్ గల 33 తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని చెప్పారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ టీములు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడె, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా నామినేషన్ల స్వీకరణ నిర్వహించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గ్రామ పంచాయతీ మూడవ విడత ఎన్నికల్లో 6 మండలాల్లోని 119 గ్రామ పంచాయతీ సర్పంచ్, 1088 వార్డు లకు ఈనెల 3 నుంచి నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో బుధవారం గొల్లపెల్లి మండల పరిధిలోని చిల్వాకోడూర్, తిరుమలాపూర్ (పిడి) క్లస్టర్లను సందర్శించి నామినేషన్ల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ,నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు .గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రిజర్వేషన్ల వివరాలు నోటీస్ బోర్డుపై సక్రమంగా ప్రదర్శించబడ్డాయ అనే విషయాన్ని కలెక్టర్ పరిశీలించారు . నామినేషన్ల పత్రాలు ఎంతమంది అభ్యర్థులు తీసుకున్నారనే వివరాలను సంబంధిత అధికారుల నుంచి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు .ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని ,నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.నామినేషన్ కేంద్రాలలో అవసరమైన మేర సదుపాయాలు ఉన్నాయా అని పరిశీలించారు. మూడవ విడత నామినేషన్లు ఈనెల 3 నుంచి 5 వరకు మూడు రోజులపాటు స్వీకరిస్తారని తెలిపారు. చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగు విధంగా ఏర్పాట్లను అధికారులందరు సమన్వయం చేసుకోవాలని సూచించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్లు తిరస్కరణకు గురవుతాయని, అందుకని అభ్యర్థులు ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. ఈ పరిశీలనలో శిక్షణ డిప్యూటీ కలెక్టర్ హరిణి, తహసిల్దార్ అబ్దుల్ మాజీద్, ఎంపీడీవో నీలగిరి రవీందర్ రావు, ఆర్ ఐ జీవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# రీల్

డి జే టిల్లుతో బ్లాక్ బస్టర్ డెబ్యు చేసిన రచయిత దర్శకుడు విమల్ కృష్ణ, ఇప్పుడు యంగ్ ట్యాలెంటెడ్ రాగ్ మయూర్ హీరోగా విలక్షా ప్రొడక్షన్స్ బ్యానర్‌లో హిలేరియస్ ఎంటర్టైనర్ అనుమాన పక్షి మూవీ డైరెక్ట్ చేస్తున్నారు. నిర్మాతలు రాజీవ్ చిలక, రాజేష్ జగ్గియాని, హిరా చంద్ దండ్ నిర్మిస్తున్నారు. మెరిన్ ఫిలిప్ కథానాయిక. ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్ ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేశాయి. మేకర్స్ ఇప్పుడు రాగ్ మయూర్ పాత్ర ద్వారా సినిమా రిలీజ్ టైంని వెల్లడించే ప్రమోషనల్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రోమోలో రాగ్ మయూర్ అనుమాన పక్షిగా పరిచయం అయ్యారు. అతిగా ఆలోచించడం, అతిగా జాగ్రత్తగా ఉండే స్వభావంతో తన చుట్టూ ఉన్నవారిని గందరగోళపరిచే విచిత్రమైన క్యారెక్టర్ ఆకట్టుకుంది. ప్రోమోతో పాటు, చిత్ర ప్రచార కార్యక్రమాలు త్వరలో ప్రారంభమవుతాయని, ఫిబ్రవరిలో



## ఫిబ్రవరిలో రిలీజ్‌కానున్న 'అనుమాన పక్షి'

సినిమా విడుదల కానుందని తెలియజేశారు. ఖచ్చితమైన తేదీని త్వరలో అనౌన్స్ చేస్తారు. బలమైన పాత్రలతో అలరించే దర్శకుడు విమల్ కృష్ణ, ప్రత్యేకంగా రాగ్ మయూర్ కోసం రూపొందించిన యూనిక్ క్యారెక్టర్ తో వస్తున్నారు. అతని సిగ్నేచర్ స్టైల్, హాస్యభరితమైన కథ ప్రమోషనల్ వీడియోలో స్పష్టం గా కనిపిస్తుంది. ఈ చిత్రంలో ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, రాశి, అజయ్, మ స్త్ అలీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫీని, శ్రీ చరణ్ పాకాల సంగీతాన్ని అందిస్తున్నారు, జెకె మూర్తి ఆర్ట్ డైరెక్టర్గా పనిచేస్తున్నారు. అభినవ్ కునపరెడ్డి ఎడిటర్., సంగీతం: శ్రీచరణ్ పాకాల.

## 'ఆంధ్ర కింగ్ తాలూకా' సక్సెస్ మీట్

రామ్ పోతినేని హీరోగా ఇటీవల విడుదలైన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఆన్‌స్క్రీన్ సూపర్‌స్టార్ పాత్రను పోషించారు. ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలో విడుదలైన నేపథ్యంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగాహీరో రామ్ పోతినేని మాట్లాడుతూ కొన్ని పరిస్థితుల వల్ల నవంబర్ ఎండ్‌లో రిలీజ్ చేయాల్సి వచ్చింది. అయితే మాకు ఆడియన్స్ మీద పూర్తి నమ్మకం ఉంది. ఎప్పుడు చేయనంత గా సినిమాని ప్రమోట్ చేశాం. ఎందుకంటే నాకు అంత పర్సనల్ కనెక్షన్ ఉంది. ఇలాంటి ఎమోషన్ ప్రపంచంలో ఎక్కడా లేదు. మన తెలుగు సినిమాకే సొంతం. ఒక సినిమా చేస్తున్నప్పుడు హిట్టా ఫ్లాపా అనేది భయమేస్తుంది. కానీ ఈ సినిమా చేసినప్పుడు మాత్రం ఇది మంచి సినిమా అని అర్థం అయింది. హీరోయిన్ భాగ్యశ్రీ మాట్లాడుతూ ఈ సినిమాలో మంచి క్యారెక్టర్ చేశానని, జనం అందరూ మెచ్చుకుంటూ ఉన్నారని , చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ సక్సెస్ మీట్ లో డైరెక్టర్ మహేష్ బాబు , మ్యూజిక్ డైరెక్టర్స్ వివేక్, మర్విన్ , నిర్మాత రవి పాల్గొన్నారు.





## ఆ వార్తలు నిజం కావు

### పుకార్లు ప్రచారం చేయకండి : నిర్మాత దిల్ రాజు

బ్లాక్ బస్టర్ హిట్ అయిన రాజు వెడ్స్ రాంబాబు టీమ్‌ను ఘనంగా సన్మానించిన నిర్మాత, ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుండి రాబోయే సినిమాల గురించి ఈ మధ్య రకరకాల పుకార్లు వినిపిస్తున్నాయి. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవని, వాటిలో నిజం లేదని ప్రముఖ నిర్మాత దిల్ రాజు అన్నారు. ఎప్పుడో వచ్చిన పాత ఊహాగానాలకు, ఇప్పటి విషయాలకు కొంత మంది ముడిపెట్టి తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం అక్షయ్ కుమార్ హీరోగా, అనీస్ బాజ్మీ దర్శకత్వంలో ఒక సినిమాను ప్లాన్ చేస్తున్నాము. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రాథమిక పనులు జరుగుతున్నాయి. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలను మేమే అధికారికంగా ప్రకటిస్తాము. దయచేసి అప్పటి వరకు మా నుండి అధికారిక సమాచారం వచ్చేదాకా ఎలాంటి నిర్ధారణలకు రావొద్దని తెలిపారు. ధృవీకరించని వార్తలను మీ మీడియాలో ప్రచారం చేయవద్దని కోరుతున్నాను అని దిల్ రాజు పేర్కొన్నారు.

## 'ఓ.. సుకుమారి' టైటిల్ పోస్టర్ రిలీజ్

యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ తమ చిత్రాలు 'ప్రీ వెడ్డింగ్ షో', 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి ఓ హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా 'శివం భజే' తర్వాత ఈ బ్యానర్‌లో రూపొందుతన్న చిత్రమిది. మేకర్స్ ఈ చిత్రం టైటిల్ ' ఓ.! సుకుమారి'ని రివిల్ చేశారు. ఆకట్టుకునే పోస్టర్ను మేకర్స్ ఆవిష్కరించారు. ఇందులో నీలిరంగు హృదయ చిహ్నాన్ని ఒక అద్భుతమైన నారింజ రంగు



మెరుపుతో డిజైన్ చేశారు. గ్రామ ప్రజలు పరిగెడుతూ కనిపంచడం కథలోని ఊహించని మలుపులను సూచిస్తుంది. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం సినిమాకి పని చేస్తోంది. రజాకార్, పోలిమేర చిత్రాలకు సినిమాటోగ్రఫీ చేసిన సి.హెచ్. కుషేందర్ ఈ చిత్రానికి కెమెరామ్యాన్. ఎం.ఎం. కీరవాణి శిష్యుడు భరత్ మంచిరాజు సంగీతం సమకూరుస్తారు. బలగం ఫేం తిరుమల ఎం. తిరుపతి ఆర్ట్ డైరెక్టర్, క చిత్రానికి ఎడిటింగ్ చేసిన శ్రీ వర ప్రసాద్ ఎడిటర్. స్వయం భు చిత్రానికి పని చేస్తున్న అను రెడ్డి అక్కటి ఈ చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్. పాపులర్ లిరిక్ రైటర్ పూర్ణచారి ఈ చిత్రంలోని పాటలు రాస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.


## తెరపై ఘంటసాల బయోపిక్



తెలుగు సినిమా తొలితరం నేపథ్య గాయకులలో ఒకరు, దిగ్గజ సంగీత దర్శకుడు, తన విలక్షణమైన బాణీలతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాలను దోచుకున్న ఘంటసాల బయోపిక్ రూపొందించారు దర్శకుడు సి.హెచ్. రామారావు. ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని, ఆయన లైఫ్ లోని విభిన్న ఘట్టాలను ఈ సినిమాలో కళ్ళకు కట్టినట్లు చూపించి కేవలం ప్రివ్యూ షోలతోనే ప్రేక్షకుల చేత ఔరా అనిపించారు. ఈ జీవిత చరిత్రాత్మక చిత్రం ఆదిలోనే ఘనమైన స్పందనను పొందుతోంది. ఘంటసాల వీరాభిమానుల కోరిక మేరకు లండన్, సింగపూర్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో ప్రత్యేక ప్రివ్యూ షోలు నిర్వహించగా.. అక్కడి భారతీయులు ఈ చిత్రాన్ని చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఘంటసాల గాత్రం, గౌరవం, మహిమను మరోసారి అనుభవించే అవకాశం ఇచ్చింది అని వాళ్లంతా అక్కడి మీడియాకు వెల్లడించారు. లెజెండ్ ఘంటసాల బయోపిక్ ఇంత గ్రాండ్ గా, ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా చేసిన దర్శకుడు సి.హెచ్. రామారావు ప్రతిభను అంతా మెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమాను తెలుగు ప్రేక్షకుల కోసం, వరల్ వైడ్ ఆడియన్స్ కోసం డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సిద్ధం చేశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్లో ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుంది.

## అభినయంతో ఆకట్టుకుంటున్న నటి పోతన హేమ

రంగుల ప్రపంచంలోకి దూసుకొచ్చింది ఓ తార.. ఆటంకాలు, అడ్డంకులు దాటుకుని ఆత్మవిశ్వాసంతో సినీ ప్రయాణం చేస్తోంది యువనటి హేమ పోతన. అందంఅభినయంతో సినీ రంగంలో బంగారు భవిష్యత్తు నిర్మించుకుంటోంది. చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయినా, దుఃఖాన్ని బలంగా మార్చుకుని జీవితాన్ని స్వయం గా తీర్చిదిద్దుకుంటోంది. విజయవాడకు చెందిన హేమ చిన్నప్పటి నుంచే జిజ్ఞాస, ధైర్యం అనే రెండు విలువలను ఒడిసి పట్టుకుని పెరిగింది. తల్లిదండ్రులు లేని లోటు ఉన్నప్పటికీ, బాధకు లోనవకుండా, నా జీవితాన్ని నేను నిర్మించుకుంటాను అనే స్పష్టమైన సంకల్పంతో హైదరాబాదులో అడుగుపెట్టింది. ఆ ధైర్యమే 2013లో ఆమెను మిస్ హైదరాబాద్ కిరీటం దక్కేలా చేసింది. అక్కడి నుంచి ఆమె ప్రయాణం కొత్త మలుపు తీసుకుంది. సినిమాలపై మక్కువతో టాలీవుడ్లో అడుగుపెట్టిన హేమ, 100% లవ్, చలాకీ, కాఫీబార్, రాజ్.. తదితర సినిమాల్లో నటించి తన నటన ప్రతిభను చూపించింది. ఒక రోజు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఆమె జీవితాన్ని పూర్తిగా కుదిపేసింది. డాక్టర్లు కూడా చేతులెత్తేసేంత తీవ్ర పరిస్థితి. కానీ ఆమె మాత్రం ఓడిపోలేదు. మళ్లీ నిలబడింది. ఆ ప్రమాదం ఆమెను ఆపలేదు మరింత శక్తివంతురాలిని చేసింది. తాజాగా హేమ 'మదం' అనే గ్రామీణ నేపథ్య చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తోంది. కథలో భావోద్వేగం, నటనకు విపరీతమైన స్కోప్ ఉన్న ఈ సినిమాతో తన ప్రతిభను మరొక మెట్టుకు తీసుకెళ్లాలని ఆమె లక్ష్యం. సినీ ఇండస్ట్రీలో గాడ్ఫాదర్ లేకపోయినా, తన ఆత్మవిశ్వాసం, పట్టుదల, కష్టపడే స్వభావం ఆమెను ఇండస్ట్రీలో వరుస అవకాశాలు దక్కించుకునేలా చేశాయి. ప్రేక్షకుల అభిమానం పెరుగుతోంది. హేమ పోతన ప్రయాణం. సినిమాను మించిన కథ, పట్టుదలతో కొనసాగుతోన్న విజయం. సినీ రంగంలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని ముందుకు సాగుతోంది ఈ వర్ధమాన నటి.



## 'అన్నగారు' లిరికల్ సాంగ్ రిలీజ్

తమిళ హీరో కార్తి నటిస్తున్న మూవీ 'వా వాతియార్' తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అన్నగారు వస్తారు' టైటిల్ తో రాబోతోంది. 'అన్నగారు వస్తారు' సినిమాను ఈ నెల 12న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. 'అన్నగారు వస్తారు' రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ తో పాటు ఈ చిత్రం నుంచి 'అన్నగారు' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ సాంగ్‌ను సంతోష్ నారాయణన్ కంపోజ్ చేయ గా, రాకేందు మౌళి సాహిత్యం అందించారు. ఎస్.పి.అభిషేక్, హరిప్రియ ఈ పాటను పాడారు. రీసెంట్ డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేసిన 'అన్నగారు వస్తారు' సినిమా టీజర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ప్రమోషనల్ కంటెంట్ కు వస్తున్న రెస్పాన్స్



చూస్తుంటే ఈ సినిమా హీరో కార్తి కెరీర్ లో మరో బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం ఏర్పడిందని నిర్మాత జ్ఞానవేల్ రాజా ఆశాభావం వ్యక్తం చేశారు. కార్తి, కృతి శెట్టి, సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణా కరణ్, తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ జార్జ్ సి. విలియమ్స్, ఎడిటింగ్ వెట్రే కృష్ణన్, సంగీతం సంతోష్ నారాయణన్, నిర్మాత కె. ఇ. జ్ఞానవేల్ రాజా, రచన, దర్శకత్వం నలన్ కుమారస్వామి .

### కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపంలో

## బాంబు కలకలం

### రైలు పట్టాలపై పేలిన నాటు బాంబు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద బాంబు కలకలం రేపింది. రైల్వే స్టేషన్‌కు అతి సమీపంలో గల రైలు పట్టాల మీద నాటు బాంబును కుక్క నోట కొరకడంతో పేలి ఆ కుక్క మూతి భాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల ప్రకారం బాంబు పేలిన సమీపంలోనే ఉల్లిపాయ ఆకారంలో బాంబులు ఉంటంతో తినే పదార్థాలు అనుకుని అక్కడికి చేరుకున్న కుక్క దానిని కొరికే ప్రయత్నం చేసింది. దీంతో ఒక్క సారిగా ఆ నాటు బాంబు పేలింది. దీంతో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా తీవ్ర అలజడి చెలరేగింది. బాంబు లు ఎవరు తెచ్చి పెట్టారు అనే దానిపై తీవ్ర చర్చ మొదలైంది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను తనిఖీలు చేశా రు. బాంబు పేలిన ప్రదేశానికి అతి సమీపంలో చెత్తకుండీ ఉండటంతో దానిని కూడా పరిశీలించారు. ఆ కుండీలో మరో ఐదు నాటు బాంబులు కనిపించడంతో వాటిని పోలీసులు స్వాధీనం చే సుకున్నారు. ఈ విషయంపై ఎస్పి రోహిత్ రాజ్ స్పందిస్తూ అడవి జంతుల వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు నాటు బాంబులు సిద్ధం చేసుకుని ఉంటారని చెప్పారు. ఇందులో ఎలాంటి కుట్ర కోణం లేదని, చెత్తకుండీలో నాటు బాంబులు ఎవరు వేశారు అనే దానిపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎవ్వరూ అభద్రతా భావానికి గురి కావద్దని సూచించారు.





## వెంటనే పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

భాగస్వామ్యమయ్యాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు రాష్ట్ర నలు మూలల నుండి భారీగా జర్నలిస్టులు తరలివచ్చిన జర్నలిస్టుల నినాదాలతో మహానగరం రోడ్లన్నీ దద్దరిల్లాయి. రాష్ట్ర సమాచార శాఖ సంయుక్త సంచాలకులు డి.ఎస్.జగన్‌కు జర్నలిస్టుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు మహాధర్నాను ఉద్దేశించి ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఎం.ఎ.మజీద్, జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి కె.రాములు, ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, నగునూరి శేఖర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, రమేష్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, కె.నరహరి, వీడియో జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, హరీష్, జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గోపరాజు, హెచ్‌యుజె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, ఉర్దూ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్, సీనియర్ మహిళా జర్నలిస్టులు విమల, అత్తలూరి అరుణ, వాకటి మంజుల, కళ్యాణం రాజేశ్వరీ తదితరులు ప్రసంగించారు. దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో మీడియా సంస్థల యాజమాన్యాన్ని ధిక్కరించి ఉద్యమంలో భాగస్వామ్యులైన జర్నలిస్టులు ప్రస్తుతం వారి హక్కులకు పోరాడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం నెహ్రూను దేశ ప్రజల ముందు ద్రోహిగా చిత్రీకరించి, ఆయన పేరునే రూపుమాపాలని చూస్తుందని మండిపడ్డారు. ఇటీవల మోదీ ప్రభుత్వం గతంలో ఉన్న 27 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తగా 4 లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందని, వాటి వల్ల కార్మిక వర్గంతో పాటు జర్నలిస్టులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. నూతన లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని జర్నలిస్టు సంఘాల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హాయంలో జర్నలిస్టుల సమస్యలు అరకొరగానే తీరాయని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా చొరవ తీసుకుని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పాలనలోనే జర్నలిస్టుల సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని విశ్వసిస్తున్నామన్నారు. 'ఏదో ఒక రోజు అన్ని కిరీటాలు కింద పడిపోవాల్సిందే. ప్రతి సింహాసనం కూలిపోవాల్సిందే'నని, ప్రభుత్వాలు దీనిని దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని అమర్ సూచించారు. కె.విరాహత్ అలీ అధ్యక్షపన్యాసం చేస్తూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా జర్నలిస్టులు అత్యంత నిరాదరణకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ కాలంలోనూ, ఆ తర్వాత పదేళ్ల పాలనలోనూ జర్నలిస్టులకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని, ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో పయనిస్తుండడం విచారకరమన్నారు. అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తిపరమైన కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్య తరగతి పత్రికలను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా విషయాలను పట్టించుకోవాల్సిన సమాచార శాఖ కమిషనర్లను తరచూ మార్చడం, ఆ శాఖను నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దానిపై దృష్టి సారించకపోవడం జర్నలిస్టులలో ఆందోళన కలిగిస్తుందన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో సమాచార శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సమస్యలను పరిష్కరించనట్లయితే రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న జర్నలిస్టులందరినీ హైదరాబాద్‌కి రప్పించి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని విరాహత్ అలీ హెచ్చరించారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామ్‌నారాయణ మాట్లాడుతూ 'రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ జర్నలిస్టుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు' అన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా జర్నలిస్టుల హక్కులను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 33 జిల్లాల నుంచి టియుడబ్ల్యుజె ప్రతినిధులు పాల్గొన్నారు.

## చాడ వెంకట్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నుకుంది. ఈ సమావేశంలో ట్రస్టు కార్యదర్శి కందిమల్ల ప్రతాప రెడ్డి, సభ్యులు ఉజ్జిని రత్నాకర్ రావు, బొమ్మగాని ప్రభాకర్, రావి ప్రతిభ, కె.శ్రీనివాస్ రెడ్డి, ఎస్ వెంకట్రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా ట్రస్టు కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ట్రస్ట్ చైర్మన్‌గా ఉన్న సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి మరణించడంతో ఆయన స్థానంలో ట్రస్టు చైర్మన్‌గా చాడ వెంకట్ రెడ్డి , కోశాధికారిగా రావి ప్రతిభను ఎన్నుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా సిపిఐ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 26న ఆడిటోరియంలో బహిరంగ సభ నిర్వహించడంతో పాటు తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ఫోటోలు, పోరాట ఘట్టాలతో ఆడిటోరియం పైన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ట్రస్టు నిర్వహణ బాధ్యతలు ట్రస్టు సభ్యులు బి.ప్రభాకర్, కాంతయ్య లకు అప్పగించినట్లు వెల్లడించారు. అమరవీరుల ఎగ్జిబిషన్ నిర్వహణ బాధ్యతలను ఎస్. వెంకటేశ్వర్ రెడ్డి డా. లక్ష్మ ణ్ కు ఆడిటోరియంలో లైబ్రరీ నిర్వహణకు కే. లక్ష్మణరావుకు అప్పగించినట్లు ప్రతాపరెడ్డి తెలిపారు.







## సామాన్యులకు చుట్టం

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాకు 70 గ్రామాలను ఎంపిక చేసి భూదార్ కార్డులు అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఇంతవరకుభూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులలో అర్హత కలిగిన వాటిని జనవరి నెలాఖరు కల్లా పరిష్కరించి, ఆ తర్వాత ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాం నుంచి చోటుచేసుకున్న అక్రమాలను వెలికితీసేందుకు గాను ఇంతవరకు రెండు జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ జరుగుతోందని, వాటి ఫలితాల ఆదారంగా రాష్ట్ర వ్యాప్తంగా అక్రమార్కుల భరతం పడతామని మంత్రి స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిననాటికి 2.45 లక్షల ధరణీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, ఆ తర్వాత మరో నాలుగు లక్షల దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటినీ పరిష్కరించి ప్రజల సంతృప్తికి తొలిఅడుగు వేశామన్నారు. టెరాసిస్ అనే విదేశీ సంస్థ చేతిలో ఉన్న ధరణి పోర్టల్ నిర్వహణను కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్ఐసికి అప్పగించడం ద్వారా తెలంగాణ రైతుల కోటీ 56 లక్షల ఎకరాల భూమి వివరాలు ఇప్పుడు సురక్షితమైన స్వదేశీ సంస్థ పరిధిలోకి తీసుకువచ్చామని తెలిపారు. . రాష్ట్రంలో రెవెన్యూ సేవలను సరళీకృతం చేయడం, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు దశల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ద్వారా అధికారులే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలకు సంబంధించి రైతులను నుంచి దరఖాస్తులను దాదాపు 9 లక్షలకు పైగా దరఖాస్తులు స్వీకరించారన్నారు. . వీరందరికీ నోటీసులు జారీ చేసి దరఖాస్తులు పరిష్కరిస్తున్నామని తెలిపారు.అధికారంలోకి వస్తే గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని 10,954 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్ వారీగా విభజించి జీపీవోలను నియమించామని, అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకునే ప్రక్రియలో ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులను భర్తీకి చర్యలు చేపట్టడంతోపాటు లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు లైసెన్స్డ్ సర్వేయర్లను నియయానికి గాను ఇప్పటికే దాదాపు 4 వేల మందికి శిక్షణ ఇచ్చి లైసెన్సు జారీ చేశామని మంత్రి వెల్లడించారు. డిసెంబర్ నెల నుంచి మరో మూడు వేల మంది లైసెన్స్డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. హిల్ట్ పాలసీపై మాజీమంత్రి కెటిఆర్ నోరుందని ఏదిపడితే అది మాట్లాడుతున్నరన్నారు. ఆనాడు ప్రభుత్వంలో ఎంఎయుడి మంత్రిగా ఆయనకు నచ్చిన వారికి ముడుపులు చెల్లించిన వారికి ల్యాండ్ కన్వర్షన్ చేశారని,. వారికి అవసరమైన ప్రాంతాలను రెసిడెన్షియల్ ప్రాంతాలుగా మార్చారని కాని తాము అలా చేయలేదని, పారదర్శకంగా క్యాబినెట్ తీర్మానం చేశామని చెప్పారు. ఆనాడు కన్వర్షన్ చేసిన ల్యాండ్ వివరాల చిట్టాను త్వరలోనే విప్పుతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com